బ్యాంకుల్లో చెక్కుల క్లియరెన్స్ కష్టాలు

కస్టమర్ల సహనాన్ని పరీక్షిస్తున్న సీటీఎస్

దేశవ్యాప్తంగా నిలిచిపోయిన రూ.లక్షల కోట్ల లావాదేవీలు

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాకపోవటమే కారణమంటున్న బ్యాంకులు

2

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఐక్లౌడ్ పాస్‌వర్డ్ రీసెట్ చేయండి

అధికారులకు యాక్సెస్ ఇవ్వండి.. ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టు ఆదేశం

మనవడు ఫోన్ పగలగొట్టాడు.. పాస్‌వర్డ్ మరిచానంటున్నారు

కస్టడీలోకి తీసుకుని విచారిస్తేనే నిజాలు వెల్లడి

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్‌జీ తుషార్ మెహతా వాదన.. నవంబరు 18కి వాయిదా

14

బుధవారం | 15-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 197 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: నవమి ఉ.10.34 తదుపరి దశమి, నక్షత్రం: పుష్యమి మ.12.00 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.1.10-2.49, దుర్ముహూర్తం: ఉ.11.37-12.24, అమృతఘడియలు: శేషం ఉ. 7.10 వరకు, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.11, సూర్యాస్తమయం: 5.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇలాంటివాణ్ని ఎందుకు కన్నావ్!

భర్త వేధింపులు తాళలేక పిల్లలను చంపి, భవనం పైనుంచి దూకి తల్లి ఆత్మహత్య

కవల పిల్లల్లో ఒకరికి పుట్టుకతోనే రాని మాటలు

లోపం నీవల్లే అంటూ భార్యపై భర్త వేధింపులు

మనోవేదనకు గురై తీవ్ర నిర్ణయం తీసుకున్న మహిళ

హైదరాబాద్ బాలానగర్‌లో విషాదకర ఘటన

14



మాజీ ఎంపీపీ గోలి శ్యాంసుందర్ రెడ్డి

ఓ తండ్రి తీర్పు

సంరక్షణ మరిచిన కుమారుడికి మాజీ ఎంపీపీ గుణపాఠం

3 కోట్ల విలువ చేసే 3 ఎకరాలు ప్రభుత్వానికి అప్పగింత

ఆ భూమిలో భార్య జ్ఞాపకార్థం భవనం నిర్మించాలని వినతి

హనుమకొండ జిల్లాలో ఘటన

14

బీఆర్ఎస్ హయాంలో విద్యార్థులకు అన్యాయం!

అది నిజమే.. అందుకనే ఎన్నికల్లో పార్టీకి ఓటమి

గ్రూప్-1 అభ్యర్థులతో మాట-ముచ్చటలో కవిత వ్యాఖ్యలు

ఉద్రిక్త పరిస్థితుల నడుమ భేటీ.. కేసీఆర్ పాలనలో పేపర్ లీకేజీలపై కవితను నిలదీసిన నిరుద్యోగులు

3

కేసీఆర్ ఫొటో లేకుండా జిల్లాల్లో కవిత యాత్రలు!

జాగృతి పోస్టర్లలో ఇక నుంచి జయశంకర్ ఫొటోలు

మళ్లీ బీజేపీ ప్రభుత్వమే.. నేనే రైల్వే మంత్రిని!

వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి రాజకీయాలకు అనర్హుడు

ఆయన పేరు అప్పట్లో నేనే ప్రతిపాదించా

కానీ.. పార్టీ నడపడంలో ఆయన విఫలం

బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



3

మల్లోజుల వేణుగోపాల్‌రావు

లొంగుబాటు

గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత

ఆయనతోపాటు మరో 60 మంది.. 54 ఆయుధాల అప్పగింత

నక్సలైటు ఉద్యమంలో మల్లోజులది 45 ఏళ్ల ప్రస్థానం

పార్టీ సిద్ధాంతకర్తగా, బాహ్యప్రపంచంతో అనుసంధానకర్తగా పేరు

ఆపరేషన్ కగార్ నేపథ్యంలో భిన్న వైఖరి

సాయుధ పోరు వదిలేద్దామని మల్లోజుల ప్రతిపాదన, లేఖ

వదిలేది లేదని ప్రకటించిన పార్టీ

కొంతకాలంగా మల్లోజుల లొంగుబాటుపై ఊహాగానాలు

ఆయన మీద రూ.6 కోట్ల రివార్డు, 100కుపైగా కేసులు



మల్లోజుల వేణుగోపాల్‌రావు (ఫైల్)

పెద్దపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా వామపక్షవాదులు, ప్రజాసంఘాల శ్రేణులు ఊహిస్తున్నట్లుగానే.. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు పోలీసులకు లొంగిపోయారు. నాలుగున్నర దశాబ్దాల ఉద్యమ, అజ్ఞాత జీవితం వీడి మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట 60 మంది మావోయిస్టులతో కలిసి ఆయన లొంగిపోయారు. వీరిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన ముగ్గురు సభ్యులు, పలు డివిజినల్ కమిటీలకు చెందిన పది మంది సభ్యులు కూడా ఉన్నారు. మొత్తం 54 ఆయుధాలతో సహా వీరు లొంగిపోయారని, ఆ ఆయుధాల్లో ఏడు ఏకే 47లు, తొమ్మిది ఇన్సాస్ రైఫిళ్లు ఉన్నాయని ఒక పోలీసు అధికారి వెల్లడించారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మావోయిస్టులు వారంతటవారే లొంగిపోయేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. మహారాష్ట్రలోని హోడ్రి అనే గ్రామం వద్ద నుంచి వారిని పోలీసు వాహనాల్లో గడ్చిరోలి పోలీసు ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చామని వెల్లడించారు. అక్కడ ఆయుధాలను అప్పగించి వారు లొంగిపోయారన్నారు. కాగా, మల్లోజుల వేణుగోపాల్‌రావు మీద రూ.6 కోట్ల రివార్డు ఉంది. వందకు పైగా కేసులు నమోదై ఉన్నాయి.

అత్యంత కీలక నేతల్లో ఒకరు

70 ఏళ్ల వయసున్న వేణుగోపాల్‌రావు అలియాస్ భూపతి, సోనును మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన నేతల్లో ఒకరిగా భావిస్తారు. ఆ పార్టీ సిద్ధాంతకర్తగా ఆయనకు పేరుంది. ఛత్తీస్‌గఢ్ అడవుల్లోని పార్టీకి బాహ్య ప్రపంచానికి మధ్య ఆయన అనుసంధానకర్తగా కూడా వ్యవహరించినట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో ఈ ఏడాది మే నెలలో మావోయిస్టు పార్టీ

మిగతా 2వ పేజీలో...

లొంగుబాట్ల వెనుక పోలీసు నిఘా వర్గాల సుదీర్ఘ కసరత్తు 2



రేపు క్యాబినెట్

సమావేశం

బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై చర్చ

సాగునీటి ప్రాజెక్టులు, మూసీ, మెట్రోపైనా..

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం గురువారం (ఈ నెల 16న) సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం కానుంది. సచివాలయం ఆరో అంతస్తులోని క్యాబినెట్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు, సాగునీటి పారుదల ప్రాజెక్టులు, ధాన్యం సేకరణ, మెట్రో రైలు ప్రాజెక్టు తదితర అంశాలు చర్చకు రానున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం

మిగతా 13వ పేజీలో...

42%.. ధర్మబద్ధమైన కోరిక

సుప్రీంలో తప్పక న్యాయం జరుగుతుంది!

మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సుప్రీంకోర్టులో రేపు విచారణకు అవకాశం

18న బీసీల బంద్‌కు సంపూర్ణ మద్దతు: టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం 13

డీసీసీ అధ్యక్షులుగా కొత్త ముఖాలు 12



ఓ చెరువులో కట్టిన ఇళ్లు వర్షపు నీటికి మునిగిన దృశ్యం (ఫైల్)

'ఎన్‌వోసీ' ఇంజనీర్లపై

బదిలీ వేటు

రాజధానిలో చెరువులు, కుంటల్లో నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులిచ్చిన వారిపై కొరడా

హైదరాబాద్ నుంచి ఇతర జిల్లాలకు 51 మంది బదిలీ

వర్కింగ్ అరేంజ్‌మెంట్ పేరుతో పంపించిన ప్రభుత్వం

వారి స్థానాల్లో జిల్లాల నుంచి 55 మంది ఓడీపై రాక

నీటిపారుదల శాఖ సంచలన నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, కాల్వల్లో నిర్మాణాలకు నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీలు) జారీ చేసే అడ్డగోలు దందాకు బ్రేక్ వేసే దిశగా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) నుంచి చీఫ్ ఇంజనీర్(సీఈ) దాకా భారీగా ముడుపులు తీసుకుంటూ ఎన్‌వోసీలు జారీ చేస్తున్నట్లు ఫిర్యాదులు

మిగతా 13వ పేజీలో...

వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.500 కోట్లు!

తక్షణమే నిధులు విడుదల.. ఇకనుంచి ప్రతి నెలా 340 కోట్లు

కేంద్ర నిధులపై దృష్టి పెట్టాలి.. వైద్యశాఖ సమీక్షలో సీఎం రేవంత్



స్లీపర్ బస్సులో మంటలు

20 మంది మృతి

రాజస్థాన్‌లో దారుణం.. షార్ట్ సర్క్యూట్ కారణమని సందేహాలు

2

కన్నీటి మంటలు!

మాగంటి సునీత కన్నీళ్లపై డైలాగ్ వార్

కార్యకర్తల సమావేశంలో భర్తను తలుచుకుని కన్నీళ్లు పెట్టిన సునీత

ఆమె పట్ల సానుభూతి ఉందంటూనే.. కన్నీళ్లు పెట్టడమేంటన్న పొన్నం

అధికారం కోసం మహిళ కన్నీళ్లనూ బీఆర్ఎస్ వాడుకుంటోంది: తుమ్మల

భావోద్వేగాలపై విమర్శలా?.. కాంగ్రెస్ నేతలు నీతిమాలినవారు: కేటీఆర్



మాగంటి సునీతకు బీ ఫాం

ఎన్నికల ఖర్చులకు రూ.40 లక్షల చెక్కు అందజేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

జూబ్లీహిల్స్‌లో తమదే విజయమని ధీమా

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక యుద్ధంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత కన్నీరు.. మంటలు రేపుతోంది. బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో తన భర్త, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను తలుచుకుని సునీత పెట్టుకున్న కన్నీళ్లు, దీనిపై మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు, అందుకు బీఆర్ఎస్ ముఖ్యనేతలు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ కౌంటర్లతో మంగళవారం ప్రచారం హీటెక్కింది. వాస్తవానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

మిగతా 12వ పేజీలో...



దీపావళి ఎప్పుడు?

ఈ నెల 20వ తేదీనా?.. 21నా??

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెలవుల జాబితాలో 20నే!

తెలంగాణ విద్వత్ సభ కూడా అదే రోజు పండుగ అని వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి ఎప్పుడు? క్యాలెండర్‌లో చూస్తే అమావాస్య అక్టోబరు 20వ తేదీ మధ్యాహ్నం దాటాక వచ్చి 21 సాయంత్రం దాకా ఉన్నట్టు కనిపిస్తోంది! ఇలా రెండు రోజుల్లో వ్యాపించి ఉండడంతో పండుగ ఏ రోజు జరుపుకోవాలనేదానిపై అందరిలో సందేహం నెలకొంది. 2025 సంవత్సరంలో సెలవులకు

మిగతా 12వ పేజీలో...

హలో ఏపీ..

ఓకే గూగుల్



ఢిల్లీలో 'భారత్ ఏఐ శక్తి' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో అశ్విని వైష్ణవ్, నిర్మల, లోకేశ్, థామస్ కురియన్

విశాఖలో గూగుల్ అతి పెద్ద ఏఐ హబ్

ఏపీ, గూగుల్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం

రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడికి సిద్ధం

అమెరికా వెలుపల ఆ సంస్థకున్న అత్యంత భారీ డేటా సెంటర్ ఇదే

2 లక్షల మంది ఐటీ నిపుణులకు కొలువులు

12 దేశాలకు విశాఖ కేంద్రంగా సేవలు

గూగుల్ ఏఐ హబ్‌తో దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఊతం: ప్రధాని మోదీ

ఏఐ ఆవిష్కరణలు వేగవంతం: సుందర్ పిచాయ్

(న్యూఢిల్లీ/అమరావతి-ఆంధ్రజ్యోతి)

గూగుల్... 'హలో ఏపీ' అని పలకరించింది. ఏపీ... 'ఓకే గూగుల్' అని ప్రతిస్పందించింది. పెట్టుబడుల పరంగా ఏపీ చరిత్రలోనే... ఇంకా చెప్పాలంటే భారత దేశంలోనే ఒక కొత్త అధ్యాయం మొదలైంది. భారత్‌లో గూగుల్ అతిపెద్ద పెట్టుబడికి ఏపీలోని విశాఖ కేంద్రంగా మారుతోంది. అమెరికా వెలుపల

మిగతా 13వ పేజీలో...

పోలవరం, దేవాదులపై 29న ప్రధాని మోదీ సమీక్ష

ఇందిరమ్మ వరద కాలువపై కూడా..

పోలవరం ముంపు రాష్ట్రాల అభ్యంతరాలు, నిర్మాణ అంశాలపై ఆరా తీయనున్న మోదీ

'పోలవరం-బనకచర్ల'ను పరిశీలించొద్దు

కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి లేఖ

14

హరియాణాలో మరో పోలీసు ఆత్మహత్య

ఐపీఎస్ పూరన్ కేసులో కొత్త మలుపు

ఆయనపైనే తీవ్ర ఆరోపణలు చేసిన సైబర్ సెల్ ఏఎస్ఐ సందీప్ కుమార్

'నిజాలు' బయటకొచ్చేందుకు ఆత్మహత్య అంటూ నోట్, వీడియో

కొత్త డీజీపీగా ఓపీ సింగ్ నియామకం

2

బిహార్ ఎన్నికలకు 71 మందితో

బీజేపీ తొలి జాబితా

స్పీకర్ నంద కిశోర్ యాదవ్‌కు దక్కని టికెట్

బీజేపీలో చేరిన గాయని మైథిలి ఠాకూర్.. పోటీకి చాన్స్!

అభ్యర్థులకు లాలూ టికెట్లు.. వెనక్కి తీసేసుకున్న తేజస్వి

ఆర్జేడీ నేతల్లో కలకలం.. లాలూ వైఖరిపై కాంగ్రెస్ గుర్రు

తమ సీట్లపైనా కన్నేయడంతో ఆగ్రహం

2

నర్సింగ్ విద్య.. మిథ్య

చిరునామా ఒక చోట.. కాలేజీ మరో చోట

ఒకే భవనంలో పలు కాలేజీలు.. అనుబంధ ఆస్పత్రుల్లేని వైనం

16 నర్సింగ్ స్కూళ్లలో ఆకస్మిక తనిఖీలతో బయటపడ్డ లోపాలు

ప్రజల ఫిర్యాదుతో.. రాష్ట్రవ్యాప్త తనిఖీలకు మంత్రి ఆదేశం

లోపాలున్న విద్యాసంస్థలకు అండగా ఓ ఉన్నతాధికారి?

10

రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయకుంటే..

మీరే విచారణ చేపడతారా?

రాష్ట్రం హక్కును లాగేసుకుంటారా?

మరి సమాఖ్యవాదం మాటేమిటి?

తమిళనాడు లిక్కర్ లైసెన్సుల కేసులో ఈడీని నిలదీసిన సుప్రీంకోర్టు

దర్యాప్తుపై స్టే పొడిగింపు



2

2030 నాటికి కిలో బంగారం విలువతో రోల్స్‌రాయిస్ కారు!

▸ 2040లో ప్రైవేట్ విమానమే కొనొచ్చు

▸ ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా



న్యూఢిల్లీ, అక్టోబరు 14: పెరగడమే తప్ప తగ్గడమే తెలియదన్నట్టుగా రోజురోజుకూ బంగారం ధర పెరిగిపోతున్న నేపథ్యంలో.. ప్రముఖ వ్యాపారవేత్త, సియెట్ టైర్స్ సహా 15కు పైగా సంస్థలున్న ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా 'ఎక్స్'లో ఒక ఆసక్తికర పోస్టు పెట్టారు. 1980ల నుంచి ఇప్పటిదాకా.. కిలో పసిడి ధర ఎంత ఉందో.. అప్పటికి ఆ సొమ్ముతో ఏ కారు కొనొచ్చో సరదాగా వివరించారు.

సంవత్సరం	బంగారం పరిమాణం	ఏ కారు కొనొచ్చంటే..
1990	కిలో	మారుతి 800
2000	కిలో	ఎస్టీమ్
2005	కిలో	ఇన్నోవా
2010	కిలో	ఫార్చ్యూనర్
2019	కిలో	బీఎండబ్ల్యూ

పాఠం: కిలో బంగారాన్ని దాచిపెట్టుకోండి. 2030లో దాని విలువ రోల్స్ రాయిస్ కారు, 2040లో ప్రైవేట్ జెట్ కొనొచ్చు.. అని హర్ష్ గోయెంకా తన 'ఎక్స్' అకౌంట్‌లో పేర్కొన్నారు. కాగా.. ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తూ చాలా మంది రిప్లైలు ఇవ్వగా.. ఒక వ్యక్తి మాత్రం అందరికీ భిన్నంగా ఆలోచించారు. 2000 సంవత్సరంలో కేజీ బంగారం ధర రూ.4.4 లక్షలని. ఈరోజు కిలో పుత్తడి విలువ రూ.1.18 కోట్ల దాకా ఉందని గుర్తు చేశారు. అదే 2000 సంవత్సరంలో రూ.4.4 లక్షలతో సియెట్ కంపెనీ షేర్ల కొని ఉంటే వాటి విలువ ఇప్పుడు రూ.4.5 కోట్ల దాకా ఉండేదన్నారు.

హరియాణాలో మరో పోలీసు ఆత్మహత్య

▸ ఐపీఎస్ పూరన్ కేసులో కొత్త మలుపు

▸ ఆయనపైనే ఆరోపణలు చేసి ఆత్మహత్యకు పాల్పడ్డ సందీప్ కుమార్



సందీప్, పూరన్

న్యూఢిల్లీ/చండీగఢ్, అక్టోబరు 14: హరియాణాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య కేసుపై విచారణ జరుగుతున్న తరుణంలో పెద్ద ట్విస్ట్ చోటు చేసుకుంది. రాష్ట్రంలో మరో పోలీసు అధికారి మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. సందీప్ కుమార్ అనే ఏఎస్ఐ రోహ్‌తక్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన తన సూసైడ్ నోట్‌లో పూరన్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకొని తీవ్ర ఆరోపణలు చేశారు. సందీప్ కుమార్ రోహ్‌తక్ సైబర్ విభాగంలో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయన పూరన్‌పై నమోదైన ఓ అవినీతి కేసును దర్యాప్తు చేస్తున్నారు. 'నిజాలు' వెలుగులోకి రావడం కోసం ప్రాణత్యాగం చేస్తున్నట్లు తన మూడు పేజీల సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. సందీప్ ఆత్మహత్యకు ముందు ఆరు నిమిషాల వీడియోను కూడా రికార్డు చేశారు. పూరన్ కుమార్ ఒక అవినీతి పోలీసు అధికారి అని, ఆయన అవినీతి బయటకు వస్తుందనే భయంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. కులవివక్ష అంశాన్ని ఉపయోగించి.. వ్యవస్థను హైజాక్ చేశారని ఆరోపించారు. పూరన్ గన్‌మెన్ ఒక లిక్కర్ కాంట్రాక్టర్ నుంచి రూ.2.5 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడని, లంచం ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఐపీఎస్ అధికారి కుల రంగు పూసేందుకు యత్నించారని, చివరకు ఆత్మహత్య చేసుకున్నారని ఏఎస్ఐ ఆరోపించారు. పూరన్ కుమార్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్న 10 మంది అధికారుల్లో ఒకరైన రోహ్‌తక్ మాజీ ఎస్పీ నరేంద్ర బిజార్నియాను ప్రశంసించారు. అయితే సందీప్ కుమార్ సూసైడ్ నోట్‌ను, వీడియోను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, పూరన్ ఆత్మహత్య వివాదం నేపథ్యంలో హరియాణా ప్రభుత్వం కొత్త డీజీపీగా 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ఓంప్రకాశ్ సింగ్‌ను నియమించింది. డీజీపీగా ఉన్న శత్రుజీత్ సింగ్ కపూర్‌ను సెలవుపై పంపిన కొద్ది గంటలకే ఈ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం చండీగఢ్‌లో పూరన్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

విద్యార్థుల ఆత్మహత్యల సర్వేలో పాల్గొనండి!

▸ ఐఐటీ, ఐఐఎంలకు సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ, అక్టోబరు 14: ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థలను ఉద్దేశించి సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. విద్యార్థుల ఆత్మహత్యలకు సంబంధించి జరుగుతున్న సర్వేల్లో పాలు పంచుకోవాలని పేర్కొంది. లేకపోతే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించింది. 2018 నుంచి ఇప్పటి వరకు సుమారు 98 మంది విద్యార్థులు ఆయా విద్యాసంస్థల్లో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 39 మంది ఐఐటీలు, 25 మంది ఎన్ఐటీలు, 25 మంది కేంద్ర విశ్వవిద్యాలయాలు, నలుగురు ఐఐఎంలకు చెందిన వారు ఉన్నారు. ఇంత జరుగుతున్నా సదరు విద్యాసంస్థలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించడం లేదు. అంతేకాదు.. క్యాంపస్‌లలో జరుగుతున్న ఈ మరణాలపై కారణాలు వెలికి తీసేందుకు సుప్రీంకోర్టు నియమించిన సంఘానికి కూడా ఆయా విద్యాసంస్థలు సహకరించడం లేదు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అన్ని విద్యా సంస్థలకు కేంద్రం మరోసారి సర్క్యులర్‌లు జారీ చేయాలని పేర్కొంది. అప్పటికీ స్పందించకపోతే.. తామే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

ఆ మూడు దగ్గు మందులు ప్రమాదకరం

▸ కోల్డ్రిఫ్, రెస్పిఫ్రెష్, రిలైఫ్ సిరప్‌లపై డబ్ల్యూహెచ్‌వో అలర్ట్

న్యూఢిల్లీ, అక్టోబరు 14: మధ్యప్రదేశ్‌లో దగ్గు మందు తాగి చిన్నారులు మరణించిన నేపథ్యంలో డై-ఇథైలిన్ గ్లైకోల్(డీఈజీ)ను పరిమితికి మించి కలిగి ఉన్నట్టు గుర్తించిన మూడు దగ్గు సిరప్‌లపై డబ్ల్యూహెచ్‌వో అలర్ట్‌ను జారీ చేసింది. కల్తీ దగ్గు సిరప్‌లను ఇతర దేశాలకు ఎగుమతి చేశారా? అని భారతదేశ అత్యున్నత మందుల నియంత్రణ సంస్థ సీడీఎస్‌సీవోను వివరణ కోరిన అనంతరం డబ్ల్యూహెచ్‌వో ఈ అలర్ట్‌ను జారీ చేసింది. కాగా, ఈ మందులను ఎగుమతి నిమిత్తం తయారు చేయలేదని, అక్రమంగా ఎగుమతి చేసినట్టు ఆధారాలు కూడా ఏమీ లేవని డబ్ల్యూహెచ్‌వోకు సీడీఎస్‌సీవో తెలియజేసింది. 2022లో గాంబియా దేశంలో కనీసం 70 మంది చిన్నారులు మరణించినప్పటి నుంచి భారత్‌లో తయారైన సిరప్‌లపై డబ్ల్యూహెచ్‌వో జారీ చేసిన 5వ అలర్ట్ ఇది.



ఏసీ బస్సులో మంటలు.. రాజస్థాన్‌లో 20 మంది మృతి


జైపూర్, అక్టోబరు 14: రాజస్థాన్‌లో మంగళవారం ఘోర బస్సు ప్రమాదం సంభవించింది. ప్రయాణిస్తున్న ఏసీ స్లీపర్ బస్సులో మంటలు వ్యాపించడంతో కనీసం 20 మంది మరణించినట్టు పోలీసులు తెలిపారు. చాలా మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. షార్ట్ సర్క్యూటే ఇందుకు కారణమని భావిస్తున్నారు. జైసల్మేర్-జోధ్‌పూర్ జాతీయ రహదారిపై మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో థయ్యాత్ గ్రామం వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ఆకస్మికంగా మంటలు చెలరేగి బస్సు అంతటా వ్యాపించడంతో ప్రయాణికులకు తప్పించుకునే అవకాశమే లేకుండా పోయింది. కొందరయితే నడుస్తున్న బస్సు నుంచి కిందకు దూకి ప్రాణాలను రక్షించుకునే ప్రయత్నాలు చేశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉండగా వారిలో 16 మందికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఇద్దరు పిల్లలు, నలుగురు మహిళలు ఉన్నారు.

మల్లోజుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణించిన తర్వాత.. పార్టీకి తదుపరి సారథ్యం వహించే నేతల్లో వేణుగోపాల్‌రావు పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అయితే, ఆ బాధ్యతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి అప్పగించారని, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన నియమితులయ్యారని వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, కగార్‌లో భాగంగా వరుసగా ఎన్‌కౌంటర్లు జరగటం, మావోయిస్టు పార్టీ అత్యంత సీనియర్ నేతలను, సెంట్రల్ కమిటీ సభ్యులను కోల్పోవటం జరుగుతూ వచ్చింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని తుదముట్టిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చెబుతున్నట్లుగానే ఈ పరిణామాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, మావోయిస్టు పార్టీలో అంతరంగిక చర్చ ప్రారంభమైనట్లు సమాచారం. ఆయుధాలు విడిచిపెట్టి జనజీవనస్రవంతిలో కలిసి, ప్రజా సమస్యలపై బహిరంగ ఉద్యమాలు నిర్మించాలని తద్వారా మావోయిస్టు పార్టీని రక్షించుకుందామని వేణుగోపాల్ ప్రతిపాదించగా.. దానిని ఇతర నేతలు వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వేణుగోపాల్ నుంచి అనూహ్యంగా విడుదలైన ఒక బహిరంగలేఖ పెను సంచలనం సృష్టించింది. సాయుధపోరును తాత్కాలికంగా వదిలిపెట్టి శాంతిమార్గంలోకి వస్తామని, ప్రభుత్వంతో చర్చలు జరపటానికి సిద్ధమంటూ ఆయన మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ హోదాలో, తన ఫొటో ముద్రించి ఉన్న లేఖను విడుదల చేశారు. ఈ లేఖకు ప్రతిగా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్.. సాయుధ పోరాటాన్ని వీడేది లేదంటూ ఓ లేఖ విడుదల చేశారు. ఆ తర్వాత కూడా వేణుగోపాల్ తన ప్రతిపాదనను సమర్థిస్తూ మరో లేఖ విడుదల చేశారు. దీంతో ఆయన లొంగిపోవడం ఖాయమని అంతా భావించారు. వారం రోజుల క్రితమే ఆయన హైదరాబాద్ పోలీసులకు లొంగిపోయారనే వార్తలు కూడా వెలువడ్డాయి. తాజాగా, ఆయన మహారాష్ట్రలో పోలీసుల ఎదుట లొంగిపోయినప్పటికీ, అందుకు సంబంధించిన ఫొటోలను మాత్రం ప్రభుత్వం విడుదల చేయలేదు. కాగా, వేణుగోపాల్‌రావుకు మావోయిస్టు పార్టీలో కొన్ని కమిటీలు మద్దతు తెలపటం, భారీ సంఖ్యలో లొంగిపోవటం వంటి పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా, వేణుగోపాల్‌రావు ప్రోద్బలంతోనే తెలంగాణలోని భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు ప్రాంతాల్లో పలువురు మావోయిస్టులు లొంగిపోయినట్లుగా పోలీసు వర్గాలు తెలిపాయి.





పెద్దపల్లి పట్టణంలోని వేణుగోపాల్ రావు కుటుంబ సభ్యుల ఇల్లు

ఆనందంగా ఉంది

తమ బాబాయి అడవులను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని మల్లోజుల వేణుగోపాల్ రావు పెద్దన్న ఆంజనేయులు కుమారుడు దిలీప్ శర్మ తెలిపారు. ఆయన ఎలా ఉంటారో ఇప్పటి వరకు చూడలేదని తెలిపారు. ఉద్యమంలోకి వెళ్లిపోయిన కొడుకులను ఒక్కసారైనా చూడాలన్న కోరిక నెరవేరకుండానే నానమ్మ మధురమ్మ మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల పునరావాసానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని దిలీప్ శర్మ పేర్కొన్నారు.


ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81, 141 బెటాలియన్ అధికారులు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతతో మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో బీజాపూర్ జిల్లాకు చెందిన మిలీషియా కమాండర్ పడ్డం లక్మా, సీఎన్ఎం కమాండర్ దొడ్డి బుధ్రు, పార్టీ సభ్యులు లేఖం బండి, మడవి కోసా, మిలీషియా మెంబర్ మడవి లక్మా, సుక్మా జిల్లాకు చెందిన పార్టీ సభ్యుడు కుంజం పాపారావు ఉన్నారు.

కోటన్న స్ఫూర్తిగా అడవి బాట

పెద్దపల్లి పట్టణానికి చెందిన మధురమ్మ, వెంకటయ్య దంపతులకు మల్లోజుల మూడో సంతానం. ఆయన రెండో అన్న మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ 1975లో సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పని చేశారు. 2011 నవంబరు 11న పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కిషన్‌జీ మరణించారు. సోదరుడు కిషన్‌జీ స్ఫూర్తితోనే వేణుగోపాల్‌రావు సైతం 1980 ప్రాంతంలో నక్సల్ ఉద్యమంలోకి అడుగుపెట్టారు. 2010 ఏప్రిల్‌లో దంతేవాడలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతికి కారణమైన ఘటనలో వేణుగోపాల్ కీలకపాత్ర పోషించారని చెబుతారు. అదే ఏడాది కేంద్ర కమిటీ సభ్యుడు చెరుకూరి రాజ్‌కుమార్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన అనంతరం కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా నియమితుడయ్యారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా వేణుగోపాల్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. అభయ్ పేరిట లేఖలు విడుదల చేసేవారు. ఉద్యమంలో వేణుగోపాల్‌కు సహచరిగా ఉన్న గడ్చిరోలి జిల్లాకు చెందిన సిడాం విమలచంద్ర అలియాస్ తారక అలియాస్ వత్సల ఈ ఏడాది జనవరి 1న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట లొంగిపోయారు.

లోకం తీరు



లొంగుబాట్ల వెనుక సుదీర్ఘ కసరత్తు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్, ఇతర కీలక నేతలు, బలగాలతో కలిసి లొంగిపోవడం, భారీ సంఖ్యలో ఆయుధాలనూ అప్పగించడం వెనుక పోలీసు, నిఘా వర్గాలు సుదీర్ఘ కసరత్తు చేసినట్టు సమాచారం. కేంద్రంతో పాటు తెలంగాణ, ఏపీకి చెందిన నిఘావర్గాలు కొన్నాళ్లుగా ఇందుకోసం ఈ లొంగుబాట్ల కోసం రంగం సిద్ధం చేస్తూ వస్తున్నట్టు తెలిసింది. ఈ ఏడాది మేలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ సహా 27 మంది మావోయిస్టులు మృతిచెందిన తర్వాతి పరిణామాలు కీలకంగా మారాయని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఆ సమయంలో పార్టీలో పార్టీలో తీవ్ర అంతర్మథనం జరిగినట్టు తెలిసింది. ఈ దశలోనే లొంగుబాట్ల దిశగా నిఘా వర్గాలు మావోయిస్టులపై మరింత ఒత్తిడి పెంచాయి. అదే సమయంలో ఆగస్టు 15న రాసినట్టు ఉన్న మల్లోజుల వేణుగోపాల్ లేఖ గత నెలలో విడుదల కావడం, పార్టీ వైఫల్యాలను ఆయన అంగీకరించడం, ఉద్యమాన్ని కొనసాగించలేని పరిస్థితులను ప్రస్తావించడం ద్వారా ఆయన లొంగుబాటు సిద్ధమయ్యారనే సంకేతాలు అందాయి. మిగతా క్యాడర్‌నైనా బతికించుకోవాలనే లక్ష్యంతో మల్లోజుల ఒపికగా అడుగులు వేశారని.. లొంగుబాట్లను ప్రోత్సహించే విధంగా, లొంగిపోయిన వారికి ప్రాణహానీ ఉండదనే సంకేతాలు క్యాడర్‌లోకి వెళ్లేలా ప్రకటనలు చేశారని నిఘావర్గాలు చెబుతున్నాయి. తొలుత ఆయన తెలంగాణలో లొంగిపోవచ్చని ప్రచారం జరిగినా.. కేంద్ర నిఘా వర్గాల సూచనల మేరకే మహారాష్ట్రలో లొంగిపోయినట్టు సమాచారం. కీలక నేతలు సహా 60 మంది మావోయిస్టులు ఒకేసారి లొంగిపోవడం, ఏకే 47లు, ఇన్సాస్ రైఫిళ్లు సహా 54 కీలక ఆయుధాలను అప్పగించడం వ్యూహంలో భాగమేనని తెలిసింది.

రాష్ట్రప్రభుత్వం దర్యాప్తు చేయకుంటే మీరే వెళ్లి విచారణ చేపడతారా?

▸ రాష్ట్రం హక్కును లాగేసుకుంటారా.. ఈడీని నిలదీసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 14: తమిళనాడులో మద్యం షాపు లైసెన్సుల స్కాంలో తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టీఎన్ఎస్ఎంఏసీ) పాత్రపై దర్యాప్తు చేపట్టిన ఈడీకి సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. ఒక నేరాన్ని రాష్ట్రప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదని మీరు అనుమానిస్తే.. మీరే వెళ్లి సొంతగా విచారణ చేపడతారా? ఇలాగైతే సమాఖ్యవాదం ఏముంటుంది? దర్యాప్తు హక్కు రాష్ట్ర ప్రభుత్వానిది. దానిని మీరే లాగేసుకోవడం లేదా' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఈడీని మంగళవారం నిలదీశారు. మద్యం షాపుల లైసెన్సుల స్కాంలో టీఏఎస్ఎంఏసీ అవకతవకలకు పాల్పడిందంటూ.. ఈడీ విచారణ చేపట్టింది. కార్పొరేషన్‌కు చెందిన పది కార్యాలయాల్లో ఈ ఏడాది మొదట్లో సోదాలు చేపట్టింది. లెక్కకు రాని రూ.వెయ్యి కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. దీనిని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. తమిళనాడు తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) స్పందిస్తూ.. రాష్ట్రప్రభుత్వం 47 కేసులు పెట్టినా.. అవినీతి విచ్చలవిడిగా కొనసాగుతోందని.. అందుచేత ఈడీ దర్యాప్తు చేయొచ్చని అన్నారు. చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకుని.. అలాగైతే సమాఖ్యవాదం పరిస్థితేంటని అడిగారు. చట్ట ఉల్లంఘన జరిగిందని దర్యాప్తు సందర్భంగా ఈడీ కనిపెడితే.. దానిని రాష్ట్రప్రభుత్వ దర్యాప్తు సంస్థతో పంచుకోవాలని పీఎంఎల్ఏ సెక్షన్ 66(2) చెబుతోందని గుర్తుచేశారు. అనంతరం టీఏఎస్ఎంఏసీపై ఈడీ దర్యాప్తు, సోదాలు, వస్తువుల స్వాధీనంపై గతంలో విధించిన స్టే ఉత్తర్వులను ధర్మాసనం పొడిగించింది.

సోషల్ మీడియా ప్రకటనలకూ ముందస్తు అనుమతి తప్పనిసరి

▸ నామినేషన్ పత్రాలు వేసేటప్పుడే అధికారిక 'ఖాతాల' వివరాలనూ ఇవ్వాలి

▸ ఈసీ ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ, అక్టోబరు 14: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తాము జారీ చేసే ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి చేస్తూ భారత ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలక్ట్రానిక్, వెబ్, సోషల్ మీడియాల్లో జారీ చేసే అన్ని ప్రకటనలకూ ఈ నిబంధన వర్తిస్తుందని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. బిహార్, జమ్మూ కశ్మీర్, ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించే క్రమంలో ఈసీ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీలు(ఎంసీఎంసీ) రాష్ట్ర, జిల్లా స్థాయిలోనూ ఏర్పాటు అవుతాయని పేర్కొంది. పార్టీలు, అభ్యర్థులు ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్, ఇంటర్నెట్ వేదికగా జారీ చేసే అన్ని ప్రకటనలకూ పై కమిటీల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. అలాగే అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 75 రోజుల తరువాత సమర్పించే లెక్కల్లో కూడా ప్రకటనల నిమిత్తం వివిధ సంస్థలకు చేసిన చెల్లింపులనూ చెప్పాల్సిందేనని పేర్కొంది. నామినేషన్లు వేసేటప్పుడే ఆయా పార్టీలు, అభ్యర్థుల అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను, వెబ్ ప్లాట్ ఫాం వివరాలనూ ఇవ్వవలసిందేనని వివరించింది. ఈసీకి సమర్పించే లెక్కల్లో కంటెంట్ క్రియేషన్ కోసం చేసిన ఖర్చును కూడా జత చేయాలంది. ఎంసీఎంసీ వివిధ మీడియాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుందని, పెయిడ్ న్యూస్ అని అనుమానం వచ్చిన వాటిపై చర్యలు తీసుకుంటుందని ఈసీ స్పష్టం చేసింది.

బిహార్లో తండ్రీకొడుకుల పోరు!

అభ్యర్థులకు లాలూ టికెట్లు.. వెనక్కి తీసేసుకున్న తేజస్వి.. ఆర్‌జేడీ నేతల్లో కలకలం

పట్నా/న్యూఢిల్లీ, అక్టోబరు 14: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీ ఆర్‌జేడీలో ముసలం పుట్టినట్లు సంకేతాలు వెలువడ్డాయి. పార్టీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ టికెట్లు పంపిణీ చేయగా.. ఆయన చిన్న కుమారుడు, పార్టీ సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ వాటిని వెనక్కి తీసుకోవడం ఆర్‌జేడీ నేతలను విస్మయపరుస్తోంది. తండ్రీకొడుకుల నడుమ ఆధిపత్య పోరు బహిర్గతం కావడం ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. విపక్షాల మహాగఠ్‌బంధన్(మహాకూటమి) కూడా షాకైంది. పాలక ఎన్‌డీఏ పక్షాలు పొత్తు ఖరారుచేసుకుని అభ్యర్థుల జాబితాలు కూడా విడుదల చేస్తుండగా.. విపక్షాల నడుమ ఇంకా సీట్ల సర్దుబాటు కాలేదు. ఐఆర్‌సీటీసీ స్కాం కేసులో ఢిల్లీ కోర్టులో హాజరైన లాలూ, ఆయన భార్య రాబ్డీదేవి సోమవారం సాయంత్రం పట్నాలోని తమ నివాసానికి చేరుకున్నారు. తర్వాత టికెట్ ఆశావహులకు పార్టీ నాయకత్వం నుంచి ఫోన్లు వెళ్లాయి. వారంతా లాలూ నివాసంలోకి వెళ్లి ఆనందంతో బీఫారాలు తీసుకుని బయటకు వచ్చారు. వీరిలో ఇటీవల సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని జేడీయూ నుంచి ఆర్‌జేడీలోకి వచ్చిన సీనియర్ ఎమ్మెల్యేలు సునీల్‌సింగ్ (పర్బత్తా), నరేంద్రకుమార్‌సింగ్ అలియాస్ బోగో (మతిహానీ), ఆర్‌జేడీ సిటింగ్ సభ్యులు భాయ్ వీరేంద్ర, చంద్రశేఖర్ యాదవ్, ఇజ్రాయిల్ మన్సూరీ కూడా ఉన్నారు. తేజస్వి సైతం ఢిల్లీ కోర్టులో హాజరై కొద్ది గంటల తర్వాత పట్నా చేరుకున్నారు. తనకు తెలియకుండా తండ్రి టికెట్లు పంపిణీ చేయడంపై మనస్తాపానికి గురయ్యారు. అదీగాక మిత్రులతో సీట్ల లెక్క తేలకుండా టికెట్ల పంపిణీ సబబు కాదని.. భాగస్వామ్య పక్షాలు సీరియస్‌గా తీసుకోవచ్చని తండ్రికి నచ్చజెప్పారు. రాత్రి పొద్దుపోయాక.. టికెట్లు దక్కిన నేతలందరికీ మళ్లీ ఫోన్లు చేసి పిలిపించారు. 'సాంకేతిక కారణాలతో' వారందరి నుంచి తేజస్వి బీఫారాలు వెనక్కి తీసుకున్నారు.



లోక్‌సభ ఎన్నికల్లో కూడా..

గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా లాలూ ఏకపక్షంగా వ్యవహరించారు. 40 సీట్లకు గాను 23 చోట్ల ఆర్‌జేడీ అభ్యర్థులను నిలిపారు. గెలిచే సీట్లు కాకుండా ఓడిపోయేవి ఇచ్చారని మిత్రపక్షాలు ఇప్పటికీ లాలూను ఆక్షేపిస్తుంటాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన అలాగే వ్యవహరించడంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగి తేజస్వీపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. 243 స్థానాల అసెంబ్లీలో కాంగ్రెస్ 70-75 సీట్లు అడుగుతోంది. వీఐపీ 50 సీట్లతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తోంది. సీపీఐ, సీపీఎం 24 స్థానాల చొప్పున అడుగుతున్నాయి. ఆర్‌జేడీ కనీసం 134 సీట్లలో పోటీచేస్తానని పట్టుబడుతోంది.

71 మందితో బీజేపీ తొలి జాబితా

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు 71 మందితో బీజేపీ తన తొలి జాబితాను మంగళవారం ప్రకటించింది. ఇందులో పలు విశేషాలు చోటు చేసుకున్నాయి. ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన స్పీకర్ నంద కిశోర్ యాదవ్‌కు సీటు ఇవ్వకపోగా.. పదేళ్లుగా ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉన్న డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరికి సీటు ఇచ్చారు. శాసన మండలి సభ్యుడు, ఆరోగ్యం, న్యాయ శాఖ మంత్రి మంగళ్ పాండేను కూడా బరిలో దించడం విశేషం. ఈ ముగ్గురూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసినవారే. స్పీకర్ సీటు పట్నా సాహిబ్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సంజయ్ కుమార్ గుప్తాను నిలబెట్టారు. కాగా మాజీ కేంద్రమంత్రి రామ్ కృపాల్ యాదవ్‌కు దానాపూర్ సీటును కేటాయించడం పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. లఖిసరాయ్ నుంచి మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించిన డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హాకు మళ్లీ అదే సీటు దక్కింది. ప్రస్తుత మంత్రులు ఆరుగురికి సీట్లు దక్కాయి. 10 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు ఇవ్వలేదు. 9 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ప్రముఖ జానపద, భక్తి గీతాల గాయని మైథిలి ఠాకూర్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరారు. ఆమెకు దర్భంగా ప్రాంతంలోని అలీ నగర్ సీటును కేటాయించే అవకాశం ఉంది.

బ్యాంకుల్లో చెక్కుల క్లియరెన్స్ కష్టాలు



▸ కస్టమర్ల సహనాన్ని పరీక్షిస్తున్న సీటీఎస్

▸ దేశవ్యాప్తంగా నిలిచిపోయిన రూ.లక్షల కోట్ల లావాదేవీలు

న్యూఢిల్లీ: కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక పోయిందంటారు. చెక్కుల సత్వర క్లియరెన్స్ కోసం ఈ నెల 4 నుంచి ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన చెక్ ట్రంకేషన్ సిస్టమ్(సీటీఎస్) పనితీరు ఇలానే ఉంది. నిన్న మొన్నటి వరకు బ్యాంకుల్లో చెక్ డిపాజిట్ చేస్తే రెండు రోజుల్లో క్లియరై ఖాతాదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యేది. సీటీఎస్ విధానంతో అదే రోజు చెక్కులు క్లియరై.. డబ్బులు ఖాతాదారుల ఖాతాల్లో జమ అవుతాయని ఆర్‌బీఐ ప్రకటించింది. దీంతో ఖాతాదారులు తెగ సంబర పడిపోయారు. తీరా ఆచరణకు వచ్చేసరికి ఈ కొత్త విధానం అటు బ్యాంకర్లకు, ఇటు ఖాతాదారులకు చుక్కలు చూపిస్తోంది. సీటీఎస్ విధానం అమల్లోకి వచ్చి దాదాపు 10 రోజులు అవుతోంది. చెక్కుల క్లియరెన్స్ కాకపోవటంతో దేశవ్యాప్తంగా రూ.వేల కోట్ల లావాదేవీలు నిలిచిపోయాయి. చెక్కులు జారీ చేసిన వారి ఖాతాల నుంచి నిధులు డెబిట్ అయినా.. చెక్కులు తీసుకున్న మా ఖాతాల్లో మాత్రం జమ కావడం లేదని ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని బ్యాంకింగ్ ఖాతాదారులకూ ఈ తిప్పలు తప్పడం లేదు. బ్యాంకులు మాత్రం సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ కాకపోవటంతో చెక్కుల క్లియరెన్స్ ఆలస్యమవుతోందని ఖాతాదారులకు ఎస్ఎంఎస్‌లు పంపించి చేతులు దులుపుకుంటున్నాయి.

ఇదీ కొత్త విధానం

ఈ నెల 4 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త విధానంలో సాధారణ పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డిపాజిట్ అయిన చెక్కులను బ్యాంకులు వెంటనే స్కాన్ చేసి క్లియర్ చేయాలి. పేయింగ్ బ్యాంకులు కూడా చెల్లింపుల విషయాన్ని సాయంత్రం 7 గంటల కల్లా ధ్రువీకరించాలి. పేయింగ్ బ్యాంకు నుంచి ఎలాంటి స్పందన లేకపోతే దాన్ని ఆటోమేటిక్ ఆమోదంగా భావిస్తారు. సీటీఎస్ అమల్లోకి వచ్చిన తర్వాత చాలా కేసుల్లో ఐదారు రోజులైనా చెక్కులు క్లియర్ కావడం లేదని ఖాతాదారులు గగ్గోలు పెడుతున్నారు.

సాంకేతిక సమస్యలతోనే..

ఆయా బ్యాంకుల సాఫ్ట్‌వేర్, సీటీఎస్ వ్యవస్థతో సరిగా అనుసంధానం కాకపోవడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. దీంతో చెక్ రీడబిలిటీ, పంచింగ్, కొన్ని కోట్స్, అంకెలును సీటీఎస్ వ్యవస్థ సరిగా చదవలేక పోతోంది. దీంతో ఆ చెక్కులపై ఉన్న వివరాలను ఒకటికి రెండుసార్లు ఫిజికల్‌గా చదివి మళ్లీ ప్రాసెస్ చేయాల్సి వస్తోంది. చెక్కుల క్లియరెన్స్ ఆలస్యం కావడానికి ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఈ సమస్యలతో కొన్ని వ్యాపార సంస్థలు ఖాతాదారుల నుంచి తమకు రావలసిన బకాయిలను నిఫ్ట్ లేదా ఆర్‌టీజీఎస్ ద్వారా రాబట్టుకుంటున్నాయి.

సమస్యలున్నాయ్: ఎన్‌పీసీఐ

సీటీఎస్‌ను అమలు చేస్తున్న ఎన్‌పీసీఐ కూడా ఈ కొత్త విధానంతో చెక్కుల క్లియరెన్స్‌లో సమస్యలు నిజమేనని అంగీకరించింది. అయితే సోమవారం నుంచి ఈ సమస్య చాలా వరకు పరిష్కారమైనట్టు తెలిపింది. అక్టోబరు 4 నుంచి ఇప్పటి వరకు రూ.8,49,557 కోట్ల విలువైన 1.49 కోట్ల చెక్కులను క్లియర్ చేసినట్టు వెల్లడించింది.

పూర్తి శిక్షణ లేకపోవడం

కొత్త విధానంలో చెక్కుల క్లియరెన్స్‌కు సంబంధించి బ్యాంకులు తమ సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వలేదని తెలుస్తోంది. దీంతో ఖాతాదారులు డిపాజిట్ చేసిన చెక్కులను బ్యాంకింగ్ సిబ్బంది చక్కగా స్కాన్ చేసి, డిజిటల్ ఇమేజీని అదే రోజు సెంట్రల్ ఆపరేషన్స్ టీమ్‌కు పంపించలేక పోతున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ఇన్‌స్టాంట్ చెక్ క్లియరెన్స్ కోసం ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన సీటీఎస్ విధానం ఖాతాదారులకు చుక్కలు చూపిస్తోంది.

ఒక్కడు కాదు.. నలుగురిపై లైంగిక దాడి?

- సైదాబాద్ జువెనైల్ హోం కేసు
- దర్యాప్తులో బయటకొస్తున్న రెహమాన్ దారుణాలు

సైదాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని జువెనైల్ హోం(ప్రభుత్వ బాలుర సదనం)లోని బాలుడిపై లైంగిక దాడి ఘటనపై దర్యాప్తులో సంచలన విషయాలు బయటికొస్తున్నాయి. ఈ కేసులో నిందితుడు, స్టాఫ్‌గార్డ్(సూపర్‌వైజర్) రెహమన్ నలుగురు బాలలపై లైంగిక దాడికి పాల్పడినట్టు అధికారుల దర్యాప్తులో తేలినట్టు సమాచారం. సైదాబాద్ జువెనైల్ హోంలో ఉంటున్న తన కుమారుడిపై రెహమాన్ లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధిత బాలుడి తల్లి శనివారం రాత్రి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెహమాన్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అయితే, విషయం తెలిసి అప్రమత్తమైన జువెనైల్ శాఖ డైరెక్టర్.. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. నింబోలిఅడ్డ ప్రభుత్వ బాలికల గృహం సూపరింటెండెంట్ మైథిలికి బాధ్యతలు అప్పగించారు. జువెనైల్ హోంలోని బాలలతో మాట్లాడిన మైథిలి తన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. అయితే, రెహమాన్ మొత్తం నలుగురు బాలురిపై లైంగిక దాడికి పాల్పడినట్టు తేలిందని ఆ నివేదికలో పేర్కొనట్టు సమాచారం. మరోపక్క దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు.. బాధితులు మరెవరైనా ఉన్నారా ? అని గుర్తించే పనిలో ఉన్నారు. జువెనైల్ హోం నుంచి విడుదలైన బాలురతోనూ మాట్లాడి మరింత సమాచారం రాబట్టేందుకు యత్నిస్తున్నారు. కాగా, జరిగిన ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జువెనైల్ హోం అధికారులను కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆదేశించినట్లు సమాచారం.

రెహమాన్‌పై వేటు, హెడ్ సూపర్‌వైజర్ సస్పెన్షన్

జువెనైల్ హోంలో బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న స్టాఫ్ గార్డ్ రెహమాన్‌ను అధికారులు విధుల నుంచి తొలగించారు. అలాగే, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్ సూపర్‌వైజర్ షఫీ అహ్మద్‌ను సస్పెండ్ చేశారు. మరో హెడ్ సూపర్‌వైజర్ ఖదీర్, హౌస్ మాస్టర్ అక్బర్‌కు చార్జిమెమోలు జారీ చేశారు. హోం సూపరింటెండెంట్ సయ్యద్ అఫ్జల్‌ను బదిలీ చేసి ఆ స్థానంలో మైథిలీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

కేసీఆర్ ఫొటో లేకుండా
కవిత యాత్ర

- జాగృతి పోస్టర్లలో ఇక నుంచి ప్రొఫెసర్ జయశంకర్ ఫొటో
- ఒక్కో జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటన
- అన్ని వర్గాలతో చర్చలు, అభిప్రాయ సేకరణ
- రాజకీయ ముందడుగుపై సమాలోచనలు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి దూరమైనప్పటికీ ఇప్పటి వరకు ఏ కార్యక్రమం చేపట్టినా పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీల్లో కేసీఆర్ ఫొటో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్న కవిత... ఇక మీదట కేసీఆర్ ఫొటో లేకుండానే రాజకీయంగా ముందుకు సాగాలని కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇకపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీల్లో ఎక్కడా కేసీఆర్ ఫొటో వాడకూడదని జాగృతి శ్రేణులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కేసీఆర్ ఫొటోకు బదులుగా తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోతో పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు డిజైన్ చేయాలని సూచించినట్లు తెలిసింది. కవిత ఈ నెలాఖరులో ఓ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపట్టాలని, అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావాలని, రాజకీయంగా ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై కీలక నిర్ణయం తీసుకోవటానికి క్షేత్రస్థాయి నుంచి అభిప్రాయ సేకరణ చేయాలని భావిస్తున్నారు. ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాలో 2 రోజుల పాటు పర్యటించాలని, కనీసం రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపట్టాలని కవిత ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాకపోతే నిరాటంకంగా కాకుండా ఒకటి, రెండు జిల్లాల్లో యాత్ర చేయటం, ఆ తర్వాత కాస్త విరామం తీసుకోవటం, మళ్లీ వేరే జిల్లాలకు వెళ్లడం... అనే పద్ధతిలో రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. అక్టోబరు చివరి వారంలో (దీపావళి ముగిసిన తర్వాత) జిల్లాల యాత్ర చేపట్టనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించనున్నారు. జిల్లాల పర్యటనలో కవిత వివిధ వర్గాలతో సమాలోచనలు జరపనున్నారు.

బీఆర్ఎస్ హయాంలో
విద్యార్థులకు అన్యాయం నిజమే

అందుకే ఆ పార్టీని ఓడించారు.. కవిత సంచలన వ్యాఖ్యలు.. గ్రూప్-1 అభ్యర్థులతో మాట-ముచ్చట

- ఉద్రిక్త పరిస్థితుల నడుమ సమావేశం
- కేసీఆర్ పాలనలో పేపర్ లీకేజీలపై కవితను నిలదీసిన నిరుద్యోగులు


చిక్కడపల్లిలో గ్రూప్-1 అభ్యర్థులతో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులకు అన్యాయం జరిగింది కనుకే ఆ ప్రభుత్వాన్ని ఓడించారన్నది నిజమేనని, అందులో మరొక అభిప్రాయం లేదని తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలపై సమాధానం చెప్పాలంటూ నిరుద్యోగులు నిలదీయడంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే వారిని ఉద్దేశించి 'మీరు అధికార పక్షం మాయలో పడకూడద'ని కవిత అనగానే, 'తప్పు..తప్పు... మేమెవ్వరికీ చుట్టాలం కాదంటూ నిరుద్యోగులు మూకుమ్మడిగా నినదించారు. కవిత మాట్లాడుతూ 'గ్రూప్-1 పోస్టుల్లో నిబంధనలు తుంగలో తొక్కి, నాన్ లోకల్ కింద 8మంది ఆంధ్రావాళ్లకు ఉద్యోగాలు ఇచ్చారు. మనం తెలంగాణ కోసం పోరాడింది ఆంధ్రావాళ్లకు ఉద్యోగాలివ్వమని కాదు. గత ప్రభుత్వంలో నేనూ భాగస్వామిగా ఉన్నాను. మా వల్ల తప్పు జరిగి ఉండచ్చు. అయితే, మనలో మనం తెలంగాణ వాళ్లం తప్పు సరిదిద్దుకోవాలి. అంతేకానీ ఆంధ్రావాళ్ల కోసం తలవంచిన ప్రభుత్వాల పక్షాన నిలవకూడదు. విద్యార్థులకు అన్యాయం చేసినందుకే ఇదివరకు ప్రభుత్వాలు మారాయి. కనుక అన్యాయం చేస్తున్న ఈ ప్రభుత్వం కూడా నిలబడదని అన్నారు. మంగళవారం చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో తెలంగాణ జాగృతి తలపెట్టిన గ్రూప్-1 అభ్యర్థులతో మాట-ముచ్చట కార్యక్రమం తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ జరిగింది. లైబ్రరీ లోపలికి రానివ్వకుండా గేటు బయటే కవితను పోలీసులు అడ్డుకోగా, జాగృతి కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. చివరికి బలవంతంగా తలుపులు తోసుకుని వారంతా లోపలికి వచ్చారు. కానీ సభా మందిరంలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో లైబ్రరీ పార్కింగ్ ప్రదేశంలో కవిత బైఠాయించారు. అక్కడే నిరుద్యోగులతో సంభాషించారు. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ నెల 15న హైకోర్టు డివిజన్ బెంచ్ నుంచి కేసు విచారణలో విద్యార్థులకు అనుకూలంగా తీర్పు రాకుంటే, బాధితుల పక్షాన తాను సుప్రీంకోర్టుకు వెళతానన్నారు.ప్రభుత్వం భేషజాలకు పోకుండా గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కవితతో మాట-ముచ్చటలో భాగంగా కొంతమంది నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 'ఉద్యోగం రాక మనస్తాపంతో ప్రవళిక ఆత్మహత్య చేసుకుంటే, అసలు ఆమె అభ్యర్థే కాదని మీ అన్న అన్నాడు. కేసీఆర్ హయాం లో జరిగిన పేపర్ లీకేజీల మీదా సమాధానం చెప్పాలం'టూ గడుసు కృష్ణ అనే నిరుద్యోగి కవితను నిలదీశాడు. ఈ కార్యక్రమం సందర్భంగా కొందరు అభ్యర్థులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆ క్రమంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒక దశలో చిక్కడపల్లి సీఐ రాజు నాయక్ అసహనానికి గురై.. విద్యార్థులు, దారినపోయే వారితో దురుసుగా వ్యవహరించారు.

పాఠశాలల్లో పేరెంట్- టీచర్ సంఘాలు ఏవీ?

- హైకోర్టులో 'పిల్' దాఖలు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాల్లో పేరెంట్- టీచర్ అసోసియేషన్లు ఏర్పాటు చేయలేదని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. న్యాయవిద్యార్థి ఉప్పు మల్లికార్జున్ పాటిల్ దీన్ని దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది విజయ్‌గోపాల్ వాదిస్తూ.. తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ యాక్ట్ సెక్షన్ 30తోపాటు జీవో 246 ప్రకారం అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్ టీచర్స్ సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాల్లో గవర్నింగ్ బాడీ (ఎస్‌జీబీ) ఏర్పాటు చేయకపోవడం కూడా చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. 30 రోజుల్లో ఇవి అమలయ్యేలా ఆదేశించాలని కోరారు. దీనిపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తదితరులకు ఆదేశాలు జారీచేసిన ధర్మాసనం తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌పై ఫిర్యాదులను పరిశీలించండి

బేగంపేట్, రామాంతపూర్‌ల్లో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌పై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి మూడునెలల్లో నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నిధుల దుర్వినియోగం, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల మూసివేతపై ఆరోపణలు చేస్తూ దాఖలైన పిల్‌పై ఈ ఆదేశాలు ఇచ్చింది.

తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాల ప్రకటన

- 29న నాంపల్లిలో ప్రదానోత్సవం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ 2023 సంవత్సరానికి గాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో సాహితీ పురస్కారాలను ప్రకటించింది. 2020, 2021, 2022 సంవత్సరాల్లో వెలువడిన ఉత్తమ గ్రంథాలను ఎంపిక చేసి ఈ పురస్కారాలను నిర్ణయించారు. ఈనెల 29న నాంపల్లిలోని తెలుగు వర్సిటీలో పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. విజేతలను ఒక్కొక్కరిని రూ. 20,116ల నగదు బహుమతితో సత్కరిస్తామని వీసీ నిత్యానందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్యకవితా ప్రక్రియలో వొజ్జల నరహరి శర్మ (ధర్మపురి వైభవం), వచన కవితా ప్రక్రియలో విశ్వర్షి వాసిలి (నేను యోగిక కావ్యం), గేయ కవితలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి (తెలంగాణ రుబాయిలు), బాలసాహిత్యంలో డాక్టర్ ఎం.హరికిషన్ (చందమామ చెప్పిన కథలు), కథానికా ప్రక్రియలో డాక్టర్ టి.సంపత్ కుమార్ ('నా' నుంచి 'మన' వరకు), నవలా ప్రక్రియలో ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి (మాదిగ కొలుపు), సాహిత్య విమర్శలో ఆడెపు లక్ష్మీపతి (దిక్చక్రం), నాటకం/నాటికల్లో రావుల పుల్లాచారి (రచ్చబండ), అనువాద సాహిత్యంలో డాక్టర్ టీసీ వసంత (మృత్యుంజయుడు), వచన రచనల విభాగంలో ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు రెడ్డి (తిరుపతి కథలు), రచయిత్రి విభాగంలో డాక్టర్ జంధ్యాల కనకదుర్గ (స్వతంత్రత నుంచి స్వాతంత్ర్యానికి) సాహితీ పురస్కారాలకు ఎంపికయ్యారు.

ఓటుకు నోటు కేసు విచారణ నేటికి వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సర్వోన్నత న్యాయస్థానం బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియామావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 22 జూలై 2021న రేవంత్ రెడ్డి, ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ 13 ఏప్రిల్ 2021న సండ్ర వెంకట వీరయ్య సుప్రీంకోర్టులో వేర్వేరుగా స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ రెండు పిటిషన్లు మంగళవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. అయితే, సీనియర్ కౌన్సిల్ అందుబాటులో లేరని, అందువల్ల విచారణను వాయిదా వేయాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేయగా ధర్మాసనం అంగీకరించింది. దీంతో విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది.

ఎర్త్ సైన్సెస్ వర్సిటీ
నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం!

- 200 ఎకరాల్లో నిర్మాణం.. తుమ్మల ప్రత్యేక చొరవ

కొత్తగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని, దేశంలోనే మొట్టమొదటి మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో 200 ఎకరాల్లో ఆకర్షణీయమైన డిజైన్లతో భవన నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రూ.వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. భద్రాద్రి కొత్తగూడెంలో మూడు నెలల క్రితం ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది తాత్కాలికంగా స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతోంది. ఇదే చోట వర్సిటీని నిర్మించనున్నారు. వర్సిటీకి ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభించగా.. బీఎస్సీ జియాలజీలో 60 సీట్లకుగాను 14 మంది, ఎన్విరాన్‌మెంటల్ విభాగంలో 37 మంది విద్యార్థులు చేరారు. రాబోయే రోజుల్లో కోర్సులు పెరగడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హాస్టళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. మొత్తం 14 బ్లాకుల్లో 1,300 గదులు ఏర్పాటు చేసి.. ఒక్కో గదికి ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. వాటిల్లో బాలురకు 9 బ్లాకులు, బాలికలకు 5 బ్లాకులను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటుగా సబ్జెక్టుల వారీగా ఆఫీసులు, తరగతి గదులు, పరిపాలనా విభాగం, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లకు సంబంధించి మరో 6 బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిర్మాణాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇటీవల జిల్లా అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎంతో సమావేశమైన సందర్భంలో.. తరగతుల ప్రారంభోత్సవానికి రావాలని రేవంత్‌ను ఆహ్వానించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వస్తానని సీఎం హామీ ఇచ్చారు.

కార్లపై ప్రెస్, అడ్వకేట్ స్టిక్కర్లు.. హెచ్చార్సీ ఆగ్రహం

- కార్ల యజమానులకు నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కార్లపై ప్రెస్, అడ్వకేట్, హ్యూమన్ రైట్స్ కమిషన్ అని స్టిక్కర్లు అంటించిన వాహన యజమానులపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసును సూమోటోగా స్వీకరించిన కమిషన్, ఇలా రాసి ఉన్న మూడు కార్ల యాజమానులకు నోటీసులు పంపించింది. అనధికార వ్యక్తులు రాష్ట్ర, జాతీయ అధికార చిహ్నాలను వాహనాలపై ప్రదర్శించడం శిక్షార్హమైన నేరమని కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ హెచ్చరించారు. వాహనాల యజమానులు బారి నవీన్ కుమార్, ఆలుగడ్డల భూరత్నం గోవింద్, మహ్మద్ హబీబ్‌లు వచ్చేనెల 24న కమిషన్ ముందు హాజరు కావాలని కమిషన్ నోటీసులో పేర్కొంది. అలాగే ప్రెస్, అడ్వకేట్, హ్యూమన్ రైట్స్ కమిషన్ విభాగాలు కూడా ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు తెలంగాణ బార్ కౌన్సిల్, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, రవాణా, సొసైటీ రిజిస్ట్రేషన్ శాఖలను ఆదేశించింది.

ముందు సీటు ఇవ్వండి.. కుల ధ్రువీకరణ ఆ తరువాత..

- ఎస్టీ స్టడీ సర్కిల్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రం సరైందా? కాదా? అని పరిశీలన జరిపేలోపు కోచింగ్ క్లాసులు మిస్ అవుతాయని అందువల్ల తొలుత అభ్యర్థికి సీటు ఇవ్వాలని ఎస్టీ స్టడీ సర్కిల్‌కు హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. సీటు ఇచ్చిన తరువాత కుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేసుకోవచ్చని తెలిపింది. నిజామాబాద్ జిల్లా ముప్కల్ మండలానికి చెందిన కార్తీక్‌కుమార్ యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎస్టీ స్టడీ సర్కిల్ నిర్వహించిన పరీక్షకు హాజరై అర్హత సాధించారు. ధ్రువపత్రాల పరిశీలనలో అతని ఎస్టీసర్టిఫికెట్ సరైంది కాదని అధికారులు భావించి సీటు నిరాకరించారు. దీనిపై ఆ అభ్యర్థి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ధర్మాసనం.. ముందు సీటు ఇచ్చి, తరువాత పరిశీలన జరుపుకోవాలని అధికారులకు సూచించింది.

వచ్చే మా ప్రభుత్వంలో నేనే రైల్వే మంత్రిని

- వికారాబాద్ జిల్లా పార్టీ సారథి రాజశేఖర్‌రెడ్డి రాజకీయాలకు అనర్హుడు
- ఆయనను నేనే ప్రతిపాదించా
- ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి


చెట్టినాడ్ కర్మాగారం ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు/తాండూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, తమ ప్రభుత్వంలో తానే రైల్వేశాఖ మంత్రి అవుతానని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో తెలంగాణలో రైల్వేస్టేషన్‌ల అభివృద్ధిని పట్టించుకోలేదని, కొత్త రైళ్లు నడపడంలో ఈ ప్రాంతంపై చిన్నచూపు చూశారని ఆరోపించారు. తాము రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను బషీరాబాద్, నవాంద్గిలో నిలిపే విధంగా కృషి చేశామని తెలిపారు. హుబ్లీ రైలును తాండూరులో ఆపాలని రైల్వే జీఎంను కోరామని, రెండు వారాల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి రాజకీయాలకు అనర్హుడని, ఆయన స్థానికేతరుడని అన్నారు. తానే ఆయనను జిల్లా అధ్యక్షుడిగా ప్రతిపాదించానని, తమ కుటుంబ సభ్యులు ఆయనకు ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. ఆయన అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ పార్టీని నడపడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఆయనను తొలగించే అంశంపై రెండు రోజులుగా పార్టీలో చర్చ జరుగుతోందని, ఆ విషయాన్ని అధిష్ఠానమే చూసుకుంటుందని ఆయన తెలిపారు.

చెట్టినాడ్ ఫ్యాక్టరీని మూసేయిస్తా

పైసలు సంపాదించేందుకు పేదల జీవితాలు నాశనం చేస్తారా.. సిగ్గుందా..? మీ ఫ్యాక్టరీ మూయిస్తా.. అంటూ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెట్టినాడ్ ఫ్యాక్టరీ ప్రతినిధులను హెచ్చరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాండూరు మండలం సంగెం కలాన్ గ్రామంలో 135 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇండ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామ సమీపంలోని చెట్టినాడు బ్రిడ్జి వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆందోళనకు దిగిన తెలిసిందే. మంగళవారం ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సంగెంకలాన్ గ్రామాన్ని సందర్శించారు. చెట్టినాడు ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడారు. ఫ్యాకరీ యజమానులు బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం చేయడం వల్లనే వరద కష్టాలు ఎదురయ్యాయని అన్నారు. నష్టపోయిన గ్రామస్తులకు, రైతులకు పరిహారం ఫ్యాక్టరీ నుంచి ఇప్పించాలని కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఫ్యాక్టరీ ఉన్నతాధికారులతోనూ ఆయన మాట్లాడారు.

అవినీతి సొసైటీలు ఔట్

- రాష్ట్రంలో 208 పీఏసీఎస్ పాలకవర్గాలపై వేటు
- పదవులు కోల్పోయిన చైర్మన్లు, డైరెక్టర్లు
- ఆరు నెలల పాటు ప్రత్యేక అధికారుల పాలన



ముథ్రా(బి) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

ఆదిలాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడిన, పని తీరు సక్రమంగా లేని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు చెందిన పాలకవర్గాలపై ప్రభుత్వం అనర్హత వేటు వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో 208 సొసైటీల పాలక వర్గాలను రద్దు చేసింది. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 20 సొసైటీలు ఉన్నాయి. పాలకవర్గాల రద్దుతో ఆయా పీఏసీఎస్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు తమ పదవులను కోల్పోయారు. పాలక వర్గాలు రద్దయిన సొసైటీలు ఆరు నెలల పాటు పర్సనల్ ఇన్‌చార్జిల పాలనలో కొనసాగనున్నాయి. ఆ తర్వాత పాలకవర్గం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. నిజానికి, 2020 ఫిబ్రవరి 15న రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఏర్పాటైన సంఘాల ఐదేళ్ల పదవీ కాలం 2025 ఫిబ్రవరి 15తో ముగిసింది. దాంతో పాలక వర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు.. 2025 ఆగస్టు 15 వరకు పొడిగించారు. ఆ గడువు ముగియగా.. పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న, నిబంధనలకు అనుగుణంగా పని చేయని సంఘాలపై మాత్రం వేటు వేసింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో జామిడి, నర్సాపూర్, ముథ్రా(బి), మన్యాపూర్, కుప్టి కుమారి, నిర్మల్ జిల్లాలో సత్తెనపల్లి, మంచిర్యాల జిల్లా కోటపల్లి, చెన్నూర్, జైపూర్, మంచిర్యాల, మందమర్రి, జెండావెంకటాపూర్, నలికి వెంకటాపూర్, భీమిని, నెన్నెల, ఎడ్లాన్‌పల్లి, గూడెం, ఆసిఫాబాద్ జిల్లాలో బెజ్జూర్, తిర్యాణి, రెబ్బెన పీఏసీఎస్‌లపై అనర్హత వేటు పడింది. రద్దయిన ఈ సొసైటీల్లో చాలా మంది చైర్మన్లు, డైరెక్టర్లు.. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన వారు కావడమే ఇందుకు కారణం. దీంతో పలు సొసైటీలు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించినట్టు సమాచారం.

ప్రభుత్వ ఆదేశాలతోనే చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే పలు సొసైటీలపై చర్యలు తీసుకున్నాం. దీనిపై ఇప్పటికే కొన్ని సొసైటీలు కోర్టుకు వెళ్లినట్లు తెలిసింది. రద్దయిన సొసైటీలకు పర్సనల్ ఇన్‌చార్జ్‌లను నియమించాం. ఆరు మాసాల పాటు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలోనే సొసైటీల పాలన కొనసాగుతుంది.

– బి. మోహన్, జిల్లా సహకార అధికారి, ఆదిలాబాద్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మమతకు మరో పరీక్ష

పశ్చిమబెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్యవిద్యార్థినిపై సామూహిక అత్యాచారం ఘటన అత్యంత బాధాకరమైనది. అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను, సహకరించిన మరో యువకుడిని పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. తన సోదరుడు ఒక వంతెనకింద దాక్కొని ఉన్నాడని ఐదో నిందితుడి సోదరి స్వయంగా పోలీసులకు సమాచారం ఇచ్చింది. చేసిన తప్పుకు అతడు శిక్ష అనుభవించాల్సిందేనని ఆమె అంటోంది. భయంతో వొణికిపోతున్న సోదరుడి అకృత్యాన్ని పసిగట్టడమే కాక, ప్రేమాభిమానాలకు లొంగిపోకుండా పోలీసులకు అప్పగించిన ఆమె నడవడికను ప్రశంసించవలసిందే. అయితే, అత్యంత సున్నితమైన ఈ ఘటనలో సైతం కించిత్తు బాధ్యతాయుతమైన ప్రవర్తన రాజకీయ నాయకుల్లో కనిపించకపోవడం విషాదం.

తృణమూల్ అధినేత మమతాబెనర్జీ ఏలుబడిలో ఉన్నంతకాలం రాష్ట్రానికి ఈ అకృత్యాలు, అఘాయిత్యాలనుంచి విముక్తిలేదని బీజేపీ నాయకులు విరుచుకుపడుతున్నారు. నిందితులు ఐదుగురూ తృణమూల్‌కు చెందినవారేననీ, మమత వారిని కాపాడుకొస్తున్నదని అమిత్ మాలవీయవంటివారు బరిలోకి దిగి బల్లగుద్దుతూంటే, అందుకు ఆధారాలేమీ లేవని మీడియా అంటోంది. అర్థరాత్రి పన్నెండున్నరకు కాలేజీ వదిలి మగస్నేహితుడితో బయట తిరగాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ మమత చేసిన వ్యాఖ్య అగ్నికి ఆజ్యం పోసింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంలో ఆమె అందెవేసిన చెయ్యి. ఆ తరువాత ఆమె తన మాటల్ని వక్రీకరించారంటూ ఏవో సవరణలూ వివరణలూ ఇచ్చినప్పటికీ, జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆమె వెనక్కుతగ్గినా, బీజేపీ భయానక దాడినుంచి తప్పించుకోవాలంటే ఈ వాదనే సరైనదని ఆమె పార్టీ సహచరులు ఇంకా విశ్వసిస్తున్నట్టు ఉంది.

కోల్‌కతా మహిళలకు క్షేమకరమైన నగరమని ఎన్సీఆర్బీ డేటా వరుసగా నాలుగోసారి ప్రశంసించినందుకు మమత వందిమాగధులంతా ఆమెను ఆకాశానికి ఎత్తేశారు. కానీ, ఈ ఏడాదిలోనే రెండు విద్యాసంస్థల్లోనూ, ఒక వైద్యసంస్థలోనూ జరిగిన అత్యాచారఘటనలు ప్రజలు మరిచిపోలేదు. గత ఏడాది ఆర్జీకార్ ఆస్పత్రిలో జరిగిన అమానుష కృత్యం యావత్‌దేశాన్నే కుదిపేసింది. సుదీర్ఘకాలం మమతను వెంటాడిన ఆ ఘటన తరువాత,

సరిగ్గా ఏడాదిలోనే మమతకు ఈ దుర్గాపూర్ నుంచి మరో విషమపరీక్ష ఎదురైంది. సదరు వైద్యవిద్యార్థిని ఒడిశాకు చెందినది కావడంతోపాటు, ఈ ఘటనలో నిందితుల మతం కూడా బీజేపీకి ఆయుధంగా ఉపకరిస్తున్నది. పశ్చిమబెంగాల్ ఔరంగజేబు పాలనలో ఉందని బాధితురాలి తండ్రి వ్యాఖ్యానించారు. బాధలో ఉన్న ఆ తండ్రి ఎవరిని ఎన్ని మాటలైనా అనవచ్చు, శాపాలూ పెట్టవచ్చు. కానీ, సహజంగా బీజేపీ నాయకులనుంచి వినవచ్చే ఈ తరహా మాటలు, అంతటి కష్టంలోనూ అతడినోట రావడం విచిత్రం. ఈ దారుణఘటన ఒడిశా ఆత్మగౌరవం మీద దాడి అంటున్నాడతను. కోటిన్నర రూపాయలు పెట్టి ఈ ప్రైవేటు కాలేజీలో సీటు కొనుక్కున్నా, తన కుమార్తెకు ఏ మాత్రం భద్రతలే కపోవడమేమిటని అతడు ప్రశ్నిస్తున్నాడు. ఒడిశా నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు, మహిళా కమిషన్ పెద్దలు బెంగాల్ వచ్చి కూర్చున్నారు. బాధితురాలికి ఒడిశా ముఖ్యమంత్రి టెలిఫోన్ చేసి ఓదారుస్తూ, పూర్తి భరోసా ఇచ్చారు. మిమ్మలను పరామర్శించడానికి వచ్చిన పశ్చిమబెంగాల్ గవర్నర్ సి.వి. ఆనందబోస్‌తో మీరంతా మీ బాధను సరిగా పంచుకున్నారా? మీ ఆవేదనను పూర్తిగా తెలియచేశారా? అని బాధితురాలి తల్లిని అడిగి మరీ తెలుసుకున్నారు. ఒడిశా బీజేపీ సర్కార్ సైతం మమతను వదిలిపెట్టదల్చుకోలేదని దీని అర్థం. బెంగాల్ బీజేపీతోనూ, ఢిల్లీలోని వారి అధినాయకులతోనూ పోరాడుతున్న మమతకు ఇప్పుడు పొరుగురాష్ట్రం కూడా కొత్తగా శత్రువైంది. నవీన్‌పట్నాయక్ ఉన్నంత కాలం బెంగాల్, ఒడిశాల మధ్య సఖ్యత ఉండేది. ఇప్పుడది అంతరించి, చిన్నచిన్న వివాదాలు, గిల్లికజ్జాలు మొదలైనాయి. ఇటీవల ఒడిశాలోని కటక్‌లో దుర్గాపూజ సందర్భంగా మతకల్లోలాలు రేగడంపై మమత తీవ్ర విమర్శలు చేశారు. కటక్ తగలబడుతోందని, బీజేపీ రాకతో ఒడిశాలో మతచిచ్చు మొదలైందని, వీళ్ళు ఎక్కడున్నా నాశనమేనంటూ అమె ఘాటుగా విరుచుకుపడ్డారు. దుర్గాపూర్ ఘటనతో అడ్డంగా దొరికిన మమతమీద ఒడిశానేతలు ప్రతీకారం తీర్చుకుంటున్నారు. బెంగాల్‌లో వచ్చే ఏడాది ఎన్నికలు జరగబోతున్న తరుణంలో ఈ విషాదం చుట్టూ సాగుతున్న రాజకీయం ఇప్పట్లో చల్లారే సూచనలు లేవు.

పాకిస్థాన్‌కు ఊపిరాడనివ్వకుండా చేస్తోన్న తాలిబాన్లతో మోదీ సర్కార్ వ్యూహాత్మక స్నేహానికి భారతదేశ ప్రయోజనాలే తొలి, మలి, తుది లక్ష్యం. భారత్‌కు చెప్పుకోదగ్గ ఈ దౌత్య విజయం డోనాల్డ్ ట్రంప్ చేసిన గాయాల తర్వాత ఒక ఉపశమనం.

ట్రంప్ బాధిత భారత్‌కు దౌత్యవిజయం

గల్ఫ్ లేఖ

ఏ దేశ దౌత్య నీతి అయినా దాని సొంత ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుంది. అన్ని దేశాలూ స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదుపుతూ దౌత్యంలో చదరంగం ఆడుతుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా తాలిబాన్లతో చిగురిస్తున్న భారత మైత్రి ఒక ఆసక్తికరమైన పరిణామం.

మతం పేర మానవతకు మచ్చగా, ధర్మం పేర అధర్మ క్రూరత్వానికి ప్రతీకగా ఉన్న అఫ్గానిస్తాన్ పాలకులు ఇస్లామిక్ ఉన్మాద తాలిబాన్లతో హిందూత్వ రాజకీయాలు కేంద్రబిందువుగా మనుగడ సాగించే భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చెలిమి చేయడం అశేష భారతీయులకు సహజంగా ఆశ్చర్యం కలిగిస్తోంది. హిందువులు, సిక్కులను ఊచకోత కోసిన తాలిబాన్ల నాయకుడికి ఉత్తరప్రదేశ్‌లో యోగి అదిత్యనాథ్ ప్రభుత్వం పోలీసు కవాతుతో స్వాగతించింది. తెలుగువాడయిన దౌత్యవేత్త వి.వేంకటేశ్వరరావును కాబూల్‌లో దారుణంగా చంపిన ఉన్మాదుల నాయకుడికి న్యూఢిల్లీలో ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఒకటి సాదర స్వాగతం చెప్పడం సామాన్య జనానికి దిగ్భ్రాంతి కలిగించింది. అఫ్ఘానిస్తాన్‌లోని తాలిబాన్లకు చేరువ కావడానికి భారతదేశం గత కొంత కాలంగా గల్ఫ్ దేశాల పాలకుల అండదండలతో వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తూ లక్ష్యాన్ని సాధిస్తోంది. అఫ్ఘానిస్తాన్‌లోని మత ఛాందస తాలిబాన్ల ప్రభుత్వాన్ని రష్యా మినహా భారత్‌తో సహా ప్రపంచ దేశాలు ఏవీ గుర్తించలేదు, అయినా పాకిస్థాన్‌లో పెరిగి అక్కడి మదరసలో విద్యనభ్యసించి తాలిబాన్ల అగ్రనాయకత్వగణంలో ఒకడుగా ఎదిగిన అఫ్ఘానిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అమీర్‌ఖాన్ ముత్తఖీని మోదీ సర్కారు ఎర్రతివాచీ పరిచి స్వాగతించడం శరవేగంగా మారుతోన్న దౌత్య సమీకరణాలకు సంకేతం.

పాకిస్థాన్ బలం, బలహీనత రెండూ అఫ్ఘానిస్తానే. అసలు తాలిబాన్లు అనేవారు పాక్ సైనిక దళాల నిఘా సంస్థ ఐఎస్ఐ ఉత్పాదిత ఒక క్రూర గెరిల్లాల గుంపు. అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ సేనలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి అమెరికాతో సహా పాశ్చాత్య దేశాలన్నీ కలిసికట్టుగా పాక్ సహకారంతో తాలిబాన్లను ప్రభవింపచేసి పెంపొందించారు. భారత మిత్రుడు అయిన నజీబుల్లాను 1992లో ముజాహిదీన్లు పదవీచ్యుతిడిని చేశారు. దేశం విడిచి పారిపోలేని నిస్సహాయత



స్థితిలో అతడు కాబూల్ నగరంలో ఐక్యరాజ్యసమితి శరణు జొచ్చాడు. 1996లో తాలిబాన్లు ఐరాస కార్యాలయం నుంచి నజీబ్‌ను అపహరించి కిరాతకంగా హతమార్చి మరీ అధికారాన్ని చేపట్టారు. తొలుత ముజాహిదిన్లతో గానీ, ఆ తరువాత తాలిబాన్లతో గానీ భారతదేశం ఏ విధమైన దౌత్య సంబంధాలు పెట్టుకోలేదు. భారత్ వైఖరి అప్పట్లో తీవ్ర విమర్శలకు గురయింది. ఆ తర్వాత నజీబుల్లా ప్రత్యర్థులు అయిన ముజాహిదీన్లు కొందరితో స్నేహం చేయడం భారత్‌కు అనివార్యమైంది. నజీబుల్లాను కూలద్రోసిన అహ్మద్ షా మసూద్ భారత్‌కు ఆప్తుడయ్యాడు. తాలిబాన్లకు వ్యతిరేకంగా పోరాడిన అహ్మద్ షా మసూద్‌కు భారత్ అన్ని విధాలుగా సహాయమందించింది.

తాలిబాన్ల మొదటి ప్రభుత్వ హయాం (1996-2001)లో అఫ్ఘానిస్తాన్‌లో పాకిస్థాన్‌కు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది. ఆ తర్వాత అమెరికా, నాటో దేశాల చేతుల్లో కీలుబొమ్మలు అయిన పాలకులు 2021 వరకు అఫ్ఘానిస్తాన్‌ను పరిపాలించినా తాలిబాన్లను నిర్మూలించలేకపోయారు. అమెరికా నిష్క్రమణ అనంతరం 2021లో అఫ్ఘానిస్తాన్‌లో మళ్లీ అధికారాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబాన్లు ఈ సారి పాక్ పాలకుల కనుసన్నలలో కాకుండా స్వతంత్రంగా బాహ్య ప్రపంచం వైపు చూడడం మొదలుపెట్టారు. పాకిస్థాన్‌తో విబేధిస్తూ తమ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వడం ప్రారంభించారు. తమకు ఆలంబనగా ఖతర్‌ను ఎంచుకున్నారు. తరం మారడంతో ఆలోచన సరళి కూడా మారింది. గతంలో పాకిస్థాన్ చెప్పినట్లుగా తాలిబాన్ల అధినాయకుడు ముల్లా ఉమర్ నడువగా ఇప్పుడు అతని కుమారుడు, ప్రస్తుత రక్షణమంత్రి ముల్లా యాఖూబ్ అలా నడువాలనుకోవడం లేదు. ఖతర్‌లో భారత విదేశాంగ శాఖ అధికారులతో ముల్లా యాఖూబ్ సమావేశం కావడం ఆ తర్వాత దుబాయిలోనూ అఫ్ఘానిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రి ముత్తఖీ సమావేశం కావడం పాకిస్తాన్‌ను కలవరపరిచింది. పహల్గాంలో ఉగ్రదాడిని పాకిస్థాన్ పేరు ప్రస్తావిస్తూ పొరుగున ఉన్న నేపాల్ ఖండించలేదు కానీ అఫ్ఘానిస్తాన్ మాత్రం నిర్ద్వంద్వంగా ఖండించింది, ఇది మాములు విషయం కాదు. భారత దౌత్యనీతికి విజయం. అయినా మోదీ ప్రభుత్వం ఈ విజయాన్ని బహిరంగంగా చెప్పుకోలేని ఇరకాటంలో ఉన్నది.

దాయాది దేశానికి ఊపిరాడనివ్వకుండా చేస్తోన్న తాలిబాన్లతో భారత్ వ్యూహాత్మక స్నేహం మన దేశ ప్రయోజనాలు లక్ష్యంగా ఉన్నదే, సందేహం లేదు. భారత్‌కు చెప్పుకోదగ్గ ఈ దౌత్య విజయం డోనాల్డ్ ట్రంప్ చేసిన గాయాల తర్వాత ఒక ఉపశమనం. దేశీయ రాజకీయాల విషయానికి వస్తే, ఒకవేళ కాంగ్రెస్ పార్టీయే తాలిబాన్లతో ఇటువంటి మైత్రి చేసి ఉన్నట్టయితే బీజేపీ అగ్గిరాజేసేదని ప్రత్యేకంగా చెప్పవల్సిన అవసరం లేదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ ఘటనల రేపటి దృశ్యం ఏమిటి?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

భారతదేశంలో కొన్ని సంఘటనలు అనూహ్యంగా రాజకీయ పరిణామాలకు దారితీయడం కద్దు. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనల రాజకీయ పర్యవసానాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉన్నది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బూటు దాడి కలిగించిన దిగ్భ్రమ నుంచి సమాజం తేరుకోకముందే హరియాణాలో పూరన్ కుమార్ అనే ఒక ఐపీఎస్ అధికారి ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. ఈ రెండు ఘటనల మధ్య రాయబరేలీలో ఒక అమాయకుడిని చెట్టుకు కట్టి కొట్టి చంపారు. ఈ ముగ్గురూ దళితులే కావడం దేశంలో ఆ అణగారిన సామాజిక వర్గాల పరిస్థితిపై చర్చలకు దారితీస్తోంది. గ్వాలియర్ కోర్టులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణను కొందరు అడ్డుకోవడం, ఒక న్యాయవాది అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా ఉద్రిక్తతలకు కారణమైంది. ఈ సంఘటనలు ఏ మార్పును సూచిస్తున్నాయి?

పూరన్ కుమార్ ఆత్మహత్య తర్వాత సంభవించిన పరిణామాలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోనేపట్‌లో జన విశ్వాస్ జనవికాస్ కార్యక్రమంలో పాల్గొనవలసి ఉండగా తన పర్యటననే రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి సైనీ పాల్గొనాల్సిన వాల్మీకి ఉత్సవాలను కూడా రద్దు చేశారు. పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన 9 పేజీల లేఖలో హరియాణాలో తాను ఎదుర్కొన్న కులవివక్షను, వేధింపులను ప్రస్తావించారు. డీజీపీతో సహా 12 మంది అధికారుల పేర్లను కూడా పేర్కొన్నారు. తనకు ప్రమోషన్లు రాకుండా అడ్డుకున్నారని, ప్రాధాన్యత లేని పోస్టింగులు ఇచ్చారని ఆయన ఆరోపించారు. తన భర్త ఆరోపణలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోనిపక్షంలో ఆయన భౌతిక కాయాన్ని పోస్ట్ మార్టమ్‌కు అప్పగించే ప్రసక్తి లేదని పూరన్ కుమార్ భార్య, ఐఏఎస్ అధికారి అమ్నీత్ కుమార్ పట్టుబడుతున్నారు. పూరన్ ఆత్మహత్య తర్వాత చండీఘడ్‌లో ఆయన నివాసాన్ని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీతో సహా రాజకీయ పార్టీల నేతలందరూ సందర్శించడం ప్రారంభించారు. బిహార్‌లో ఎన్డీఏ మిత్రపక్షంగా ఉన్న లోక్‌జనశక్తి నేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా పూరన్ కుమార్ నివాసానికి వెళ్లి ప్రభుత్వ సంస్థల్లో కులఆధారంగా వివక్ష జరుగుతోందని విమర్శించారు. ఈ కుటుంబానికి న్యాయం జరగకపోతే ఏ దళిత కుటుంబమూ ప్రధాన స్రవంతిలో చేరేందుకు ముందుకు రాదని ఆయన అన్నారు. అక్టోబర్ 7న పూరన్ ఆత్మహత్య చేసుకోగా వారం రోజుల తర్వాత డీజీపీని సెలవుపై పంపించడం అనివార్యమయింది.

అధికార వ్యవస్థలోను, రాజకీయాల్లోనూ కుల వివక్ష దేశంలో కొత్తది కాదు. పూరన్ కుమార్ ఆరోపణల్లో వాస్తవాలు ఏ మేరకు ఉన్నాయో, ఆయన నిజంగా వివక్ష వల్ల ఆత్మహత్య చేసుకున్నారో అన్నవి సరైన విచారణ జరిగినప్పుడే తేలుతుంది కాని ఈ దేశంలో కుల వివక్ష తీవ్రంగా ఉన్నదన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. అదే సమయంలో వివిధ అణగారిన కులాలను దరి చేర్చుకోకుండా రాజకీయాల్లో విజయం సాధించలేమన్న విషయం కూడా ఆయా పార్టీలకు తెలుసు. 16 శాతం దళితులు ఉన్న హరియాణలో కుల రాజకీయాల ప్రాధాన్యం తెలిసినందువల్లే గత ఎన్నికల్లో ఎస్సీల్లో మరింత వెనుకబడిన వర్గాలకు ఎన్నికల ముందు 20 శాతం రిజర్వేషన్ కల్పించారు. అదే సమయంలో సెల్జా వంటి దళిత నేతలను కాంగ్రెస్ విస్మరించడం కూడా బీజేపీకి ఉపయోగపడింది. ఇప్పుడు అదే బీజేపీకి పూరన్ కుమార్ ఆత్మహత్య సమస్యలు తెచ్చిపెడుతోంది.

నిజానికి హిందూత్వ ఆధారంగా అనేక కులాలను ఆకర్షించి బీజేపీకి ఓటు బ్యాంకు సాధించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చాలా కాలంగా కృషి చేస్తోంది. 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏ సిద్ధాంతానికీ బందీ కాదు. అది నిత్యం సమాజం అవసరాలకు తగ్గట్లుగా తనను తాను మార్చుకున్నందువల్లే అది దినదిన ప్రవర్ధమానమవుతోంది' అని ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ సిద్ధాంతకర్త రాంమాధవ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ కూడా వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నది కాని ఆ పార్టీ క్షీణ దశలో ఉన్నదని, 21వ శతాబ్దంలో కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకత తగ్గిపోతుండగా ఆర్ఎస్ఎస్ ఆవశ్యకత పెరిగిపోతోందని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఒక మెజారిటీ మతం ఆధారంగా పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్‌ను ఒక రాజకీయ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీతో పోల్చవచ్చా అన్న విషయాన్ని పక్కన పెడితే ఏ సంస్థ ప్రభావాన్ని అయినా అది ఎన్ని సంవత్సరాలు పూర్తి చేసుకున్నది అన్న విషయం ఆధారంగా అంచనా వేయడం కష్టం. 11 సంవత్సరాల క్రితం కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఆర్ఎస్ఎస్ విశేషంగా దోహదం చేసిందనడంలో సందేహం లేదు. అదే సమయంలో బీజేపీ అధికారంలో ఉన్నందువల్ల కూడా ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరిగిందన్న విషయంలో కూడా అనుమానం లేదు. భారతీయ జనతా పార్టీ అభ్యున్నతికి ఆర్ఎస్ఎస్ కారణమైనందువల్ల మోదీ ప్రభుత్వం ఎదుర్కొనే ప్రశంసలనైనా, విమర్శలనైనా సంఘ్‌ను దృష్టిలో పెట్టుకోకుండా చేయడం సరైంది కాదేమో? ఒక రకంగా రాజగురువు పాత్రను సంఘ్ పోషిస్తుండడమే అందుకు కారణం.

రాంమాధవ్ అన్నట్లు ఆర్ఎస్ఎస్ తనను తాను పరివర్తనం చేసుకుంటోంది. బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కూ పెద్ద తేడాలేని విధంగా ఈ మార్పు జరుగుతోంది. అనేకమంది బీజేపీ నేతలు ఆర్ఎస్ఎస్ శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్నారు. ఆర్ఎస్ఎస్‌ను ఒక ఎన్జీవోగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పినప్పటికీ ప్రభుత్వంపై దాని ప్రభావాన్ని విస్మరించలేము. ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు మారుమూల ప్రాంతాల్లో కూడా రాజకీయ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. బూత్ స్థాయి మేనేజ్‌మెంట్ నుంచి బీజేపీ నేతల మధ్య విభేదాలు తొలగించేందుకు కూడా ఆ సంస్థ ప్రయత్నిస్తోంది. వివిధ రాజకీయ పార్టీల మధ్య పొత్తులు సంఘ్ వల్లే ఏర్పడుతున్నాయి.

ఒకప్పుడు అగ్రవర్ణాల పార్టీగా, బ్రాహ్మణ-బనియా పార్టీగా మాత్రమే గుర్తింపు పొందిన భారతీయ జనతా పార్టీ ఇవాళ దళితులు, ఆదివాసీలు, ఇతర అణగారిన వర్గాల్లో చొచ్చుకువెళ్లేందుకు సంఘ్ అనేక కార్యకలాపాలు నిర్వహించడమే ప్రధాన కారణం. ఉత్తర భారతదేశంలో కాన్షీరామ్ ప్రయోగం విఫలమయ్యాక దళితులను పెద్ద ఎత్తున తమ వైపునకు తిప్పుకునేందుకు చాలా కాలం నుంచి ఆర్ఎస్ఎస్ యత్నిస్తోంది. కాన్షీరామ్ విమర్శించిన చెంచారాజ్ సంస్కృతే ప్రత్యామ్నాయ దళిత రాజకీయాలకు నష్టం చేకూరుస్తుందేమో? 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక దళిత ఓట్లు బీజేపీ సాధించేందుకు ఆర్ఎస్ఎస్ కారణం అనడంలో అతిశయోక్తి లేదు.

నిజానికి దళితులను హిందూత్వ వైపునకు మళ్లించడంలో ఆర్ఎస్ఎస్ రూపొందించిన భూమిక ఆధారంగానే బీజేపీ పనిచేస్తోంది. దళితులను రాజకీయంగా సమీకరించడంలో భాగంగా వారిలో వేర్వేరు సాంస్కృతిక వర్గాలను, స్థానిక ఆచారాలను, వారు ఆరాధించే సద్గురువులను హిందూత్వలో విలీనం చేసేందుకు సంఘ్ చాలా కాలంగా కృషి చేస్తోంది. 'సామాజిక సమరసత మంచ్' పేరుతో దళితుల్లో చొచ్చుకుపోయే ప్రయత్నం చేసింది. రవిదాస్, కబీర్, శివనారాయణ్ సందేశాలను స్వంతం చేసుకుంది. తమ సాధువులు, గురువులకు ఇస్తోన్న గౌరవాన్ని దళితులూ గుర్తించి సంఘ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సమానత్వం, గౌరవం కోసం దళితుల తపనను అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. సుహల్దేవ్, బల్దేవ్, దల్దేవ్ వంటి పాసీ హీరోల ఉత్సవాలను నిర్వహించారు. ఒకప్పుడు వారిని అగ్రవర్ణాలపై పోరాడిన శక్తులుగా కాన్షీరామ్ భావించారు. కాని వారిప్పుడు జాతీయవాద, హిందూత్వశక్తులుగా మారారు. అంతేకాక జాతవేతర దళితులు, యాదవేతర ఓబీసీల్లో కూడా ఆర్ఎస్ఎస్ పనిచేస్తోంది. గుజరాత్ నుంచి త్రిపుర వరకు ఆదివాసీలు, సంచార జాతుల్లో కూడా పనిచేస్తోంది. యూపీ, రాజస్థాన్, ఎంపీ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో అత్యధిక ఓట్లు లభించేందుకు అదే కారణం. వారి చరిత్రను, గుర్తింపును, సాంస్కృతిక చిహ్నాలు, సంకేతాలను వేదాలు, పురాణాల్లో గాథలకు, వ్యక్తులకు ముడిపెట్టి దేశం జాతి ప్రయోజనాలు అన్న భావనను ప్రవేశపెట్టేందుకు సంఘ్ చేస్తున్న కృషి అంతా ఇంతా కాదు.

అగ్రవర్ణాలను బీజేపీ వైపు తిప్పుకోవడం పెద్ద కష్టం కాదు యూపీ, బిహార్‌లో దళితులు, ఓబీసీలను హిందూత్వ పరిధిలో ఇముడ్చుకోవడం ఆర్ఎస్ఎస్ బీజేపీ ఒక సవాలుగా తీసుకున్నాయి. సోషలిస్టు రాజకీయాలు విఫలమయ్యాక వారి పని కొంత సులువైంది. షెడ్యూల్డు కులాలు, బీసీల ఓట్లను సమీకరించేందుకు ఉత్తరప్రదేశ్‌లో అప్నాదళ్, సుహల్దేవ్ భారతీయ సమాజ్ వంటి పార్టీలతోనూ, బిహార్ నితీశ్ కుమార్, రాంవిలాస్ పాశ్వాన్ వంటి వ్యక్తులతోనూ బీజేపీ పనిచేసేందుకు ఆర్ఎస్ఎస్ ప్రోద్బలమే కారణమని వేరే చెప్పనక్కర్లేదు. రాజ్యాంగాన్ని కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్ గౌరవించే ప్రయత్నం చేస్తున్నాయి. 'ఇది మన రాజ్యాంగం' అని గోల్వాల్కర్ అన్న మాటల్ని రాంమాధవ్ గుర్తు చేశారు.

కాని ఈ మార్పు ప్రజల జీవితాల్లో, ఆలోచనా విధానంలో, ఎంత మేరకు మార్పు తీసుకువచ్చిందన్నదే ప్రధానం. సంఘ్ ఎంత ప్రయత్నించినా ప్రజల్లో కుల అస్తిత్వాలను చెరిపివేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. తాను నిలబెట్టిన ప్రభుత్వంపై నైతిక ఆధిపత్యం చలాయించడం కూడా అంత సులభం కాదని స్పష్టమవుతోంది. గత కొంతకాలంగా సామాజిక న్యాయం అజెండాగా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పనిచేస్తున్న విషయాన్ని విస్మరించలేము. గవాయ్‌పై దాడి, పూరన్ కుమార్ ఆత్మహత్య వంటి సంఘటనలు ప్రతిపక్షాల సామాజిక న్యాయ అజెండాకు తోడ్పడతాయనడంలో అతిశయోక్తి లేదు. కుల రాజకీయాలే ప్రధానమైన బిహార్ ఎన్నికల్లో ఈ ప్రభావం ఎంతమేరకు ఉంటుందో ఇప్పుడే చెప్పలేము కాని హిందూత్వ పరిధిలోకి అణగారిన వర్గాలను తీసుకు వచ్చేందుకు ఆర్ఎస్ఎస్ చేసిన కష్టం వృథా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీజేపీపై ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



AKBAR

> **ఆరెస్సెస్ ఎంత ప్రయత్నించినా ప్రజల్లో కుల అస్తిత్వాలను చెరిపివేయడం అంత సులభం కాదు. తాను నిలబెట్టిన ప్రభుత్వంపై నైతిక ఆధిపత్యం చలాయించడమూ సాధ్యం కాదు. గవాయ్‌పై దాడి, పూరన్ కుమార్ ఆత్మహత్య ప్రతిపక్షాల సామాజిక న్యాయ అజెండాకు తప్పక తోడ్పడతాయి. బిహార్ ఎన్నికల్లో ఈ ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో గానీ హిందూత్వ పరిధిలోకి అణగారిన వర్గాలను తీసుకువచ్చేందుకు సంఘ్ చేసిన కష్టం వృథా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీజేపీపై ఉన్నది.**

అమెరికా ఆత్మీయురాలికే నోబెల్ 'శాంతి'!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏటి నోబెల్ శాంతి బహుమతి తనకే కావాలని ప్రకటించి ఆ ప్రయత్నం చేయటంతో ఈసారి అవార్డు ఎంపిక ఆసక్తికరంగా మారింది. బహుమతి కోసం పరోక్షంగా ప్రయత్నించటం సహజమే కానీ, తనకి ఇవ్వమని ఆ స్థాయి మనిషి బహిరంగంగా హుంకరించటం అరుదు. ఇలా చేసి ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా తన స్థాయిని తానే తగ్గించుకోవటంతోపాటు, చివరకు ఎంపిక కాలేక అవమానం పాలయ్యారు.

గతంలో అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన రూజ్‌వెల్ట్ (1906), వుడ్రో విల్సన్ (1919), జిమ్మి కార్టర్ (2002), బరాక్ ఒబామా (2009)లు నోబెల్ శాంతి బహుమతులు అందుకున్నారు. గత రెండు శతాబ్దాలుగా ప్రపంచంలో ఏ మూల యుద్ధం జరిగినా అమెరికా పాత్ర ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వుంటుందనేది వాస్తవం. ఈ నిజం నేపథ్యంలో అసలు అమెరికా ఏ అధ్యక్షుడైనా ఈ అవార్డుకి అర్హుడేనా అన్నది ఎక్కువమంది విజ్ఞుల అనుమానం. అయితే నోబెల్ ఎంపిక కమిటీ ట్రంప్‌ను బుజ్జగించటానికి అతని అనుంగు అనుచరురాలు, అమెరికా కీలుబొమ్మ అయిన వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు ఈ అవార్డు ప్రకటించింది. ఆమె కూడా తమ మైత్రిని ఏ మాత్రం దాచుకోకుండా ఈ అవార్డుని ట్రంప్‌కి అంకితం చేస్తున్నట్లు ప్రకటించింది.



వెనిజులా ప్రజా నాయకుడు చావెజ్‌ని 2002లో అధ్యక్ష పదవి నుంచి తప్పించిన కుట్రలో ఈ మచాడో కీలక భాగస్వామి. కానీ ప్రజల ఆగ్రహ ఉద్యమంతో చావెజ్ విడుదలయ్యాడు. రాజద్రోహం ఆరోపణలపై విచారణ జరిపి మచాడోకి 28 సంవత్సరాల జైలుశిక్షని కోర్టు విధించింది. కాని పెద్దమనసుతో చావెజ్ ఆమెకి క్షమాభిక్ష పెట్టారు. అప్పట్లోనే (2005) ఆనాటి అమెరికా అధ్యక్షులు జార్జి డబ్ల్యూ బుష్ మచాడోని వైట్‌హౌస్‌కి పిలిపించుకుని చర్చలు జరిపాడు. వెనిజులా నాయకుడు చావెజ్ దేశ ప్రయోజనాల కోసం చమురు, ఉక్కు పరిశ్రమల్ని జాతీయం చేయటంతో దేశంలోని పెద్ద వ్యాపారులకి, అమెరికా ఆధిపత్యానికి తీవ్ర విఘాతం కల్గింది. దాంతో వీరంతా చావెజ్‌పై తీవ్రమైన అక్కసుతో ఉన్నారు. అలాంటి ఒక బడా ఉక్కు వ్యాపారి కూతురే ఈ కొరినా మచాడో. తన దేశంలో ప్రభుత్వ ఆస్తుల్ని తగలబెట్టడం, కొందరు ప్రజల సజీవ దహనం లాంటి హింసకు కారకురాలైన ఈ 'శాంతి పురస్కార గ్రహీత' తన దేశంలో ప్రభుత్వాన్ని మార్చటానికి సహకరించాలని ఇజ్రాయెల్, అర్జెంటీనా లాంటి దేశాలకు లేఖలు రాశారు. గాజా మారణకాండ నేపథ్యంలో నెతన్యాహుని సమర్థిస్తూ 'ఇజ్రాయెల్ స్వేచ్ఛకు నిజమైన మిత్రుడని' ఈమె కొనియాడారు. ఈ ఎంపికను వర్తమాన ప్రపంచంలో అనేకమంది ప్రజాస్వామిక ప్రియులు వ్యతిరేకిస్తుండటంలో ఆశ్చర్యం లేదు.

ఈ ఏటి నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయినవారిలో పాలస్తీనా పిల్లలకు, స్త్రీలకు, కాందిశీకులకు మానవతా సాయం చేస్తూ, ఇజ్రాయెల్ అమెరికాల నిర్బంధాన్ని సైతం ఎదుర్కొంటున్న 'ఫ్రొటిల్లా' వంటి సంస్థ కూడా ఉన్నది. అలాంటి ఎంపికలను కాదని– తన దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు పాదాక్రాంతం చేయటానికి వెనుకాడక, మాదక ద్రవ్యాలను అరికట్టే పేరుతో ట్రంప్ చేయాలని చూస్తున్న దురాక్రమణ వ్యూహానికి మద్దతు పలుకుతున్న 'దేశద్రోహి'కి, వెనిజులా తీరంలో యుద్ధ నౌకల్ని మోహరించిన అమెరికాని సమర్థిస్తున్న మచాడోకి శాంతి బహుమతి ఇచ్చారు. నోబెల్ దృష్టిలో శాంతికి హింసకి ఉన్న నిర్వచనాలేమిటో మెజారిటీ ప్రజలకు అర్థం కావటం లేదు. ఇది మన స్ఫూర్తిలేని నిర్ణయమని దీనిని పునఃపరిశీలించాలని అమెరికా – ఇస్లామిక్ దేశాల మండలి డిమాండ్ చేసింది. మచాడోతో పోల్చితే ప్రజల దృష్టిలో చాలా మెరుగైన వారి పేర్లను కొందరు ప్రస్తావిస్తున్నారు. అసలు నామినేట్ అయిన మొత్తం 244 మంది వ్యక్తులు 94 సంస్థల వివరాలు ప్రకటిస్తే ఈ ఎంపిక ఎంత ఏకపక్షమో ప్రపంచానికి అర్థమవుతుంది.

ట్రంప్ పాకులాడినా ఎంపిక చేయలేదని అన్పించుకున్న ఈ ఎంపిక కమిటీ కనీసం తమ ఎంపికను ప్రకటించే వరకు కూడా లీక్ కాకుండా కాపాడుకోలేకపోయింది. దేనితో అయినా జూదం ఆడగల, జూదాన్ని ప్రోత్సహించగల కార్పొరేట్ శక్తులు తమ బెట్టింగ్ ప్లాట్‌ఫాం పాలీ మార్కెట్‌లో మచాడో ఎంపిక విషయాన్ని లీక్ చేయించి, ఆమెపై బెట్టింగ్‌ను 3.75శాతం నుంచి 73శాతానికి పెంచాయి. ఈ విషయాన్ని సాక్షాత్తూ నోబెల్ కమిటీ కార్యదర్శి క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌విలెన్ నార్వే టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆదివారం ప్రకటించారు. నోబెల్ బహుమతుల ఎంపిక పకడ్బందీగా, పారదర్శకంగా ఉంటుందన్న అభిప్రాయంలోని డొల్లతనాన్ని ఈ విషయం ఋజువు చేస్తున్నది. ఇప్పటివరకు మన దేశంలోని అకాడమి ఎంపికల్ని చూసి అవాక్కవుతున్న మనం విశ్వవ్యాప్తంగా ఎంపికలన్నీ ఒకేరకం అని సరిపెట్టుకొని కొంత ఉపశమనం పొందుదాం. సామ్రాజ్యవాదులు తన పంజా దేని మీదకైనా విసరగలరని అర్థం చేసుకుందాం.

• చెరుకూరి సత్యనారాయణ

సీనియర్ టీచర్లకు టెట్ తిప్పలు

ఉపాధ్యాయులందరూ సర్వీసులో కొనసాగాలంటే తప్పనిసరిగా రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగం నుంచి రిటైర్ కావాలని సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. అయిదేళ్లలోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు కూడా ప్రమోషన్ కావాలంటే టెట్ పాస్ కావాల్సిందేనని కోర్టు వెల్లడించింది. 2010 ఆగస్టు 23కు ముందు దేశవ్యాప్తంగా నియామకమైన ఉపాధ్యాయుల్లో దాదాపు 25 లక్షలమంది టీచర్ల ఉద్యోగాలకు టెట్ గండం పొంచి ఉంది. 'ఉపాధ్యాయులకు ప్రమోషన్ కోసమే కాకుండా సర్వీసులో కొనసాగాలంటే కూడా తప్పనిసరిగా టెట్ పాస్ కావాల'ని చెప్తూనే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం మానవతా దృక్పథంతో 'అయిదేళ్ల లోపు సర్వీసు ఉన్న వారికి టెట్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు, మిగిలిన వారికి టెట్ పాస్ కావడానికి తీర్పు తేదీ నుంచి రెండేళ్ల సమయం ఇస్తున్నట్లు' సుప్రీంకోర్టు తెలిపింది.




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2011లో విడుదల చేసిన టెట్ మార్గదర్శకాల ఉత్తర్వులు జీవో 51లోని పేరా–11లోనూ, తదుపరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2015లో విడుదల చేసిన టెట్ గైడ్‌లైన్స్ జీవో 36లోని పేరా–12లోనూ.. 23 ఆగస్ట్ 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయించినట్లు స్పష్టంగా పేర్కొంది. టెట్ రాయడానికి వయోపరిమితి 18 – 44 ఏళ్లుగా నిర్ణయించింది. అందుకే 2010 నాటికి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు మరొక పోస్టు కోసం ప్రత్యక్ష నియామకం ద్వారా డీఎస్సీ/ టీఆర్టీ రాయాలనుకున్నవారు మినహా ఎవరూ గత 15 ఏళ్లుగా టెట్ రాయాలనే ఆలోచనే చేయలేదు.

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ ప్రమోషన్లలో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించేందుకు 2024 మే 3న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పలు ఉపాధ్యాయ సంఘాలు ఢిల్లీ వెళ్లి NCTE చైర్మన్‌కు విన్నవించాయి. దీంతో రాష్ట్ర విద్యాశాఖ కోరిన విధంగా టెట్ ఎవరెవరికి అవసరమో స్పష్టతనిస్తూ ఆ జాతీయ సంస్థ వివరణ ఉత్తర్వులు (F.No. NCTE/23/2024 – Academic Section– HQ/124856) ఇచ్చింది. ఆ ఉత్తర్వుల ప్రకారం ప్రమోషన్ ద్వారా పాఠశాల స్థాయి మారిన సమయంలో మాత్రమే టెట్ తప్పనిసరి. 'పీఎస్, హైస్కూలు హెచ్‌ఎం పోస్టులు టెట్ నిబంధనల పరిధిలో లేవు కాబట్టి ప్రమోషన్లు ఇవ్వడానికి టెట్ అవసరమా లేదా అనే అంశంపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవాలి' అని ఆ ఉత్తర్వుల్లో తెలిపింది. అప్పుడు కూడా సర్వీసులో కొనసాగడానికి టెట్ అవసరమని పేర్కొనలేదు.

సుప్రీంకోర్టు మెయిన్ కేసులో ఉన్న అసలు వివాదం 'మైనారిటీ విద్యాసంస్థల్లో టీచర్ల నియామకానికి టెట్ అవసరమా? కాదా?' అన్నది తేల్చకుండా రాజ్యాంగ ధర్మాసనానికి పంపించి, ఉపాధ్యాయులు పదోన్నతి పొందటానికి, సర్వీసులో కొనసాగడానికి టెట్ పాస్ కావాలని తీర్పు చెప్పింది. సుప్రీం తీర్పు ప్రకారం ఆరేళ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయుడు రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే ఉద్యోగం నుంచి తొలగించబడతాడు. కానీ అయిదేళ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయుడు టెట్ మినహాయింపుతో ఆ తర్వాత మూడేళ్లూ సర్వీసులో కొనసాగుతాడు. ఇదొక పెద్ద అనామలీ. టెట్ సిలబస్, అర్హత మార్కుల నిర్ణయం కూడా అశాస్త్రీయంగా ఉంది.

ఉపాధ్యాయుల్లో నెలకొన్న భయాందోళనలను దూరం చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు కొన్ని ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి విద్యాహక్కు చట్టం అమలుకు 'పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి కాకుండా' సవరణ ఉత్తర్వులు పొందాలి. ఉపాధ్యాయ అర్హత పరీక్షను ప్రాస్పెక్టివ్‌గా అమలు చేసే విధంగా కేంద్రం 'విద్యాహక్కు చట్టం–సెక్షన్ 23'ను సవరించాలి. టెట్ సిలబస్‌ను, అర్హత మార్కులను సవరించాలి. టెట్ పరీక్షను ఈ రెండేళ్లలో వీలైనన్ని ఎక్కువసార్లు నిర్వహించాలి. లేదా ఏపీలో ఇన్ సర్వీస్ టీచర్లకు గతంలో ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ నిర్వహించిన విధంగా ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలి.

– చావ రవి, ప్రధాన కార్యదర్శి, ఎస్టీఎఫ్ఐ



నేడు సీఎం రాక

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి 'మాతృయజ్ఞం' కార్యక్రమానికి హాజరు
- పీజేఆర్ గార్డెన్స్‌లో 1.15 నుంచి 1.45 గంటల వరకు గడపనున్న సీఎం



హనుమకొండ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం హనుమకొండకు రానున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ 'మాతృయజ్ఞం' కార్యక్రమం హనుమకొండ వడ్డేపల్లిలోని పీజేఆర్ గార్డెన్స్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రేవంత్‌రెడ్డి వస్తున్నారు. ఆయన రాక కోసం కాంగ్రెస్ నేతలు, అధికార యంత్రాం గం ఏర్పాటు చేశారు. సీఎం మధ్యాహ్నం 1 గంటకు సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. 1.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి వడ్డేపల్లి పీజేఆర్ గార్డెన్స్‌కు చేరుకుంటారు. 1.15 నుంచి 1.45 గంటల వరకు దొంతి కాం తమ్మ స్మారకార్థం జరిగే 'మాతృయజ్ఞం' కార్యక్రమంలో పాల్గొంటారు. 2 గంటలకు హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో తిరిగి వెళతారు.

ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దశదిన కర్మకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను సీపీ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కార్యక్రమం జరిగే కాజీపేట 100 ఫీట్ల రోడ్డులోని పీజేఆర్ గార్డెన్‌తో పాటు హెలీకాప్టర్ ల్యాండ్ అయ్యే ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌ను సందర్శించారు.

మళ్లీ మెరిసిన జీవాంజి దీప్తి



పర్వతగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ పట్టణంలో జరుగుతున్న వీర్టచుస్ పారా వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ బిడ్డ జీవాంజి దీప్తి మరో స్వర్ణం సాధించింది. ఇప్పటికే 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం కైవసం చేసుకోగా, మంగళవారం ఉదయం మహిళల 200 మీటర్ల పరుగులో సైతం బంగారు పతకంతో మెరిసింది. వరల్డ్ అథ్లెటిక్స్‌లో రెండు స్వర్ణాలను చేజిక్కించుకొని రికార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పలువురు జీవాంజిని అభినందిస్తున్నారు. జీవాంజి దీప్తి వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన క్రీడాకారిణిగా సుపరిచితమే.

వడి వడిగా సాగేనా!?

- గత జూలై 11తోనే ముగిసిన స్మార్ట్ సిటీ పథకం
- పెండింగ్ పనుల కోసం మరో రెండున్నర నెలలు గడువు
- నగరంలో 108 ప్రాజెక్టుల అమలు
- వరంగల్, కరీంనగర్‌లో రూ.500 కోట్ల పనులకు మోక్షం
- సకాలంలో వాటా నిధులు విడుదల చేయని గత బీఆర్ఎస్ ప్రభుత్వం

'స్మార్ట్ సిటీ' పనుల పూర్తికి డిసెంబరు చివరి వరకు గడువిచ్చిన కేంద్రం



నత్తనడకన సాగుతున్న వరంగల్ భద్రకాళి బండ్ పనులు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

నగరాల్లో మౌళిక సదుపాయలను మెరుగుపరచటం, ప్రజల జీవన ప్రమాణాలను పెంచటం కోసం కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ పథకం తీసుకవచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం కింద వరంగల్, కరీంనగర్ నగరాలను 2017లో ఎంపిక చేశారు. ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.500కోట్లు ఈ పథకానికి కేటాయిస్తే, రూ.వెయ్యి కోట్లతో ఆయా నగరాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం చేయటంతో స్మార్ట్ సిటీ పనుల్లో జాప్యం జరుగుతూ వచ్చింది. 2020, 2021లో కరోనాతో రెండేళ్ల పనులు నిలిచిపోయాయి. దీంతో 2024 వరకు గడువు పెంచారు. అయినప్పటికి పనులు పూర్తి కాకపోవటంతో 2025 జూలై 11 వరకు గడువు పెంచినప్పటికీ పనులు పూర్తికాకపోవటంతో పాటు భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది చివరినాటికి స్మార్ట్ సిటీ మిషన్ గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించింది.

2017లో ప్రారంభమైన స్మార్ట్ సిటీ పథకంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో రాష్ట్రవాటాను విడుదల చేయటంలో జాప్యం చేసింది. దీంతో స్మార్ట్ సిటీ పనులు నత్తనడకన సాగాయి. వరంగల్ నగరానికి ఈ పథకం కింద 108 ప్రాజెక్టులను చేపట్టారు. ఇందుకోసం రూ.944.67కోట్ల నిధులతో డీపీఆర్ రూపొందించారు. కేంద్రం విధించిన జూలై 11వ తేదీ గడువు ముగిసే నాటికి 542.29కోట్లతో చేపట్టిన 70పనులు పూర్తయ్యాయి. రూ.328.96కోట్ల వ్యయంతో చేపట్టిన 34 పనులు నడుస్తున్నాయి. అయితే గడువు ముగియటంతో సుమారు రూ.219.46కోట్ల బిల్లుల చెల్లింపులు నిలిచిపోవటంతో కాంట్రాక్టర్లు పనులను ఆపేశారు.

వరంగల్ నగరంలో రోడ్ల అభివృద్ధితో పాటు భద్రకాళి బండ్, వడ్డేపల్లి బండ్ సుందరీకరణ పనులకు బ్రేక్ పడింది. అలాగే కరీంనగర్ సిటీలో కూడా రూ.1,094కోట్ల నిధులతో పనులు చేపట్టారు. వీటిలో రూ.979కోట్లతో 49 పనులు పూర్తి చేశారు. డిజిటల్ లైబ్రరీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, స్మార్ట్ క్లాస్ రూమ్స్ తదితర పనులకు నిధుల కొరత ఏర్పడింది. సుమారు రూ.115కోట్ల నిధులతో చేపట్టిన 12 పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కేంద్రప్రభుత్వం స్మార్ట్ సిటీ పథకం గడువును డిసెంబరు చివరినాటికి పెంచడంతో రెండు నగరాల్లో సుమారు రూ.500కోట్ల విలువైన పనులకు మోక్షం లభించనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులతో గడువులోగా ఎన్ని పనులు పూర్తయితే అన్ని పూర్తి చేయాలని బల్దియా అధికారులు లక్ష్యంగా

(మిగతా 6లో..)

గడువులోగా దేవాదులను పూర్తి చేయాలి

- అన్ని అడ్డంకులను తొలగించి పెండింగ్ పనులను వేగవంతం చేయాలి
- ఉత్తర తెలంగాణలో 5.57లక్షల ఎకరాలకు సాగునీరు అందించటమే లక్ష్యం
- సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సచివాలయంలో దేవాదుల ప్రాజెక్టుపై సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

7



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ప్రజాస్వామ్యబద్ధంగా డీసీసీల ఏర్పాటు

- పార్టీ నాయకులు ఎవరైనా నామినేషన్ వేయొచ్చు..
- అందరినీ కలుపుకొని పోయే నాయకత్వం అవసరం
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): డీసీసీల నియమాకం ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. డీసీసీల నియమాకంపై హనుమకొండలోని వరంగల్ డీసీసీ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్‌తో పాటు మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, అబ్జర్వర్లు మక్సూద్, అనిల్, భాస్కర్, రేణుక పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆలోచనల మేరకే ముందుకు నడుస్తుందన్నారు. పార్టీలోని అన్ని స్థాయిల నాయకులను కలుపుకుని పోయే నాయకత్వం అవసరమని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించాలంటే మంచి నాయకత్వం ఉండాలని తెలిపారు. ఇప్పటికే హనుమకొండలో నాయిని రాజేందర్ రెడ్డి , వరంగల్‌లో ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో ప్రజలను, పార్టీ కార్యకర్తలను భాగస్వాములను చేస్తూ మంచి కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు ఆలోచన చేసుకుని నామినేషన్లు వేయాలనుకుంటే వేయవచ్చన్నారు. నామినేషన్లు వేసిన వారిలో

(మిగతా 6లో..)

ఇలాగైతే 'బెస్ట్' ఎలా!?

- బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు పేరుకుపోతున్న బకాయిలు
- బిల్లుల పెండింగ్‌తో విద్యార్థులను అనుమతించని యాజమాన్యాలు
- అధికారుల చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రదక్షిణలు

7



ఈవోల భర్తీకి కసరత్తు

దేవాదాయ శాఖలో త్వరలో భర్తీ కానున్న 190 పోస్టులు

ఉమ్మడి జిల్లాలో 25కిపైగా ఈవో పోస్టుల ఖాళీలు

కేబినెట్ ఆమోదం పొందడమే తరువాయి

హనుమకొండ, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖలో కార్య నిర్వహణ అధికారులు (ఈవో) పోస్టుల భర్తీకి కసరత్తు మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 190 పోస్టుల భర్తీకి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 25 ఈవో పోస్టుల ఖాళీలు భర్తీ కానున్నాయి. దీనితో ప్రస్తుతం ఉన్న ఈవోలపై పడుతున్న భారం తగ్గనున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖలో అడిషనల్ క్యాడర్ స్ట్రెంత్ మంజూరు లేక పరిపాలనాపరంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పర్యవేక్షణ లేక దేవాదాయ శాఖలో రూ.వేల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈవోల కొరత వల్ల ఒక్కో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో ఈవో 10 నుంచి 20 దేవాలయాల నిర్వహణ బాధ్యతలు చూడాల్సి వస్తోంది. ఈ మొత్తం 190 ఈవో పోస్టుల్లో 80 పోస్టులు (50శాతం) పదోన్నతుల ద్వారా, మిగిలిన 80 పోస్టులను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్) ద్వారా ప్రత్యక్ష విధానంలో భర్తీ చేస్తారు. దేవాదాయ శాఖలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా ఈవో పోస్టు భర్తీ జరుగుతుంది. సూపరింటెండెంట్‌లకు గ్రేడ్-1, సీనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-2, జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-3 ఈవోలుగా పదోన్నతులు కల్పిస్తారు. పదోన్నతుల ద్వారా భర్తీ ఈవో పోస్టుల్లో 13 వరకు ఉమ్మడి జిల్లాలో భర్తీ అవుతాయి. ప్రత్యక్ష నియామకం ద్వారా మిగతా 12 పోస్టుల నియామకం జరుగుతుంది.

కేబినెట్ ఆమోదమే తర్వాయి

ఇదే విషయాన్ని దేవాదాయశాఖ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది. గ్రేడ్-1, గ్రేడ్-2. గ్రేడ్-3 కార్యనిర్వహణ అధికారుల పోస్టుల భర్తీ విషయాన్ని ప్రధానంగా నివేదించింది. 190 పోస్టుల మంజూరుకి జేఏసీ ప్రతినిధులు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీకి విజ్ఞప్తి చేశారు. మంత్రి సురేఖ చొరవ మేరకు ఈ పోస్టుల భర్తీకి సీఎం కార్యాలయం, రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభించింది. ఈ వారంలో జరగనున్న మంత్రి మండలి సమావేశంలో దీనిని ముఖ్యమైన అంశంగా చేర్చి ఈ పోస్టుల మంజూరుకి తీర్మానం చేయించాలని తెలంగాణ రాష్ట్ర జేఏసీ మంత్రి సురేఖను అభ్యర్థించింది. మంగళవారం హనుమకొండలోని మంత్రి నివాసంలో తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ నేతృత్వంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బేతి రంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తక్కర్సు సత్యం, శ్యాం కుమార్, జైపాల్‌రెడ్డి, వెంకయ్య, ఓంప్రకాశ్‌లు వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు మంత్రి సురేఖ సానుకూలంగా స్పందించారు. గ్రేడ్ 1,2,3 ఈవో పోస్టుల ఆమోదానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వడి వడిగా సాగేనా!?

(5వ పేజీ తరువాయి)

పెట్టుకున్నారు. మరోసారి స్మార్ట్ సిటీ మిషన్ పథకాన్ని పొడిగించే అవకాశం లేదని, ఈ రెండున్నర నెలల్లో తమ వద్ద ఉన్న నిధులతో పనులు పూర్తి చేయనున్నట్లు బల్దియా అధికారులు పేర్కొంటున్నారు.

స్మార్ట్ సిటీస్ మిషన్ పథకానికి సకాలంలో నిధుల కేటాయింపులు లేకపోవటంతో నత్తనడకన పనులు సాగుతున్నాయి 2017లో ఈ పథకం కింద వరంగల్, కరీంనగర్ నగరాలు ఎంపిక కాగా, 2022లో పూర్తి చేయాల్సి ఉంది. అయితే రెండేళ్ల కరోనా ప్రభావం ఉండటంతో ప్రభుత్వం 2024 చివరినాటికి గడువు ఇచ్చింది. అయినప్పటికి పనులు పూర్తి కాకపోవటంతో 2025 మార్చి, జూలై 11వ తేదీ వరకు గడువు పెంచింది. అయితే టెండర్ల దశలో ఉన్న కొత్త పనులతో పాటు ఇప్పటికే ప్రారంభించిన పనులకు నిధులు కేటాయింపులు ఉండవని కేంద్రం పేర్కొంది. అయితే వరంగల్ ఎంపీ కడియం కావ్య గత ఆగస్టులో పార్లమెంట్‌లో ఇదే అంశంపై విజ్ఞప్తి చేయగా, డిసెంబరు చివరినాటికి గడువు పెంచింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన వాటా కింద ఇవ్వాల్సిన 50శాతం నిధులను విడుదల చేయటం జాప్యం చేసిందనే విమర్శలు ఉన్నాయి. దీంతో పనుల్లో జాప్యం జరుగుతూ వచ్చింది.

వీధిదీపాలు సక్రమంగా పని చేసేలా చూడాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఎలక్ట్రికల్ సిబ్బందితో సమీక్ష సమావేశం

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగరం మొత్తంగా 66 డివిజన్‌లలో ప్రతీకాలనీలో వీధి దీపాలు వెలిగేలా చూడాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను సూచించారు. మంగళవారం నక్కలగుట్టలోని సర్కిల్ కార్యాలయంలో ఎలక్ట్రికల్ అధికారులు, సిబ్బందితో వీధిదీపాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇటీవల అన్ని డివిజన్‌ల కార్పొరేటర్లు వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారని, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, డీసీ రవీందర్, ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈ కార్తీక్‌రెడ్డి, ఏఈలు సరిత, నరేష్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వీధిదీపాల పరిశీలన

నగరంలోని పలు కాలనీలలో వీధిదీపాలు వెలగడం లేదని కమిషనర్‌కు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదులు అందడంతో మంగళవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ పలు కాలనీలలో ఆకస్మికంగా సందర్శించారు. నగరంలోని 14, 15, 16 డివిజన్‌లలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిద్ధయ్య హోటల్, బాలాజీనగర్, 100 ఫీట్ల రోడ్డు, కీర్తినగర్, కట్టమల్లన్న చెరువు, వెంకట్రామ జంక్షన్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో వీధిదీపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గల్లీలోకి వెళ్లి పలు కాలనీల ప్రజల వద్దకు వెళ్లి వీధిదీపాలు వెలుగుతున్నాయా? లేదా అని కమిషనర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో సంబంధిత సిబ్బందిని మందలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ మాధవిలత, ఏఈలు సరిత, నరేష్, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.



వరంగల్ సిద్ధయ్య హోటల్ ప్రాంతంలో ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

● కష్టపడిన కార్యకర్తలకే పదవులు ● వరంగల్ ఎంపీ కావ్య

పరకాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని లలితా కన్వెన్షన్‌లో స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. ప్రజాక్షేత్రంలోకి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు పారదర్శకంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేస్తామన్నారు. పార్టీ కోసం నిజాయితీగా కష్టపడి పనిచేసిన అర్హులకు అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కులం, మతం, ధనం వంటి వాటితో సంబంధం లేకుండా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, పీసీసీ కో ఆర్డినేటర్ ఆదర్శ్ జైస్వాల్, దుర్గం భాస్కర్, మసూద్, రేణుక, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, పట్టణ, డివిజన్ సమన్వయ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిట్టీ డబ్బుల విషయంలో వివాదం జరిగి ఒక వ్యక్తి హత్యకు పాల్పడిన ఒకరికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన భూమ రాజు, ఆయన భార్య భూమ సిరిలు.. అచల చిట్ ఫండ్‌లో ఏజెంట్‌గా పని చేస్తున్న జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా చిట్యాల మండలం నైనపాక గ్రామానికి చెందిన గొడుగు అలియాస్ మండల గణేష్ ద్వారా చిట్టీలో చేరారు. రూ.10లక్షల చిట్టీలో చేరి చిట్టీ ఎత్తిన తర్వాత చిట్‌ఫండ్ డబ్బులు సంస్థ నుంచి సకాలంలో ఇవ్వలేదు. దీంతో ఏజెంటుగా చిట్టీ వేయించిన గణేష్‌పై రాజు, అతడి భార్య గొడుగు కావ్య డబ్బులు ఇవ్వాలని పలుమార్లు ఒత్తిడి చేసి చంపుతామని బెదించారు. తమకు సంబంధం లేదని, కంపెనీనే డబ్బులు ఇస్తుందని గణేష్ చెప్పినప్పటికీ రాజు, అతడి భార్య కావ్యలు వినకుండా గొడవ చేశారు.

ఈ క్రమంలో 2021 సెప్టెంబరు 3న మధ్యాహ్నం 3 గంటలకు రాజు తన షాపులో ఉండగా గణేష్, అతడి భార్య కావ్య ద్విచక్రవాహనంపై వచ్చి రాజు, అతడి భార్య సిరిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ సంఘటనలో సిరి తప్పించుకోగా భర్త రాజు తీవ్రంగా కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో పోలీసులు నిందితులపై హత్యానేరం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో రెండో నిందితుడిగా పేర్కొనబడిన గొడుగు గణేష్‌పై కేసు కొట్టివేశారు. మొదటి నిందితురాలైన గొడుగు కావ్యపై నేరం రుజువైనందున జీవిత ఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎం.సుభాష్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా సీఐలు వి.వేణుమాధవ్, ఎం.శివకుమార్ వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.రాము కేసు వాదించారు.

నిట్‌లో టెక్నోజియాన్-2025

● ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహణ ● ఆకట్టుకోనున్న సరికొత్త ఈవెంట్లు

హనుమకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 సంబరాలకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈనెల 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ సాంకేతికోత్సవానికి దేశంలోని దాదాపు అన్ని ఎన్ఐటీల నుంచి 7వేల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. పలు నవ ఆవిష్కరణలకు వేదికగా నిలువనున్న టెక్నోజియాన్ ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ సంవత్సరం టెక్నోజియాన్‌కు పలు ప్రత్యేకతలు ఉండనున్నాయి. సృజనాత్మకత, ఆవిష్కరణల హద్దులను ఈ సాంకేతికోత్సవం మరింత విస్తరించనున్నది. టెక్నోజియాన్‌లో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించే విజేతలయిన విద్యార్థులకు ఈ సారి రూ.2 లక్షల మేరకు బహుమతులను అందచేస్తారు. టెక్నోజియాన్‌లో భాగంగా నిర్వహించే వివిధ ఈవెంట్లు, సాంకేతిక ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. యువ మేధావులకు ప్రేరణగా, నవ ఆవిష్కరణలకు వేదికగా జరిగే టెక్నోజియాన్ విద్యార్థులకు చిరస్మరణీయంగా నిలుస్తుందని నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.

స్టోన్ ఏజ్ ప్రిజన్ బ్రేక్, ది ఐడియా ఆడిట్, ది స్వ్యాప్, వన్ నెంబర్ బగ్స్ గివెన్, సీఎస్ఈఎస్ ఆర్కేడ్, మ్యాథ్ రిలే రేస్, ట్రేకో హంట్ (టైమ్ ట్రావెల్ త్రో మ్యాథమెటిక్స్) మైండ్ డొమినోస్, బగ్ బస్టర్స్ పిక్స్ చాలెంజ్, ఏఐ మర్డర్ మిస్టరీ, లై డిటెక్టర్, చిప్ క్రాఫ్ట్, మెటారష్, మెటాడార్ట్, మెటల్యూజన్, గెస్సూర్ డ్రిఫ్ట్, డ్యాన్స్ ఓ వాట్ ఆప్టిమిస్ట్రీ ట్రాక్ ట్రూ ట్రైవా (ఎఫ్1 క్విజ్) ఆఫ్ ట్రాక్-ఆర్ కార్ షోడౌన్ నియాన్ క్రికెట్, కౌన్ బనేగా సివిల్ ఇంజనీర్, స్టార్ లైట్ స్పార్క్‌థాన్, మోడల్ మానియా, ఎర్త్‌క్వేక్ రెసిస్టెంట్ బిల్డింగ్ మోడల్ డిజైన్ కాంపిటేషన్ వంటి ఈవెంట్లు విద్యార్థులను సరికొత్త సాంకేతిక లోకంలో విహరింప చేయనున్నాయి.



టెక్నోజియాన్ పోస్టర్

పరిశోధన, అభివృద్ధితోనే సర్వతోముఖ వికాసం

● నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

హనుమకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిశోధన, అభివృద్ధి- ఈ రెండూ అవిభాజ్యమని, వీటితోనే సర్వతోముఖ వికాసం సాధ్యమవుతుందని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. మంగళవారం నిట్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'స్మార్ట్ సిస్టమ్ డెవలప్‌మెంట్ కోసం నెక్స్ట్-జెన్ కంప్యూటింగ్ ఆప్టిమైజేషన్' అనేక అంశంపై ఆరు రోజుల ఆన్‌లైన్ ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ (ఏటీఎల్) ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) ప్రారంభమైంది. పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) డీన్ ప్రొఫెసర్ శిరీష్ హరి సోనవాణే, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ రష్మీ రంజన్‌రౌత్ పాల్గొని ఆధునిక కంప్యూటింగ్‌లో ఆప్టిమైజేషన్ సాంకేతికతల ప్రాముఖ్యతను వివరించారు. సీఎస్ఈ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ మంజుబాలా,ప్రొఫెసర్ సంజయ్ కుమార్ పాండా సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

ఉద్యోగాల కోసం దళారులను ఆశ్రయించొద్దు

నోటిఫికేషన్ ద్వారానే కోచ్‌ఫ్యాక్టరీలో నియామకాలు

ఆర్వీఎన్ఎల్ జీఎం ఆనంద్ చెక్కిళ్ల

కాజీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలకోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దు, కేవలం రైల్వే పోటీ పరీక్షల ద్వారానే ఉద్యోగాలు లభిస్తాయని రైల్ వికాస్ నిగాం (ఆర్‌వీఎన్ఎల్) లిమిటెడ్ జీఎం ఆనంద్ చక్కిళ్ల తెలిపారు. మంగళవారం తెలంగాణ రైల్వే జేఏసీ బృందం సికింద్రాబాద్‌లో ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాల పేర కొందరు దళారులు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆనంద్ దృష్టికి రైల్వే జేఏసీ నాయకులు తీసుకెళ్లారు. దళారులను అరికట్టాలనే విషయాలపై ఓ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ చక్కిళ్ల జేఏసీ నాయకులతో మాట్లాడారు. కోచ్ ఫ్యాక్టరీ ఎదుట రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో ఒక నోటీస్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగాల పేర ఎవరికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఆర్ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ జారీ చేసే ఉద్యోగ నోటిఫికేషన్ పోటీ పరీక్షల ద్వారానే ఉద్యోగాల భర్తీ ఉంటుందని అనే విషయాలతో బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్‌వీఎన్ఎల్ జీఎంను కలిసిన వారిలో టీ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కో- కన్వీనర్ జి. భాస్కర్, ఎం. రాజయ్య, వైస్ చైర్మన్ జిట్టా రాజలింగం, సామాజిక వేత్త శిరుమల్ల రమేశ్‌లు ఉన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న రైల్వే జేఏసీ నాయకులు

ఈ ఏడాదికి డిగ్రీ కోర్సులన్నింటికీ పాత ఫీజులే..

● కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడి

కేయూ క్యాంపస్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ నాన్ ప్రొఫెషనల్ కోర్సులకు 2024-25 ఏడాదికి ఉన్న ఫీజులనే 2025-26 ఏడాదికి కొనసాగుతాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కామన్ సర్వీస్, పరీక్షల ఫీజులను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు ఫీజుల విషయాన్ని తెలపాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఫీజుల పెంపుపై ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని సూచించారు.

పాఠశాలలో మత ప్రచారంపై ఫిర్యాదు

వర్ధన్నపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలో మత ప్రచారం చేస్తున్న పుస్కోస్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ వర్ధన్నపేట శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వర్ధన్నపేట ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా మత బోధనలు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లు అజయ్, కార్యకర్తలు అరుణ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

గిర్మాజీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన ప్రకారం.. సంగెం మండల కేంద్రానికి చెందిన గుండేటి భాస్కర్ (38) మేస్త్రీ పనిచేయడంతో పాటు గేదెల పాలు విక్రయించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం గేదెలకు పచ్చగడ్డి తెచ్చేందుకు వరంగల్-చింతల్‌పల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య మౌనిక, కూతురు, కుమారుడు, తల్లి యాకలక్ష్మి ఉన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవీందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భాస్కర్ (ఫైల్)

చేనేత వస్త్రాలను ప్రోత్సహించండి

జిల్లా జడ్జిలు నిర్మల గీతాంబ, పట్టాభి రామారావు

వరంగల్ లీగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమను నిలబెట్టడానికి ప్రోత్సాహన్ని అందించాలని వరంగల్, హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జిలు బీవీ నిర్మల గీతాంబ, డాక్టర్ కె. పట్టాభి రామారావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘం (టీజీఎస్‌సీవో) వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో చేనేత ఎగ్జిబిషన్ కం సేల్స్ కౌంటర్‌ను న్యాయమూర్తులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి నిర్మల గీతాంబ మాట్లాడుతూ.. మనమందరం చేనేత వస్త్రాలు ధరించి పరిశ్రమను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా స్వదేశీ పరిశ్రమకు బలం చేకూర్చినవారవుతామని, అదే విధంగా కార్మికులకు అండగా నిలవడానికి అవకాశం ఉంటుందని హనుమకొండ జిల్లా జడ్జి కె.పట్టాభి రామారావు అన్నారు. కోర్టు ఆవరణలో ఈ ఎగ్జిబిషన్ కౌంటర్ మంగళవారం నుంచి శుక్రవారం వరకు కొనసాగుతుందని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు, కక్షిదారులు ప్రోత్సహించి చేనేత కార్మికులకు అండగా నిలువాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మైదం జైపాల్, ప్రధాన కార్యదర్శి బి.రమాకాంత్, కోశాధికారి సిరుమల్ల అరుణ, మర్రి రాజు, సీనియర్ న్యాయవాదులు జీవన్‌గౌడ్, ఆనంద్‌మోహన్, కొండబత్తుల రమేష్‌బాబు, శామంతుల శ్రీనివాస్, చిర్ర సాంబశివరాజు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



చేనేత ఎగ్జిబిషన్ కం సేల్స్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు నిర్మల గీతాంబ, పట్టాభి రామారావు

ప్రజాస్వామ్యబద్ధంగా డీసీసీల ఏర్పాటు

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తలు, నాయకులు, ఎవరికి ఎక్కువగా మద్దతు తెలుపుతారో వారికి అవకాశం దక్కుతుందన్నారు.

ఏఐసీసీ పరిశీలకుడు నవ్‌జ్యోతి పట్నాయక్ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులే కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకువస్తారన్నారు. పార్టీని ప్రజలకు దగ్గరగా నిర్మాణం చేయాలనే ఉద్దేశ్యంతో మొదటగా జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకం చేపట్టామని తెలిపారు. జిల్లా కమిటీలను పునఃవ్యవస్థీకరించడంతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీలకు బాధ్యతలు, హక్కులు ఇవ్వబోతున్నామని తెలిపారు. పార్టీలో అధికారాన్ని కేంద్రం నుంచి గ్రామస్థాయి వరకు వికేంద్రీకరించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, మహిళలకు కొత్త నాయకత్వాన్ని అందించడం జరుగుతుందన్నారు.

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఈ రోజు ప్రతీ చిన్న విషయాన్ని కూడా ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాన్ని తెలుసుకుని తదనుగుణంగా ముందుకు పోతుందన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ డీసీసీల నియామకాల్లో గతంలో మాదిరిగా కాకుండా కొత్త సాంప్రదాయానికి నాంది పలికారని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడిగా పది నుంచి పదకొండు సంవత్సరాలుగా చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో డీసీసీ అధ్యక్షుల నియామకం పారదర్శకంగా, అభిప్రాయ సేకరణ ద్వారానే జరుగుతుందని తెలిపారు.

డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష పదవి అనేది గురుతరమైన బాధ్యత అని, పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వరద రాజేశ్వరరావు, మీసాల ప్రకాష్, నవీన్‌రాజ్, నరేంద్రకుమార్, పోశాల పద్మ, ఆయూబ్, బస్వరాజు శ్రీమాన్, దూపం సంపత్, గోరంటాల రాజు, లింగమూర్తి, జన్ను రవి, కొత్తపల్లి శ్రీనివాస్, గుండేటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

● రూ.1లక్ష 30వేల రికవరీ ● ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం

నర్సంపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఎం.డి. ఇమ్రాన్ ప్రధాన సూత్రధారి కాగా, మాదాసు భార్గవి, నవీన్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బత్తుల రాజేశ్వరి, అదే జిల్లా కొండయ్‌గూడెంనకు చెందిన కుంజా విజయతో కలిసి చోరీలు చేశారు. మహబూబాబాద్ పట్టణంలో రెండు దొంగతనాలతో పాటు ఖానాపురం మండలం బుధరావుపేటలో, సెప్టెంబర్‌లో నర్సంపేటలోని ఓ నగల షాపులో చోరీలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. దోచుకున్న సొమ్ములో కొంత వాడుకొని మరికొంత సొమ్మును ఆటో, ద్విచక్రవాహనం కొన్నట్లు పోలీసులు తెలిపారు. దొంగతనాల్లో రూ.2లక్షల విలువ చేసే బంగారంతో పాటు 4 లక్షల 30 వేలు విలువ చేసే 38 తులాల వెండిగా పోలీసులు నిర్ధారించారు. ఈ దోచుకున్న సొమ్ములో 2 లక్షల 70వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ.1 లక్ష 30 వేలను రికవరీ చేసినట్లు పోలీసులు స్పష్టం చేశారు. ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్

పాకాల పంట పొలాల్లో మొసళ్లు



కొత్తూరు శివారు పంటపొలాల్లో ప్రత్యక్షమైన మొసలి (ఫైల్)

మత్తడి పోసిన సమయంలో బయటకు వస్తున్న వైనం

- సరస్సులో ప్రస్తుతం 200కు పైగా మొసళ్లు ఉన్నాయంటున్న అటవీశాఖ
- పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్న రైతులు
- కనిపిస్తే సమాచారం ఇవ్వాలంటున్న అటవీశాఖఅధికారులు

ఖానాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాకాల సరస్సు మొసళ్లకు ఆవాస ప్రాంతం. సరస్సులో సేద తీరాల్సిన మొసళ్లు ఇటీవల పాకాల ఆయకట్టు పంటపొలాలు, పంట కాలువలు, వ్యవసాయ బావుల్లో ప్రత్యక్షమవుతుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల కోసం ప్రతినిత్యం రాత్రనక, పగలనక రైతులు పంట పొలాల్లోకి వెళుతుంటారు. పంటలకు సాగునీటిని అందించే క్రమంలో పంట కాలువల్లోకి సైతం దిగుతుంటారు. మొసళ్ల సంచారం ఎక్కువవడం మూలంగా ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

మత్తడి ప్రవాహంలో బయటికి..

కొన్నేళ్లుగా ప్రతి ఏటా పాకాల సరస్సు మత్తడి పోస్తున్నది. వర్షాకాలం భారీ వర్షాలకు సరస్సు ఉధృతంగా మత్తడి పోస్తున్న సందర్భంలో నీటి ప్రవాహానికి ఎదురుగా వెళ్లలేని మొసళ్లు మత్తడి గుండా బయటికి వెళుతున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. అదేవిధంగా పాకాల సంగెం, తుంగబంధం తూముల ద్వారా అరుదుగా మొసలి పిల్లలు బయటికి వెళుతున్నట్లు చెబుతున్నారు. మత్తడి నీటి ప్రవాహం గుండా తూముల ద్వారా బయటికి వచ్చిన మొసళ్లు ప్రధానంగా పాకాల వాగు, తుంగబంధం, సంగెం పంట కాలువల్లో సేద తీరుతుంటాయి.

పంట కాలువల్లో నీటి ప్రవాహం తగ్గినప్పుడు కాలువల వెంబడి అనుసంధానంగా ఉన్నటువ్యవసాయ బావులలోకి వెళుతుంటాయి. ఇదే సమయంలో కొన్ని సందర్భాలలో పంటచేలలో ప్రత్యక్షమవుతున్నాయని అటవీ అధికారులు తెలుపుతున్నారు. పంట పొలాల్లోకి వచ్చే మొసళ్లతోనే రైతులు ఎక్కువగా భయాందోళనకు గురవుతున్నారని, పంట కాలువల్లో నీటి ప్రవాహం తగ్గిన సమయంలో కాలువల వెంబడి పొలాలు ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు.



పంటపొలాల్లో కనిపించిన మొసలిని బంధించిన రెస్క్యూ టీం (ఫైల్)

రెస్క్యూ టీం ఏర్పాటు

పాకాల సరస్సు గుండా బయటికి వచ్చిన మొసళ్లనే కాకుండా నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా ఎక్కడ మొసళ్లు కనిపించినా పట్టుకుని పాకాల సరస్సులో వదిలివేయడానికి నర్సంపేట అటవీశాఖ ఆధ్వర్యంలో బేస్‌క్యాంప్‌కు చెందిన ఐదుగురు సభ్యులతో రెస్క్యూ టీంను ఏర్పాటు చేశారు. గత సంవత్సర కాలంలో ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట మండలాల పరిధిలో 13 మొసళ్లను బంధించి పట్టుకుని సరస్సులో వదిలివేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.

200కు పైగా మొసళ్లు

గత సంవత్సరం పాకాల సరస్సులోని మొసళ్ల సంఖ్యను నిర్ధారించి జియోట్యాగింగ్ చేసేందుకు అటవీశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. సరస్సులో 200కు పైగా మొసళ్లు ఉన్నాయని, అందులో 60 నుంచి 70 మొసళ్లు గుడ్లు పెట్టి సంతానం పెంచేవిగా ఉన్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. అదేవిధంగా సరస్సులో మొసళ్ల సంఖ్య ఏటా 20 వరకు పెరుగుతున్నాయని, కానీ, అదే సంఖ్యలో సరస్సు నుంచి బయటికి సైతం వెళుతున్నట్లు అధికారులు గుర్తించారు. బయటికి వచ్చిన మొసళ్లు పంట కాలువలు, పొలాలు, వ్యవసాయ బావులలో ప్రత్యక్షమవుతున్నాయి.

మొసళ్లను చంపొద్దు



పంట పొలాల్లో, పంట కాలువల్లో, వ్యవసాయ బావుల్లో మొసళ్లు కనిపిస్తే చంపకూడదు అటవీ అధికారులకు సమాచారం అందిస్తే గంట వ్యవధిలోనే రెస్క్యూ టీం సభ్యులు వెళ్లి పట్టుకుని పాకాల సరస్సులో వదిలివేస్తారు. భవిష్యత్‌లో సరస్సు నుంచి మొసళ్లు బయటికి రాకుండా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటివరకు పంట పొలాల్లో కనిపించే మొసళ్లతో ప్రాణహాని జరగలేదు. అయినప్పటికీ పంట కాలువల్లో నీరు తగ్గినప్పుడు సమీప పొలాల రైతులు అప్రమత్తంగా ఉండాలి.

- రవికిరణ్, ఎఫ్ఆర్వో నర్సంపేట

మొసళ్లను పట్టుకోవడం రిస్కే.



మొసళ్లను బంధించడం చాలా రిస్క్‌తో కూడున్నది. అయినప్పటికీ చాలా జాగ్రత్తగా రక్షణ చర్యలు తీసుకుంటూ వాటిని పట్టుకుంటాం. 25 కిలోల లోపు ఉన్న మొసళ్లతో ఇబ్బంది పెద్దగా ఉండదు. 70, 80 కిలోలు ఉన్న మొసళ్లను బంధించాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుంది. సంవత్సరం నుంచి 13 మొసళ్లను పట్టుకుని పాకాల సరస్సులో వదిలాం.

- నాగరాజు (బేస్‌క్యాంప్ పాకాల) రెస్క్యూ టీం సభ్యుడు



జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

ఇలాగైతే 'బెస్ట్' ఎలా!?

- బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు పేరుకుపోతున్న బకాయిలు
- బిల్లుల పెండింగ్‌తో విద్యార్థులను అనుమతించని యాజమాన్యాలు
- అధికారుల చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రదక్షిణలు
- నిర్వహణ కష్టంగా మారిందంటున్న యాజమాన్యాలు

జనగామ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పెండింగ్ ఫీజు బకాయిల సమస్య విద్యార్థులకు శాపంగా మారింది. ప్రభుత్వం నుంచి మూడునాలుగేళ్లుగా బిల్లులు రాకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బకాయిని సాకుగా చూపుతూ పాఠశాలల యాజమాన్యాలు కొన్ని చోట్ల విద్యార్థులను స్కూళ్లకు అనుమతించడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టరేట్‌ల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పలు జిల్లాల్లో కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. నెల రోజులుగా తల్లిదండ్రులు ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు.

32 వేల మంది విద్యార్థులు

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 227 స్కూళ్లలో సుమారు 32 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ ఎస్టీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో బెస్ట్ అవైలబుల్ స్కూల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో బ్రైట్ బాయ్స్ స్కీమ్ కింద ఉన్న ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద మార్చారు. ఈ స్కీమ్ కింద ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ కింద ఎంపికైన స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తారు. సీట్ల ఖాళీల కంటే ఎక్కువ ఉంటే డ్రా పద్ధతిన సీట్లను భర్తీ చేస్తారు. ఎంపికైన స్కూల్‌లో మొదటి తరగతిలో 20 సీట్ల చొప్పున కేటాయిస్తారు. అలా పదవ తరగతి వరకు 20 సీట్ల చొప్పున కేటాయింపులు ఉంటాయి. ఒక్కో విద్యార్థికి డే స్కాలర్‌కు రూ. 28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.42వేల చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 227 స్కూళ్లలో దాదాపు 32వేల మంది ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు.

అనుమతించని యాజమాన్యాలు

పెండింగ్ బిల్లులను సాకుగా చూపుతూ విద్యార్థులను స్కూళ్ల యాజమాన్యాలు అనుమతించడం లేదు. కొన్ని స్కూళ్ల మేనేజ్‌మెంట్లు విద్యార్థులను పాఠశాలలకు రావొద్దంటూ తెగేసి చెబుతున్నారు. తోటి విద్యార్థుల ముందే తమను పాఠశాలకు రావొద్దని చెబుతుండడంతో పిల్లలు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల రెసిడెన్షియల్ యాజమాన్యాలు తాము హాస్టల్, భోజనం, వసతి కల్పించలేమని, కావాలంటే చదువు మాత్రం చెబుతామంటూ తెగేసి చెబుతున్నారు. మూడు, నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి రాకున్నా భోజనం, వసతి కల్పించామని, ఇక తమ వల్ల కాదని అంటున్నాయి. దీంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. పిల్లలను అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు చేసేదేమీ లేక ఆందోళనలకు దిగుతున్నారు. కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేసి అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ పెండింగ్ బకాయిలు విడుదల చేసి తమ పిల్లల చదువులకు మార్గం సుగమం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ. 180 కోట్ల బకాయిలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు సుమారు రూ.180 కోట్ల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. బీఆర్ఎస్ హయాంలో రెండేళ్ల బకాయిలు పెండింగ్ ఉండగా కాంగ్రెస్ వచ్చిన తర్వాత రెండేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కొన్ని స్కూళ్లకు నాలుగేళ్ల బకాయిలు ఉండగా కొన్ని స్కూళ్లకుమూడేళ్లుగా బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు.పెండింగ్ బిల్లులకు సంబంధించి టోకెన్ జారీ చేసినప్పటికీ బిల్లులను మాత్రం ప్రభుత్వం రిలీజ్ చేయడం లేదని యాజమాన్యాలు అంటున్నాయి. కేవలం రూ.180కోట్ల పెండింగ్ బిల్లులను రిలీజ్ చేయకపోవడంతో ఇటు తమకు, అటు విద్యార్థులకూ నష్టం కలుగుతోందని అంటున్నారు. పెండింగ్ ఉండడం వల్ల పాఠశాలల నిర్వహణ తమకు భారంగా మారుతోందని అంటున్నారు.



ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన ఎడ్లబండిలో కూలీలను తీసుకెళ్తున్న రైతు చెవ్వల్ల రాజు

ఎద్దులు పోయి ఇంజన్ వచ్చే..

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పై చిత్రాన్ని చూడండి.. ఎడ్లు తీసుకెళ్లాల్సిన బండిని ట్రాక్టర్ లాగుతోందని అనుకుంటున్నారా! అవును ట్రాక్టర్‌కు ట్రాలీ డబ్బాను కాకుండా పాత ఎడ్ల బండిని అనుసంధానం చేసి ప్రయాణిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు ఓ రైతు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన రైతు చెవ్వల్ల రాజు ఈ ఐడియాను సృష్టించాడు. మంగళవారం గ్రామంలో వ్యవసాయ బావి వద్దకు కూలీలను తీసుకెళ్తుండగా ఈ చిత్రం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. రాజుకు ఐదెకరాల భూమి ఉండగా, మరో నాలుగెకరాలు కౌలుకు చేస్తున్నాడు. భార్య, ముగ్గురు పిల్లలతో పాటు అప్పుడప్పుడు కూలీలను తీసుకెళ్లేందుకు దీనిని ఉపయోగిస్తున్నాడు. ఆటోలో కూలీలను తరలించడానికి ఖర్చు ఎక్కువగా ఖర్చు అవుతున్నట్లు చెప్పాడు.





చిర్ర కిరణ్

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో బోరు బావి నుంచి పైకి వస్తున్న నీరు

ఉబికి వస్తున్న గంగమ్మ

15 ఏండ్ల క్రితం వేసిన బోరు నుంచి నీరు పైకి

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : 200 ఫీట్ల లోతు వరకు వేసిన బోరు బావి, వేసిన 15 ఏళ్లలో ఏనాడు సరిగా పోయని నీరు, రెండు రోజుల నుంచి బోరు బావి నుంచి గంగమ్మ ఉబికి వస్తోంది. దీంతో ఆ రైతు ఆశ్చర్య పోయాడు. ఆగి పోసే బోరు నుంచి ఏకంగా పైకి నీరు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో చోటు చేసుకుంది. కట్ర్యాల గ్రామానికి చెందిన రైతు చిర్ర కిరణ్ ఎకరం పొలం ఎస్సారెస్పీ కాలువ కింది భాగంలో ఉంది. వ్యవసాయం చేస్తూ ఆటో నడుపుతూ కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. తన పొలంలో దాదాపు 15సంవత్సరాల క్రితం సుమారు 200ఫీట్ల వరకు తవ్వించాడు. ఆనాటి నుంచి రెండు రోజుల క్రితం వరకు బోరు బావిలో నుంచి నీరు ఆగుతూ పోస్తూ ఉండేది. పక్కనే చిన్న కుంట సైతం ఉంది. అయినా ఆగే పోసేది. ఎకరం పొలం మాత్రమే కావడంతో ఉన్నదాంట్లో నీటిని సరిపెట్టుకున్నాడు.విచిత్రంగాఒక్కసారిగా నీరు ఏకంగా పైకి తన్నుకు వచ్చి ఉబికి పోస్తోంది.దీంతో రైతుఆనందంవ్యక్తం చేస్తున్నాడు.

గడువులోగా దేవాదులను పూర్తి చేయాలి

- అన్ని అడ్డంకులను తొలిగించి పెండింగ్ పనులను వేగవంతం చేయాలి
- భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వరంగల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిర్దేశిత గడువులోగా దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని దేవాదుల ప్రాజెక్టు పురోగతిపై రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు అన్ని విధానపరమైన అడ్డంకులు తొలగించాలని, పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఉత్తర తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలలోని ప్రతీరైతుకు సాగునీటి ప్రయోజనాలు చేరేలా చూడాలని ఆదేశించారు. ములుగు జిల్లా గంగారం గ్రామం సమీపంలోని గోదావరి నది నుంచి 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేయడానికి దేవాదుల పథకం రూపొందిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా హనుమకొండ, వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిదిపేట జిల్లాల ఎగువకు 5.57లక్షల ఎకరాలకు సాగును అందించటమే లక్ష్యమన్నారు. మొత్తం నీటి పారుదల సామర్థ్యం 5.57 లక్షల ఎకరాలలో 3.17 లక్షల ఎకరాలకు ప్రస్తుతం సాగునీరు అందిస్తుందన్నారు. భూగర్భ జలాల ద్వారా సాగునీరు అందించి 58,028 ఎకరాలతో కలిపితే దేవాదుల మొత్తం సామర్థ్యం 6.14లక్షల ఎకరాలకు చేరుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. దేవాదులకు రూ.14,269.63కోట్లు ఖర్చు దేవాదుల ప్రాజెక్టుకు సవరించిన అంచనాల ప్రకారం రూ. 18,500కోట్లు కాగా, ఇప్పటివరకు ప్రాజెక్టు కోసం రూ.14,269.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.4230 కోట్లు అవసరంగా గుర్తించామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఖర్చు చేసిన మొత్తంలో సివిల్ పనులకు రూ.11,667.85 కోట్లు, భూసేకరణకు రూ.1,343.06 కోట్లు, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రో-మెకానికల్ ఇన్‌స్టాలేషన్‌లకు రూ.1,170.63కోట్లు ఖర్చు చేశామని వివరించారు. దేవాదుల ప్రాజెక్టు, దాని అనుసంధాన కాలువల కింద ఉన్న ఆయకట్టుకు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలోని అనేక నియోజకవర్గాలలో విస్తరించి ఉందని అధికారులకు వివరించారు. మొత్తం 2,430.82 కిలోమీటర్ల కాలువలు తవ్వాల్సి ఉండగా, 1,663.10కి.మీ. తవ్వకాలు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే 702.62కి.మీ. పైపులైన్లకు గాను, ఇప్పటివరకు 669.66కిలో మీటర్ల మేర పూర్తి చేశామని, కాలువ లైనింగ్ కూడా 799.80కి.మీ పూర్తి చేశామని తెలిపారు. జనగామ జిల్లాలో రఘునాథపల్లి, ఆర్ఎస్ ఘన్‌పూర్ విభాగాలలోని 51,000 ఎకరాలతో సహా దాదాపు 88,000 ఎకరాలకు సాగు నీరు అందించనున్నామన్నారు. గండిరామారం కుడి ప్రధాన కాలువ మాత్ర మే తాటికొండ కొత్తపల్లి, మీదికొండ, రాఘవపూర్, చాగల్, అశ్వారావుపల్లి, గోవర్ధనగిరి వంటి ఏడు గ్రామాల్లోని దాదాపు 5,600 ఎకరాలకు కవర్ చేస్తుందన్నారు.



సచివాలయంలో దేవాదుల ప్రాజెక్టుపై సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సీతక్క, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు

హనుమకొండ, వరంగల్‌లలో ఆయకట్టు సామర్థ్యం 1.1లక్షల ఎకరాలకు మించి ఉండగా.. ములుగు, భూపాలపల్లి విభాగాలు కలిపి 1.2లక్షల ఎకరాలకు పైగా ఉన్నాయని వివరించారు. మిగిలిన ఆయకట్టు సిద్ధిపేట, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని రైతాంగానికి సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.

ఇంకా 2,307 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కేఆర్.నాగ రాజు, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రధానకార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సకల ఏర్పాట్లు

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- పోటీ పడనున్న 936 మంది అథ్లెట్లు: సారంగపాణి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలను జిల్లా అధికార యంత్రాంగం, వివిధ క్రీడాసంఘాల బాధ్యుల సమన్వయంతో విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హనుమకొండలోని జేఎన్ క్రీడా మైదానాన్ని మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్, డీఎస్ఏ అధికారులు, క్రీడా పోటీల నిర్వాహకులతో కలిసి సందర్శించి క్రీడా పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో నిర్వహించనున్న అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లను చేయాలని నిర్వాహకులకు, అధికారులకు సూచించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. అథ్లెటిక్స్ పోటీల్లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పలు అకాడమీలు, పలు యూనిట్స్ నుంచి 936మంది అథ్లెట్లు, 150 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధనల మేరకు 52 ఈవెంట్లలో అథ్లెట్లు తమ ప్రతిభను నిరుపించుకోనున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే అథ్లెట్ల, సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాడానిక ఏఎఫ్ఐ నిపుణుల బృందం బుధవారం జేఎన్ స్టేడియానికి రానున్నారని సారంగపాణి తెలిపారు. వరల్డ్ అథ్లెటిక్స్ నిబంధనల మేరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొని అథ్లెట్లకు డోపింగ్ పరీక్షలతో పాటు టైమింగ్ స్కోరింగ్ రిజల్ట్ (టీఎస్ఆర్), ప్రపంచ వ్యాప్తంగా క్రీడా పోటీలు వరల్డ్ లైవ్ టెలికాస్ట్ చేయబడుతుందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న రన్స్, త్రోస్, జంప్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్స్) పోటీలు ఉదయం 6నుంచి 10: 30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5:30గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, జీడబ్ల్యూఎం సీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, ఎంజీఎం ఆర్ఎంవో ముదిలి వసంతరావు, జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ సానిటరి సూపర్‌వైజర్ బేర నరేందర్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.




జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

21న దీపావళి నోములు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరమపవిత్రమైన గౌరీ కేదారీశ్వరనోములను ఈనెల 21న మంగళవారం రోజున ఆచ రించుకోవాలని భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ..ఈ నెల 20న నరక చతుర్ధశి సందర్భంగా సూర్యోదయానికి ముందే స్నానాలు ఆచరించి హారతులు తీసుకోవాలని అన్నారు. ఆ రోజున పవిత్రమైన గంగాజలం ప్రతీ నీటి చుక్కలో చేరుతుందని, తైలంలో లక్ష్మీదేవి చేరుతుందని, సూర్యోదయానికి ముందు తైలం రాసుకొని స్నానమాచరిస్తే గంగా లక్ష్మీదేవిల అనుగ్రహం కలుగుతుందని అన్నారు. ఈనెల 20న సూర్యోదయానికి ముందు, సూర్యోదయం తర్వాత హారతులు తీసుకోవచ్చన్నారు. 21న కేదారీశ్వర వ్రతాలు ఆచరించుకోవాలని బుధవారం రోజున నోములు కదిలించుకోవాలని అన్నారు. స్వాతి నక్షత్రం లేనందున ఈసారి కొత్త నోములు లేవని, కుటుంబంలో ఎవరైనా కాలం చేసి నోములు ఆగిన వారు స్వాతి నక్షత్రంతో సంబంధం లేకుండా నోముకోవచ్చని వివరించారు.

ఈనెల 22నుంచి శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం ప్రారంభమవుతుందని తెలిపారు. కాగా, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని 21న భద్రకాళి అమ్మవారికి ధనలక్ష్మీ పూజ చేసి నాణేలతో ధనార్చన జరిపి మంగళహారతులు దీపారాధనలు నిర్వహిస్తామని తెలిపారు. పూజ అనంతరం ధనార్చన చేసిన నాణేలను భక్తులకు ప్రసాదంగా ఇస్తామని శేషు వివరించారు.



పెంచిన ఫీజులపై కేయూలో విద్యార్థుల దర్నా



కేయూలో బైఠాయించిన దర్నా చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేయూలో డిగ్రీ కోర్సుల విద్యార్థులకు పెంచిన ఫీజులను తగ్గించాలని బుధవారం కేయూ పరిపాలన భవనం ఎదుట డీఎస్‌ఏ నేతృత్వంలో విద్యార్థులు నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ మాట్లాడుతూ.. డిగ్రీ మొదటి విద్యార్థులపై అధిక ఫీజులను మోపారని అన్నారు. పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేరని అన్నారు. ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డీఎస్‌యూ నేతలు సంజయ్, జాషువా, రాజ్‌కుమార్, శశిధర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్

బీఐఎస్ కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలి

బాలసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సీనియర్ సెక్రటరీ పల్లెపాడు దామోదర్ అన్నారు. అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా జిల్లా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని రాంనగర్‌లో ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల్లో అవగాహన పెంపొందించడం కోసం మూడు ముఖ్యమైన సంస్థలైన ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) ఇంటర్నేషనల్ ఎలక్ట్రోకమిషన్ (ఐఈసీ) ఇంటర్నేషనల్ టెలీ కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) సంస్థల శాస్త్రజ్ఞులు జరిపే పరిశోధనలను గౌరవించుకోవడం కోసం ప్రమాణాల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2030 నాటికి భారత దేశంలో కూడా ఐఎస్ఐ, బీఐఎస్ సంస్థలు విశేషంగా ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్, బంగారు, వెండి నగల నాణ్యతా ప్రమాణాలు హాల్ మార్క్, సీఎస్ఆర్ గుర్తులతో ప్రమాణాలను రూపొందించడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు కవిరాజ్, ఇందిరా, జ్యోత్స్న, మంజుల, ఫిలిప్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పాటుపడాలి

రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ శ్రీదేవసేన

కేయూ క్యాంపస్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు అధ్యాపకులందరూ పాటుపడాలని రాష్ట్ర ఉన్నత విద్యా కమిషన ర్ శ్రీదేవసేన అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సాంకే తిక విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.కొమురారెడ్డి రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సురేందర్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెస ర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ జె.చిన్నా, డి.రామకృష్ణారెడ్డి, డాక్టర్ సత్యనారాయణరెడ్డిలు పాల్గొన్నారు. కాగా, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ, ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్‌రాజయ్యలు ప్రొఫెసర్ కొమురారెడ్డిని అభినందించారు.

ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్‌గా వేణుగోపాల్‌గౌడ్

రాంనగర్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ జేఏసీ చైర్మన్‌గా హనుమకొండకు చెందిన వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ వెల్లడించారు. ఈసందర్భంగా వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ..బీసీలందరి నీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చి 42శాతం రిజర్వేషన్ సాధించేంతవరకు విరమించేది లేదన్నారు. తన నియామకానికి కృషిచేసిన బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వి.నారగోని, కో-చైర్మన్లు రాజారామ్ యాదవ్, దాసు సురేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుబైరిరవికృష్ణ గౌడ్‌కు వేణుగోపాల్‌గౌడ్‌కృతజ్ఞతలు తెలిపారు.

వంగపహాడ్‌లో విద్యుదాఘాతంతో కూలీ మృతి

యజమాని ఇంటిఎదుట బంధువుల ఆందోళన

హసన్‌పర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన ఘటన సోమవారం గ్రేటర్ 1వ డివిజన్ పరిధి వంగపహాడ్‌లో చోటు చేసుకుంది తెలిసిందే. కాగా, మృతి విషయం తెలిసిన హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు, ఎస్సైలు దేవేందర్, శీలం రవి పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. అయితే మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు భూయజమాని సముద్రాల సాంబయ్య ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. మంగళవారం సాయంత్రం వరకు కూడా సమస్య కొలిక్కిరాకపోవడంతో ఊరి పెద్దమనుషులు ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనను కొనసాగించారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు భీష్మించుకు కూర్చున్నారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేసి శాంతి భద్రతలను అదుపు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. ఇప్పటి వరకు మృతుడి కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో బిందు మాధవికి పతకం

మడికొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్ఎస్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో మడికొండ పీఎం ఎస్‌హెచ్ఆర్ఐ జడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని బిందు మాధవి ఉత్తమ ప్రతిభ కనబర్చి రజిత పతకాన్ని సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి తెలిపారు. బాక్సింగ్ క్రీడలో రాణించడంతోపాటు పాఠశాలకు మంచిపేరు తీసుకొస్తున్న బిందు మాధవిని హెచ్ఎం సంధ్యారాణితోపాటు ఉపాధ్యాయులు అభినందించి , జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

రాంనగర్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆన్‌మ్యాన్డ్ కార్మికుడు గట్ల కరుణాకర్ భార్య ప్రియాంకకు సీఎండీ వరుణ్‌రెడ్డి మంగళవారం కార్పొరేట్ కార్యాలయంలో రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. జూలై 3న మహబూబాబాద్ సర్కిల్‌లోని ఈదులపూసపల్లి గ్రామంలో విధి నిర్వహణలో ఉన్న సమయంలో కురుణాకర్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ క్రమంలో మరణించిన కరుణాకర్ కుటుంబసభ్యులకు బీమా కంపెనీ ద్వారా వచ్చిన పరిహారాన్ని సీఎండీ అందజేయగా, కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి, న్యూఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ హనుమకొండ డివిజనల్ మేనేజర్ నాగభట్ల జ్యోతిర్మయి, మార్కెటింగ్ మేనేజర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బాలసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళలు సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. మంగళవారం హనుమకొండలోని సఖి కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సఖి కేంద్రం ద్వారా లింగాధారిత హింసకు గురైన బాధిత మహిళలకు సఖి కేంద్రం అందిస్తున్న ఐదు రకాల సేవలైన కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పోలీసు సహాయం, వైద్య సహాయం, తాత్కాలిక వసతులను బాధిత మహిళలు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి మాట్లాడుతూ.. 13 మంది సిబ్బందితో సఖి కేంద్రం 24 గంటల పాటు సేవలందించేందుకు అందుబాటులో ఉంటుందని అన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్ చీఫ్ పంక్షనరీ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ.. హింసకు గురైన మహిళలు, బాలికలకు అవసరమైన సేవలన్నింటిని ఒకే చోట అందిస్తుందని తెలిపారు. బాధిత మహిళలు అత్యవసర పరిస్థితుల్లో మహిళా హెల్ప్‌లైన్ 181, 0870-2452112 లేదా సెల్‌నంబర్ : 73829 73088 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ అడ్మిన్ హైమావతి, కౌన్సిలర్లు పావని, శ్రీదేవి, సఖి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలి

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- పోతననగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిశీలన



పోతననగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను సూచించారు. వరంగల్ పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను మేయర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో ప్లాంటేషన్ కోసం వదిలి వేసిన స్థలంలో మొక్కలు నాటాలని అన్నారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో లీచెట్ అనేది నిలువకుండా డ్రైన్‌ల ద్వారా వెళ్లే విధంగా స్టోర్ పాయింట్లు సిద్ధం చేయాలన్నారు. ఇండోర్ మాదిరిగా ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లు నిత్యం శుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆటోల ద్వారా వచ్చే చెత్తను ఉప్పటికప్పుడు డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో వాటర్ సర్వీసింగ్ పాయింట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో పనిచేసే సిబ్బంది తప్పకుండా మాస్కులు, గ్లౌజులు తప్పకుండా వాడాలన్నారు. ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్‌వో రమేష్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు మహేందర్, రవికుమార్, డీఈలు రాజ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీను, ఏఈలు నరేష్, సంతోష్ కుమార్‌లు పాల్గొన్నారు.

మద్యం టెండర్లలో వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్14 (ఆంధ్రజ్యోతి): ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మద్యం టెండర్లలో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఎలా అయితే ఇచ్చారో దివ్యాంగులకు కూడా అవకాశం ఇవ్వాలని దివ్యాంగుల సామాజిక వేదిక అధ్యక్షుడు బిల్ల మహేందర్, కాయిత ఇంద్రాసేనారెడ్డిలు మంగళవారం ఒక తెలిపారు. మద్యం షాపుల టెండర్లకు దరఖాస్తుల సమర్పరణకుఈ నెల 18వ తేదీన చివరి రోజు ప్రకటించిన ప్రభుత్వం..ఈ చివరి తేదీని మరికొన్ని రోజులు పొడిగించి దివ్యాంగులకు ప్రత్యేక షాపులు కేటాయించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

వీసీని కలిసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్యవర్గం

కేయూ క్యాంపస్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోషియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన అసోషియేషన్ బాధ్యులు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను వర్సిటీలో మర్యాద పూర్వకంగా కలిశారు. వీరితోపాటు క్యాంపస్‌కళా శాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ జె.సోమన్న, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సునీల్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.కుమారస్వామి, బి.రమేశ్, సహాయ కార్యదర్శులు మట్టెడ కుమార్, కె.మధుకర్, కార్యవర్గ సభ్యులు అంబాల రాజేశ్, వై.సుమన్, ఎం.డి. అఫ్జల్, పి.కిషన్, ఎల్.వెంగళ్‌రావు, ఎ.రాజు, బి.వెన్నెలబాయ్, డి.అరుణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆదివారం జరిగిన కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోషియేషన్ ఎన్నికల్లో సోమన్న అధ్యక్షులుగా ఎంపికయ్యారు.

స్వధార్ ఆశ్రమాన్ని సందర్శించిన ఆర్‌డీవో



మహిళలతో మాట్లాడుతున్న ఆర్‌డీవో నారాయణ

బాలసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న టైలరింగ్, మగ్గం వర్క్ లాంటివి మహిళలు నేర్చుకొని ఉపాధి పొందాలని పరకాల ఆర్‌డీవో నారాయణ ఉద్బోధించారు. మంగళవారం ఆయన హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని స్వధార్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆయన వెంట అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, స్వధార్ కమిటీ మెంబర్ డాక్టర్ కె.అనితారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి జయంతి సందర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు ఆశ్రమంలో మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వంట శాలను మహిళలకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో వెంకట్రావు, పావని, శైలజ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అయిలయ్య పుస్తకం ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేయూ సోషియాలజీ విభాగం అధ్యాపకుడు కుంట అయిలయ్య రూపొందించిన ఇండస్ట్రియల్ సోషియాలజీ పుస్తకాన్ని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు బుధవారం ఆవిష్కరించారు. కేయూ వీసీ చాం బర్‌లో జరిగిన కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లిమనోహర్, అకూట్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.స్వర్ణలత, స్కాలర్స్ డాక్టర్ చంద్రమౌళి, రవి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 40 మంది వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ నలుగురికి జైలు శిక్ష విధించగా, మిగతా 36 మందికి రూ.46,500 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని 10 మందిని కోర్టులో హాజరుపరచగా రూ.7,600 జరిమానా విధించామన్నారు.

పల్స్ పోలియో సంపూర్ణం

వరంగల్ మెడికల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలియో కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు 472 పోలియో కేంద్రాలలో, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మొబైల్ బృందాలతో పోలియో చుక్కలు అందించామని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. చుక్కల మందు వేయని వారికి మంగళవారం ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 83,410 ఉండగా, ప్రయాణంలో ఉన్నవారు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో కలిసి 84,654 పిల్లలకు చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్, మునిసిపల్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస ఉత్సవాలను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లి టీఎన్జీవోస్ కాలనీ ప్రాంతంలోని శ్రీనాగరాజ రాజేశ్వర స్వామి దేవాలయ సముదాయంలో ఈ నెల 22 నుంచి నవంబరు 21 వరకు నిర్వహించే కార్తీక మాస ఉత్సవాలను జయప్రదం చేయాలని శ్రీనాగరాజరాజేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కుందూరు అనిల్‌రెడ్డి, కార్యదర్శి ఇ . కొండల్ రావు, ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి జీవన్‌శర్మ కోరారు. మంగళవారం దేవాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వేదాన్ని మించిన శాస్త్రం, కృతయుగాని కన్నా గొప్పయుగం , గంగానదిని మించిన పవిత్ర తీర్థం, కార్తీక మాసానికన్నా పుణ్య మాసం వేరొకటి ఈ సృష్టిలో లేదని అన్నారు. ఇందులో భాగంగా నెల రోజుల పాటు పవిత్ర కార్తీక మాసంలో నిర్వహించే ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. తొలుత ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో ఆలయ కోశాధికారి పి. విద్యాసాగర్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎన్. సురేందర్, సారయ్య, బక్కి సదానంద రావు, ఆర్ఎల్‌వీ సాయి ప్రసాద్, వైకుంఠం, వరప్రసాద్, వీర రమేష్, పి. రవిచందర్, కె. రమేష్‌సత్యనారాయణ, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్14(ఆంధ్రజ్యోతి): ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన హనుమకొండ నక్కలగుట్టలోని మారుతీ టవర్స్‌లో అపార్ట్‌మెంట్ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి తెలిపారు. హనుమకొండలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రెంటాల కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి నడుముల విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని అపార్ట్‌మెంట్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు. ప్రస్తుత కమిటీ పదవీకాలం ముగియడంతో ఈ సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వాల కృపాకర్‌రావు, బొప్ప శివశంకర్, సారంగపాణి, జాయింట్ సెక్రెటరీ గుండ్ల శ్రీనివాస్, రాజ్‌కుమార్, అడ్వైజర్ జినుకల రాజేశ్వర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అంజనీదేవి, ఫైనాన్స్ సెక్రెటరీ స్వరూప, కార్యవర్గ సభ్యులు రంగంశెట్టి సత్యనారాయణ, కె.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీసీ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న చింతకింది రాజేశం తదితరులు

ఆర్ట్స్ కళాశాల బీకామ్ పూర్వవిద్యార్థుల వితరణ

కేయూ క్యాంపస్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత మంచినీటి ఫ్రిడ్జ్‌ను వితరణ చేశారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల 1979-82 బ్యాచ్ ఇంగ్లీష్ మీడియా బీకామ్ స్టూడెంట్స్ ప్రొఫెసర్ చింతికింది రాజేశం నేతృత్వంలో ఉచితంగా బహూకరించారు. ఈ కార్యక్ర మంలో సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, మోహన్ విఠోబ, రమణమూర్తి, రమేశ్, ఓంప్రకాశ్ లోహియా, వేద ప్రకాశ్, సుబ్రహ్మణ్యం, దయాసాగర్, అల్వార్ డేవిడ్ పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయంలో రూ.11.86 లక్షల హుండీ ఆదాయం

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రుద్రేశ్వరాలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకుడు ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ నాట్య మండపంలో మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. టికెట్స్ వివిధ రుసుముల ద్వారా రూ.6లక్షల 30వేలు, కేవలం హుండీ ద్వారా రూ.5లక్షల 56వేల 967 మొత్తం 11 లక్షల 86వేల 967 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో అనిల్‌కుమార్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఎన్.మధుకర్, ఎల్.రామకృష్ణ, బి.రజిత తదితర ఆలయ సిబ్బంది, రాజేశ్వర సేవాసమితి మహిళా సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

అంతర్ కళాశాల పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల ఆటల పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. మంగళవారం కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె అధ్యాపక బృందంతో కలిసి అభినందించారు. కోకో, సాఫ్ట్‌బాల్ పోటీల్లో కళాశాల జట్లు రెండవ స్థానం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, పీడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు

సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరిజ్యోతి అభి నందనలు తెలిపారు. క్యాడెట్లు ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంపులో 3నెలల క్యాంపును విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. విమాన శిక్షణ, డ్రిల్, పాయింట్ టూటూ, ఫూరింగ్ లో ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన డి.అరవింద్, ఎ.మణికంఠ, బి. ఉదయ్ కిరణ్, ఎం.లావణ్యలున్నారు. శిక్షణ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రసాద్‌తో పాటు వైస్‌ప్రిన్సిపాల్ ఎస్ఎం. రహమాన్, ఎస్.సుధీర్, డాక్టర్ స్వామిశాడ, ఎం.గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి పేర్వారం స్మారక పురస్కారాలు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు సాహితీ ప్రముఖులు, తెలుగు విశ్వవిద్యాల పూర్వ ఉపకులపతి పేర్వారం జగన్నాథం స్మారక పురస్కార ప్రదానోత్సవాన్ని గురువారం సాయంత్రం 6 గంటలకు హనుమకొండ వడ్డెపల్లిలోని పీఆర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆచార్య జగన్నాథం ఫౌండేషన్ నిర్వాహకుడు పేర్వారం శంకర్‌రావు, శ్రీనాథ్ మంగళవారం ఇక్కడ చెప్పారు. కేయూ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగే సమావేశంలో 2023 సంవత్సరానికి జనగామకు చెందిన డాక్టర్ లింగంపల్లి రామచంద్రకు, 2024కు మడికొండకు చెందిన డాక్టర్ పెద్ది వెంకటయ్యకు, 2025కు హనుమకొండకు చెందిన పొట్లపల్లి శ్రీనివాసరావులకు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అంపశయ్య నవీన్, వీఆర్. విద్యార్థి, ఈవీ శ్రీనివాసరావు అతిథులుగా పాల్గొంటారు.

ఎంజీఎంలో మరో రోగి మృతి

వరంగల్ మెడికల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగికి సకాలంలో గ్లూకోస్ బాటిల్స్ అందించకలేకపోవడంతో రోగి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా, రోగులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. పెరిటోనియల్ డయాలసిస్ గ్లూకోస్ బాటిల్స్ లేక రోగి మృతి చెందినట్లు సమాచారం. క్రియాటిన్ ఎక్కువ అయినప్పుడు బాటిల్స్ ఇవ్వాల్సి ఉంటుందని రోగులు ఆరోపిస్తున్నారు. వరుస సంఘటనలో వివాదాస్పదమవుతున్న ఎంజీఎం ఆస్పత్రిలో రోగుల మరణాలు ఆపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రోగుల విజ్ఞప్తి చేస్తున్నారు.

కేయూలో మాదిగ ఉద్యోగుల నిరసన ఆందోళన

కేయూ క్యాంపస్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి దిగిన రాజేశ్‌కిశోర్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం కేయూ పరిపాలన భవనం ఎదుట కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం నేతలు నిరసన చేపట్టారు. గవాయ్‌పై జరిగిన దాడిని దేశంలోని దళితులపై జరిగిన దాడిగా భావించాలని ఎంఈఎఫ్ అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్.సుజాతలు ఆందోళన వ్యక్తం చేశారు. కుల దురహంకారంతో దాడికి దిగిన రాకేశ్ కిశోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులను ఏకం చేసిన ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా పోరాటాలు చేస్తామని చెప్పారు. వెంకట్, తిరుపతి, బొక్క మొగిలి, కుమ్మరి శ్రీనాథ్, రణధీర్, శ్రీకాంత్, గణేశ్, దేవమ్మ, రాజు పాల్గొన్నారు.

వంట వస్తువుల వితరణ

వడ్డెపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లి చర్చి సర్కిల్ ప్రాంతంలోని ఒయాసిస్ అనాథ ఆశ్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ ప్రతినిధులు డాక్టర్ లయన్ కంచర్ల సుధీర్- లయన్ గోపిశ్రీ దంపతులు రూ.30వేలవిలువ చేసే వంట వస్తువులను మంగళవారం అందజేశారు. అదే విధంగా ఆల్ ఇన్ ప్రింటర్, కుక్కర్, మిక్సీ, అల్యూమినియం పాత్రలను సైతం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ అధ్యక్షుడు లయన్ తెరల రమేష్‌బాబు, ప్రతినిధులు రేవూరి రమణారెడ్డి, సుభాష్, నిర్మల, కోటిలింగం, ప్రభాకర్, వివేకానంద, శ్రీధర్‌రెడ్డి, జ్యోతి రమ జీ, విశాలక్ష్మి, భిక్షపతితో పాటు ఆశ్రమ నిర్వాహకులు వొద్దిరాజు చంద్రప్రకాష్ పాల్గొన్నారు.



"బాగా చదువుకోవాలన్న సంకల్పం, పట్టుదల ఉంటే చాలు... పేదరికం, వివక్ష లాంటి అవరోధాలను అధిగమించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. అయితే అది అంత సులభం కూడా కాదు... పోరాటం చేయాల్సిందే" అంటారు డాక్టర్ కుమ్మరి ఆదిలక్ష్మి. నంద్యాల జిల్లాలోని ఆవులదొడ్డి గ్రామానికి చెందిన ఆమె హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి తెలుగు పరిశోధనలో ఈ మధ్యే పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. "తొమ్మిదో తరగతితోనే ఆగిపోతుందనుకున్న చదువు ఇక్కడి వరకు కొనసాగడానికి కుటుంబంతో సమాజంతో పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది" అంటున్న ఆదిలక్ష్మి 'నవ్య'తో తన కథను పంచుకున్నారు.

చదువు కోసం పెద్ద యుద్ధమే చేశాను

"నల్లగా, పొట్టిగా ఉన్న పిల్లను ఎవరు పెళ్లి చేసుకుంటారు?... ఇలాంటి మాటలు బంధువులు, ఇరుగుపొరుగు వారి నోళ్ల నుంచి నిత్యం వింటూ పెరిగిన నాకు ఆ వెక్కిరింతలే దీవెనలయ్యాయి. ఆ అవమానాలే నన్ను మారుమూల పల్లెటూరు నుంచి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వరకూ తీసుకువచ్చాయి. మా ఊర్లో అమ్మాయిలకు చదువు అంటే తొమ్మిది లేదా పదోతరగతి... అంతే! ఇప్పటికీ అదే పరిస్థితి. తొమ్మిదో తరగతిలో ఉండగా నాకు కూడా మా ఇంట్లో వాళ్లు పెళ్లి చేయాలని చూశారు. కాకపోతే, వచ్చిన సంబంధాలు వచ్చినట్టే వెనక్కివెళ్లడంతో 'హమ్మయ్య... ఇక సంతోషంగా చదువుకోవచ్చు' అనుకున్నాను. అలా నా రూపమే నాకు మనోబలాన్ని, సంకల్పానికి శక్తిని అందించింది అయితే నా పాలిట మరొక విలన్ ఉంది! అదే పేదరికం. నా తల్లిదండ్రులకు నన్ను చదివించడానికి స్తోమత ఒక్కటే కాదు, ఆ దిశగా నన్ను ప్రోత్సహించాలన్న కనీస ఆలోచనకూడా లేదు. నా చదువు గురించి వారికి అస్సలు ఏమీ తెలీదు కూడా. కాకపోతే, నా ఇష్టానికి నన్ను వదిలేశారు. అదొక్కటే నా జీవితాన్ని నాకు నచ్చినట్టుగా మలచుకోవడానికి అవకాశం కల్పించింది.

పురుగుల అన్నం తింటూ...

పొలం పనులు సాగకపోవడంతో అమ్మ, నాన్న కూలి పనుల కోసం కర్నూలుకు వచ్చినప్పుడు



నన్నూ వెంట తీసుకువెళ్లారు. ఒక ప్రభుత్వ వసతి గృహంలో చేర్పించారు. నేను అక్కడ ఉండలేకపోతున్నానని ఎంత ఏడ్చి చెప్పినా "చదువుకోవాలంటే తప్పదు" అన్నారు. సెలవుల్లో నేనూ కూలికి వెళతానని చెప్పడంతో... నన్ను ఇంటికి తీసుకువచ్చారు. అలా ఇంటర్, డిగ్రీ వరకు పత్తిగింజల ఫ్యాక్టరీలో లేదంటే అప్పడాలు అమ్మడంలాంటి పనులుచేస్తూ కొనసాగాను. వచ్చిన కూలీని ఇంట్లోనే ఇచ్చాను. కొద్ది రోజులకు అమ్మావాళ్లు తిరిగి మా సొంతూరు వెళ్లడంతో... మళ్లీ ప్రభుత్వ వసతిగృహంలో చేరాల్సి వచ్చింది. ఆ జీవితం నరకప్రాయం. మరుగుదొడ్లు లేవు. చీకటితోనే లేచి ఆరుబయట స్నానాలు చేయాల్సి వచ్చేది. అన్నంలో పురుగులు ఏరుకొని తినాల్సి వచ్చేది. ఎప్పుడైనా కాలేజీలో స్పెషల్ క్లాసు వల్ల హాస్టల్‌కు ఆలస్యంగా వెళితే... మాకు ఆ వేళ ఉపవాసమే. రికార్డులు, నోటు పుస్తకాలకు డబ్బులు అడిగితే ఇంట్లోవాళ్లు లేవనేవారు. సెలవుల్లో కూలి పనులు చేస్తే వచ్చిన డబ్బుతో అవసరమైనవి సమకూర్చుకోవడం ఒక్కటే నాకు మిగిలిన దారి. ఈ రోజుల్లో డిగ్రీ చదవడం చాలామందికి పెద్ద విషయమేమీ కాదు. కానీ నాలాంటి ఆడపిల్లలకు మాత్రం అది పెద్ద యుద్ధమే. అందులో గెలవడానికి ఎన్ని బాధలు పడాలో అవన్నీ అనుభవించాను.

చదువు ఒక్కటే దారి...

చదువు ఒక్కటే మన జీవితాన్ని ఒక మెట్టుపైకి తీసుకెళుతుందని గుర్తించాను. కొంతమంది దృష్టిలో చదువుకోవడం అంటే పాఠ్యపుస్తకాలు వల్లెవేసి, పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే. కానీ నాలాంటి అమ్మాయిలకు మాత్రం చదువు అంటే అదొక పెద్ద సంగ్రామం. సమాజంతో, కుటుంబంతో నిత్యం పోరాడాలి. అవమానాలు, ఛీత్కారాలు భరించాలి. 'అమ్మాయిలకు అంత పెద్ద చదువు అవసరమా' లాంటి సామాజిక ఒత్తిళ్లను అధిగమించాలి. అప్పుడుకాని తరగతి గదికి చేరుకోలేం. నా పీహెచ్‌డీ పరిశోధనలో భాగంగా వివాహ వ్యవస్థ గురించి డాక్టర్ కె.శ్రీదేవి, మల్లాది సుబ్బమ్మ, ఓల్గా, కాత్యాయనీ విద్మహే లాంటి ప్రఖ్యాత రచయిత్రులు రాసిన వ్యాసాలు అధ్యయనం చేశాను. దీనివల్ల భారతీయ సమాజంమీద, ముఖ్యంగా స్త్రీ, పురుష సంబంధాలమీద స్పష్టమైన అవగాహన నాలో ఏర్పడింది. వారి రచనలు నన్ను మరింత విశాల ప్రపంచంలోకి తీసుకువెళ్లాయి.

ఆ విషయం ఏడాదిన్నర దాచాను...

మా ప్రాంతంలో రజస్వల అయిన వెంటనే అమ్మాయిలకు పెళ్లి చేస్తారు. ఇప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చాలా గ్రామాలలో బాల్యవివాహాలు తరచుగా జరుగుతుంటాయి. కొన్ని పల్లెల్లో అయితే ఒకరిద్దరు మాత్రమే ఇంటర్, డిగ్రీ వరకు చదివి ఉంటారు. మూఢనమ్మకాలు కూడా ఎక్కువే. పుష్పవతి అయ్యానని తెలిసి, నాకు పెళ్లి చేస్తారేమోనన్న భయంతో ఏడాదిన్నర పాటు అమ్మకు కూడా చెప్పకుండా ఆ విషయాన్ని దాచాను.

సెంట్రల్ వర్సిటీలో సీటు వచ్చింది...

డిగ్రీలో ఉండగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో ప్రవేశ పరీక్ష ద్వారా పోస్టు గ్రాడ్యుయేషన్‌లో చేరవచ్చునని తెలిసింది. అప్పటివరకు నాకు ఆ యూనివర్సిటీ ఉందనే విషయమే తెలియదు. ఎంట్రన్స్ రాశాను. మంచి ర్యాంకు రావడంతో ఎమ్మే తెలుగులో చేరాను. తెలుగు అంటే సులువుగా ఉంటుందని అనుకున్నా, ఇక్కడ చేరాక కానీ తెలియలేదు... అది ఎంత కష్టమో. చదువుమీద ఇష్టంతో ఆ కష్టాన్ని కూడా సునాయాసంగా దాటాను. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన తర్వాత పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలోనూ రెండవ ర్యాంకు సాధించాను. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కి ఎంపికయ్యాను. ఆచార్య గోనా నాయక్ సర్ పర్యవేక్షణలో 'తెలుగు కథా సాహిత్యం - వివాహ వ్యవస్థలో పరిణామాలు... పరిశీలన' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి, మొన్నటి స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నాను. ఈ టాపిక్‌కూడా మా ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు సర్ సూచించారు. మా ప్రొఫెసర్లు మాత్రం నాకు చక్కటి మార్గనిర్దేశం చేశారు కాబట్టే సాధారణ అమ్మాయినైన నేను డాక్టర్ ఆదిలక్ష్మి కాగలిగాను. మా ఊర్లో పీహెచ్‌డీ చేసిన మొదటి అమ్మాయి నేనే కావచ్చు. ఇది గర్వంతో చెప్పడం లేదు, 'ఇన్నేళ్ల స్వాతంత్ర్య ఫలాలు మా పల్లెలాంటి ఇంకెన్ని పల్లెలకు చేరలేదో?' బాధతోనే అంటున్నాను.

అదే నా లక్ష్యం...

సెంట్రల్ యూనివర్సిటీలో ఉండగా అక్కడే మరో కోర్సు చదువుతున్న ఒక అతను పరిచయమయ్యాడు. ఒకరినొకరం ఇష్టపడి కులాంతరాలను సైతం కాదని పెద్దలను ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నాం. ఇన్నాళ్లూ తల్లిదండ్రుల నుంచి అందని ప్రేమాభిమానాలు, ప్రోత్సాహం భర్త నుంచి ఆశించాను. తాను ఒకటి తలిస్తే, విధి మరొకటి తలచిందని... వివాహమైన నెలరోజులకే కట్నం కోసం కొట్లాటలు మొదలయ్యాయి. మా అమ్మా నాన్నా నా చదువుకు సహకరించకపోయినా... ఆంక్షలు మాత్రం విధించలేదు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మాత్రం చదువుకోవద్దని ఒక రోజు, 'ఇప్పటికిప్పుడు ఉద్యోగం తెచ్చుకోవాల్సిందే' అని మరొక రోజు నానా మాటలతో చిత్రవధ చేయడం మొదలుపెట్టాడు. పీహెచ్‌డీ పరిశోధన ఆపేయమన్నాడు. మగ ప్రొఫెసర్లతో మాట్లాడకూడదని షరతులు పెట్టాడు. ఆ హింస భరించలేక ఇంటి నుంచి బయటకు వచ్చాను. ఇంకోవైపు పుట్టింటి నుంచి సహకారం లేదు. ఒకానొక సమయంలో డిప్రెషన్‌లోకి వెళ్లాను. తిరిగి నాలో నేనే ధైర్యం తెచ్చుకొని పీహెచ్‌డీ పరిశోధన పూర్తిచేశాను. ఉపాధ్యాయ వృత్తి అంటే నాకు మొదటి నుంచి చాలా ఇష్టం. టీచర్ అవ్వాలనీ, నాలాంటి నిరుపేద అమ్మాయిలు మరికొందరికి అండగా నిలవాలనీ నా కోరిక. ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. జీవితంలో ఎన్నో యుద్ధాలు చేసి గెలిచిన నేను ఈ పోరాటంలోనూ తప్పకుండా విజయం సాధిస్తాను."

• సాంత్వన్

ఇల్లు సువాసనభరితంగా..

మనం ఎప్పుడైనా బయటకు వెళ్లి, తిరిగివచ్చి తలుపులు తెరవగానే ఇంట్లో నుంచి ఘాటైన వాసనలు రావడం గమనించే ఉంటాం. కిచెన్, బెడ్ రూమ్, స్టడీ రూమ్, హాల్, వాష్ రూమ్‌లలో సహజంగానే పలు రకాల వాసనలు నిండి ఉంటాయి. వీటివల్ల ఒక్కోసారి చికాకుగా అనిపిస్తుంటుంది. అలాకాకుండా ఇల్లంతా సువాసనభరితంగా ఆహ్లాదకరంగా ఉండాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...



- ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటి తలుపులు, కిటికీలు తెరచి ఉంచాలి. అప్పుడే ఎండ, గాలి లోపలికి ప్రసరించి ఇంటిని ఆహ్లాదకరంగా మారుస్తాయి.
- దుమ్ము, ధూళి, బూజు చేరకుండా ఇంటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. హాల్లో ఉండే సోఫాలు, కర్టెన్లు, కార్పెట్ల మీద కొద్దిగా బేకింగ్ సోడా చల్లి, వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేస్తే దుర్వాసనలు తొలగిపోయి ఆహ్లాదకరంగా అనిపిస్తుంది.
- ప్రతి గదిలో ఇండోర్ ప్లాంట్ కుండీలను ఏర్పాటు చేసుకుంటే ఇల్లంతా తాజదనం నిండుతుంది. లావెండర్, రోజ్‌మేరీ, లెమన్‌గ్రాస్, యూకలిప్టస్, ఆర్కిడ్స్, పుదీనా, హనీసకేల్, గార్డెనియా లాంటి మొక్కలు ఇంటిని సువాసనలతో నింపేస్తాయి.
- ప్రస్తుతం నిమ్మ, లావెండర్, గులాబీ, మల్లె, సంపెంగ లాంటి ఎన్నో రకాల ఎసెన్షియల్ ఆయిల్స్, అత్తర్లు అందుబాటులో ఉంటున్నాయి. వాటిలో నచ్చినదాన్ని తెచ్చుకుని అప్పుడప్పుడు ఇల్లంతా స్ప్రే చేసుకోవచ్చు. దూది ఉండల మీద రెండు చుక్కల ఆయిల్ వేసి వాటిని గది మూలల్లో ఉంచినా ఫలితం ఉంటుంది.
- రాత్రిపూట ఇంట్లో సువాసనలను వెదజల్లే ఆర్గానిక్ కొవ్వొత్తులు వెలిగించుకోవచ్చు. అవి వెలుగుతున్నంతసేపు ఇల్లంతా మంచి వాసన నిండుతుంది. ఆ సుగంధాన్ని కర్టెన్లు, కార్పెట్లు, సోఫా కవర్లు కూడా శోషించుకుంటాయి. దీంతో రోజంతా ఇల్లు ఆహ్లాదకరంగా ఉంటుంది.

పిల్లలు నడక నేర్చుకుంటున్నారా..?

సాధారణంగా పిల్లలు నడక నేర్చుకునే క్రమంలో చిన్న చిన్న దెబ్బలు తగిలించుకుంటూ ఉంటారు. అలాకాకుండా పిల్లలు తప్పటడుగులు వేసేటప్పుడు తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...



- పిల్లలు నిలబడడానికి ప్రయత్నిస్తున్నప్పుడు వాళ్లని వాకర్‌లో కూర్చోబెట్టాలి. వాకర్‌ను మెల్లగా ముందుకు జరుపుతుంటే... పిల్లలు నిటారుగా నిలబడడం, అడుగులు వేయడం నేర్చుకుంటారు. అలాగని పిల్లలను గంటలకొద్దీ వాకర్లో ఉంచితే... వాళ్లకు నడుము నొప్పి వచ్చే ప్రమాదం ఉంటుంది. పిల్లలు వాకర్లో ఉన్నంతసేపు వాళ్లని గమనిస్తూ ఉండాలి.
- పిల్లలు బుడి బుడి అడుగులు వేసేటప్పుడు వాళ్లకి పొడవాటి డ్రెస్‌లు వేయకూడదు. ఒక్కోసారి అవి కాళ్లకు అడ్డుపడి పిల్లలు కిందపడిపోయే అవకాశం ఉంటుంది. చేతి వేళ్లను పట్టుకుని నడిపిస్తుంటే పిల్లలు నడవడం నేర్చుకుంటారు.
- పిల్లలు ఇంటి పరిసరాల్లో నడిచేటప్పుడు పాదాలకు సాక్స్, బయటికి తీసుకువెళ్లేటప్పుడు మెత్తని షూస్ వేయాలి. లేదంటే రాళ్లు, ఇసుక లాంటివి గుచ్చుకుని పాదాలు కందిపోతాయి. ఒక్కోసారి పిల్లలు రెండు లేదా మూడు అడుగులు వేసి అకస్మాత్తుగా ముందుకు పడిపోతుంటారు. అలాంటప్పుడు దెబ్బలు తగలకుండా అరచేతులకు గ్లౌజ్‌లు వేయాలి.
- నడక నేర్చుకుంటున్న పిల్లలు... మంచం, ఉయ్యాల, సోఫా, ఇంటి ముందున్న మెట్లు దిగే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అలా దిగుతూ ఒక్కోసారి కింద పడిపోయి దెబ్బలు తగిలించుకుంటూ ఉంటారు. కాబట్టి పిల్లలు నడక నేర్చుకునే రెండు లేదా మూడు నెలలపాటు వాళ్లని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి.

ఫ్యాషన్

'కోర్సెట్' కనికట్టు

పురాతన కోర్సెట్ ఫ్యాషన్ మళ్లీ ఊపందుకుంది. ఒంపుసొంపులతో కనికట్టు చేసే కోర్సెట్స్... చీరలు, గౌన్లు, జీన్స్... ఇలా అన్ని రకాల దుస్తులకూ తోడవుతున్నాయి. ప్రత్యేకించి వేడుకల్లో వెలిగిపోవాలనుకుంటే ఈ ట్రెండ్‌ను ఇలా అనుసరించాలి.





17 నుంచి 19వ శతాబ్దం వరకూ వాడుకలో ఉన్న కోర్సెట్స్. ప్రారంభంలో తిమింగలం ఎముక, స్టీలుతో రూపొందేవి. శరీరానికి అతుక్కుపోయేలా, బిగుతుగా బిగించి కట్టే కోర్సెట్స్‌తో శరీరాకృతి ఆకట్టుకునేలా మారిపోతుందనే ఉద్దేశంతో ఒకప్పటి యూరోపియన్ మహిళలు వీటిని లోదుస్తుల్లా ధరించేవారు. అయితే ఈ దుస్తుల ఫ్యాషన్ క్రమేపీ అంతరించిపోతూ ఉండడంతో... వీటిని సరికొత్త రూపంలో వాడుకలోకి తీసుకురావాలనుకున్న ఫ్యాషన్ డిజైనర్లు... సంప్రదాయ కోర్సెట్స్‌ను మరిపించే దుస్తులను డిజైన్ చేయడం మొదలుపెట్టారు. ఫలితంగా కోర్సెట్ గౌన్లు, చీరలు వాడుకలోకి వచ్చాయి. అయితే వీటిని ఎలా ఎంచుకోవాలో తెలుసుకుందాం!

- ఛాతీ, నడుము, కటి ప్రదేశాలను కచ్చితంగా కొలుచుకుని, ఆ కొలతలకు తగిన కోర్సెట్‌ను ఎంచుకోవాలి
- కొందరికి ఛాతీ వెడల్పుగా ఉండొచ్చు. ఇంకొందరికి నడుము వెడల్పుగా ఉండొచ్చు. ఇలాంటి వాళ్లు 'అండర్‌బస్ట్' లేదా 'ఓవర్‌బస్ట్' కోర్సెట్‌ను ఎంచుకోవాలి
- పిరుదులు, నడుము నొక్కుకుపోకుండా సౌకర్యంగా ఉండాలి
- వదులు చేసుకోడానికీ, బిగుతును పెంచడానికీ వీలైన లేసింగ్ ఉండేలా చూసుకోవాలి



- కాటన్, మెష్, జెన్యూన్ లెదర్‌తో తయారైన కోర్సెట్స్ ఎంచుకోవాలి
- అండర్‌బస్ట్ కోర్సెట్స్ ధరించడం ఎంతో తేలిక. కాబట్టి వీటికే ప్రాధాన్యం ఇవ్వాలి
- చీరకు జోడీగా ధరించాలనుకుంటే, ఓవర్‌బస్ట్ కోర్సెట్‌ను ఎంచుకోవాలి.





సైకాలజీ

'కౌన్ బనేగా కరోడ్‌పతి 17'లో పాల్గొన్న ఇషిత్ భట్ అనే ఒక పదేళ్ల పిల్లాడు ప్రస్తుతం అందరూ ద్వేషించే పిల్లాడిగా వైరల్ అయ్యాడు. బాలీవుడ్ దిగ్గజం అమితాబ్ బచ్చన్ సారథ్యంలో సాగే ఈ క్విజ్ కార్యక్రమంలో ఆ పిల్లాడి దుందుడుకు ప్రవర్తన, దురుసైన మాటతీరు సర్వత్రా చర్చనీయాంశాలుగా మారాయి. పిల్లాడి ప్రవర్తన ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందా లేదంటే అహంకారాన్ని కనబరుస్తోందా? ఇది ఆ పిల్లాడి తప్పిదమా, లేక తల్లితండ్రుల పెంపకం లోపమా? సమస్య ఎక్కడుంది?




ట్రోల్ అవుతున్న కెబిసి కుర్రాడు

ఐదో తరగతి చదువుతున్న గుజరాత్‌కు చెందిన ఇషిత్ భట్... కార్యక్రమం మొదట్లోనే...'నాకు ఈ కార్యక్రమం నియమాలన్నీ తెలుసు. కాబట్టి మీరిప్పుడు నాకు నియమాలు చెప్తూ కూర్చోకండి' అంటూ అమితాబ్‌ను ఆశ్చర్యానికి గురి చేయడంతో పాటు... ప్రశ్నకు తగిన ఆప్షన్స్ చెప్పే సమయం తీసుకోకుండానే దూకుడుగా సమాధానం చెప్పేయడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత కూడా... ఒక ప్రశ్న అడిగిన వెంటనే "ఇదసలు అడగవలసిన ప్రశ్నేనా?" అంటూ ఎద్దేవా చేయడంతో పాటు, మరొక ప్రశ్నకు సమాధానంగా 'ఒకటికి నాలుగు లాక్స్ వేసుకోండి' అంటూ అవసరానికి మించిన ఆత్మవిశ్వాసాన్ని కనబరిచి, అంతిమంగా పాతిక వేల ప్రైజ్ మనీని కోల్పోయి ఇంటి దారి పట్టాడు. అయితే ఈ కార్యక్రమంలో ఇషిత్ కనబరిచిన ప్రవర్తనను ఆత్మవిశ్వాసంగా పరిగణించాలా? లేక అహంకారంగా భావించాలా? లేదంటే ఇప్పటి తరం ఇలాగే ఉందని సరిపెట్టుకోవాలా?

సిక్స్ పాకెట్ సిండ్రోమ్

ఈ కార్యక్రమంలో ఇషిత్ కనబరిచిన ప్రవర్తనను మానసిక వైద్యులు 'సిక్స్ పాకెట్ సిండ్రోమ్'గా పరిగణిస్తున్నారు. ఈ సామాజిక పరిస్థితిలో ఆరుగురు కుటుంబసభ్యులు ఒకే బిడ్డ మీద విపరీతమైన ప్రేమనూ, శ్రద్ధనూ కనబరుస్తూ ఉంటారు. పిల్ల లేదా పిల్లాడి ప్రవర్తన వెనుక... ఆ బిడ్డ తల్లితండ్రులతో పాటు, ఇరువైపులా ఉన్న అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో కలిపి మొత్తం ఆరుగురు కుటుంబసభ్యుల ప్రమేయం ఉంటుందని సైకాలజిస్టులు అంటున్నారు. దంపతులు ఒక సంతానానికే పరిమితమైపోతున్న రోజులివి. దాంతో కుటుంబంలోని ఆరుగురి దృష్టీ ఆ ఒక్క సంతానం మీదే కేంద్రీకృతమై ఉంటుంది. ఆ ఆరుగురూ బిడ్డను గారం చేస్తూ, అడిగినవన్నీ కొనిపెడుతూ, నొప్పి తెలియకుండా పెంచడమే కాకుండా... ఆలస్యం చేయకుండా అలక తీర్చేయడం, అడిగినవన్నీ క్షణాల్లో అందించడం, తన మాటే నెగ్గుతుందనే భరోసా కల్పించడం లాంటి పొరపాట్లు చేస్తూ ఉంటారు. దాంతో పిల్లల్లో తానొక ప్రత్యేకమైన వ్యక్తిననే అభిప్రాయం బలపడుతుంది. తన మాటకు ఎదురుండదనే భరోసా కలుగుతుంది. కొన్ని కుటుంబాల్లో పిల్లలను అవసరానికి మించి పొగిడేస్తూ ఉంటారు. ఇదీ మంచిది కాదు. పిల్లల ప్రవర్తన ఆత్మవిశ్వాసాన్ని ప్రతిఫలిస్తున్నట్టు కనిపించవచ్చు. అయితే అది అహంకారానికి దారి తీయకుండా జాగ్రత్తపడవలసిన బాధ్యత తల్లితండ్రులదే!





సామాజిక మాధ్యమాలు, రియాలిటీ షోలు

దురుసుగా, నిర్మోహమాటంగా మాట్లాడితే 'మా పిల్లలు పిడుగులు' అంటూ మురిసిపోయే తల్లి తండ్రులు ఉంటారు. కానీ అలాంటి ప్రవర్తనను చూసి, మెచ్చుకోలుగా మాట్లాడిన ప్రతిసారీ పిల్లల్లో అదే సరైన ప్రవర్తన అనే నమ్మకం నాటుకుపోతూ ఉంటుంది. పెద్దలతో దురుసుగా మాట్లాడినప్పుడు మందలించడానికి బదులుగా, 'వాడి తీరే అంత' అంటూ పట్టించుకోకుండా వదిలేస్తే, తన ధోరణి సరైనదేననే ప్రోత్సాహాన్ని పిల్లలు పొందుతారు. ఇంట్లో ఇలాంటి వాతావరణానికి తోడు, రియాలిటీ షోలు, సామాజిక మాధ్యమాలు, సినిమాలు, సీరియల్స్‌లో నటించే బాలనటుల ప్రవర్తనలను కూడా పిల్లలు అనుకరిస్తూ ఉంటారు. ఆయా మాధ్యమాల్లో పిల్లల మాటలకు వస్తున్న ప్రతిస్పందననూ, మెచ్చుకోళ్లనూ, చప్పట్లనూ రివార్డులుగా భావిస్తూ, అదే సరైన ప్రవర్తన అని భ్రమపడుతూ ఉంటారు. ఇంకొందరు పిల్లలు పెద్దల దృష్టిని ఆకట్టుకోవడం కోసం విపరీతంగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇవన్నీ పిల్లలే స్వయంగా అలవరుచుకున్న లక్షణాలు కావు. పరిసరాలు, పరిస్థితులు, చుట్టూ ఉన్న వాతావరణం, పెద్దల ప్రవర్తన... ఇవన్నీ పిల్లల మీద ప్రభావం కనబరుస్తూ ఉంటాయి. కాబట్టి పెద్దలను ఎదిరించి మాట్లాడడం, కసురుకోవడం, చెప్తున్నది పూర్తిగా వినకుండానే సమాధానం చెప్పడం, చులకనగా మాట్లాడడం... చిన్న పిల్లల్లో ఇలాంటి ప్రవర్తనా లోపాలను గుర్తించినప్పుడు వాటిని మొదట్లోనే ఖండించాలి.

చిటికెలో చేతికి?

ఏది కావాలనుకున్నా, చిటికెలో చేతికందే రోజులొచ్చాయి. రిమోట్‌లో బటన్ నొక్కగానే రెప్పపాటులో ఛానల్ మారిపోతోంది. స్విగ్గీలో ఆర్డర్ పెట్టిన నిమిషాలలోపే ఆహారం ఇంటికొస్తోంది. ఫలానాది కావాలని తల్లితండ్రులను అడిగిన వెంటనే ఆ వస్తువును చేతికి అందించే ధోరణి కూడా పెరుగుతోంది. ఇలా అనుకున్న వెంటనే పనులన్నీ చకచకా జరిగిపోతున్నప్పుడు, తాను తలచుకున్న ప్రతిదీ అలాగే జరుగుతుందనే నమ్మకం కలగడం, అందుకోసం తొందరపడడం, కొద్దిపాటి ఆలస్యాన్ని సైతం భరించలేకపోవడం మొదలైన స్వభావాలు పిల్లల్లో పెరుగుతున్నాయి. వీటిని కట్టడి చేయడం అవసరం. సహనం, ఉపేక్షల అసలు అర్థాలను పిల్లలకు నేర్పాలి. దుందుడుకుతనంతో ఒరిగే నష్టాలను తెలియచెప్పాలి. కోపం, ఉక్రోషం లాంటి భావోద్వేగాల దుష్ప్రయోజనాలను వివరించాలి. మరీ ముఖ్యంగా ఆత్మవిశ్వాసానికీ, అహంకారానికీ వ్యత్యాసాన్ని విపులంగా వివరించాలి.

డాక్టర్ జ్యోతిర్మయి
సీనియర్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్,
మనహ క్లినిక్, హైదరాబాద్.

సానుభూతి ఎక్కడ?

మన మాట, ప్రవర్తనలు ఎదుటివారిని బాధపెట్టే అవకాశం ఉంటుందని పిల్లలు గ్రహించేలా చేయడం ఎంతో అవసరం. ఎలాంటి ప్రవర్తన, ఎలాంటి మాట తీరు ఎదుటి వారి మనసును నొప్పిస్తాయో పిల్లలు తమంతట తాము తెలుసుకోలేరు. కాబట్టి ఈ విషయంలో పెద్దలే పిల్లలకు మార్గదర్శకులుగా మారాలి. అలాంటి ప్రవర్తనను మొగ్గలోనే ఖండించాలి. తోటి పిల్లలతో, పెద్దలతో పిల్లలు నడుచుకునే తీరును గమనిస్తూ, అవసరమైన చోట కౌన్సెలింగ్ ఇస్తూ ఉండాలి. మరీ ముఖ్యంగా టీవీలు, సామాజిక మాధ్యమాల ప్రభావం పిల్లల మీద పడకుండా జాగ్రత్త పడాలి.

• గోగుమళ్ల కవిత

రాష్ట్రంలోకి 'అపోలో ఆయుర్వేద్'

» అత్యుత్తమ ఆయుర్వేద చికిత్స అందించడమే లక్ష్యం: సంస్థ ఎండీ రాజీవ్ వాసుదేవన్


గౌరవ్ తుక్రాల్‌తో రాజీవ్ వాసుదేవన్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రిహాబిలిటేషన్ నైపుణ్యంతో కచ్చితమైన ప్రపంచ స్థాయి ఆయుర్వేద వైద్యాన్ని.. అందించాలనే లక్ష్యంతో 'అపోలో ఆయుర్వైద్' తెలంగాణలో ప్రవేశించిందని హాస్పిటల్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ వాసుదేవన్ అన్నారు. ఈ మేరకు దేశంలోని పెద్ద రికవరీ హాస్పిటల్ నెట్‌వర్క్ 'హెచ్‌సీఏహెచ్ సువిటాస్'తో కలిసి భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఆయన మంగళవారం ప్రకటించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడలో తొలి ఆయుర్వైద్ హెచ్‌సీఏహెచ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ.. సంక్లిష్ట, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే రోగులకు.. ఆయుర్వేదం, ఆధునిక వైద్య సమ్మేళనంగా సేవలను అందిస్తామన్నారు. ఈ కేంద్రంలో ప్రత్యేక ఆయుర్వేద చికిత్సలకు 20 పడకలు, రీహాబిలిటేషన్ సేవలకు 115 పడకలున్నాయన్నారు. దేశంలోనే అతిపెద్ద న్యూరో రీహాబిలిటేటివ్ కేర్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని సువిటాస్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ గౌరవ్ తుక్రాల్ అన్నారు.

త్వరలో కోటి మందికి భూధార్ కార్డులు!

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే కోటి మందికి భూధార్ కార్డులను అందించేందుకు రెవెన్యూ శాఖ సన్నద్ధమవుతోంది. జనవరి నాటికి రైతులకు వీటిని అందజేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రతి కమతానికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాలన్న కేంద్రం మార్గదర్శకాలకనుగుణంగా భూధార్ కార్డులు ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సర్వే రికార్డు, ఆర్వోఆర్‌లోని వివరాలను, క్షేత్ర స్థాయి పరిస్థితుల ఆధారంగా తాత్కాలిక భూధార్ కార్డులు ఇచ్చి, రీ సర్వే చేశాక శాశ్వత కార్డులు ఇవ్వనున్నట్లు భూభారతి చట్టం లో ప్రభుత్వం పేర్కొంది. ప్రతి కమతానికి ఓ ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్రం ప్రతిపాదించగా.. రాష్ట్రంలో పాస్ పుస్తకాలు గ్రామస్థాయికి పరిమితమై ఉన్నందున దాని ప్రాతిపదికనే భూధార్ కార్డులిచ్చే అవకాశం ఉందని భూ చట్టాల నిపుణుడు సునీల్ చెబుతున్నారు.

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి..!

» రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ప్రభుత్వానికి వినతి

మహేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయి పురుగులు పడుతున్నాయని, ప్రభుత్వం వెంటనే ఆ బియ్యాన్ని వాపసు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి రేషన్ డీలర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కమీషన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కతోపాటు ఎంపీ రఘునందన్‌రావులను వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పులిమామిడి లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ మంత్రులు సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు.

కర్రె గుట్టలపై సీఆర్‌పీఎఫ్ బేస్‌క్యాంప్

చర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో భాగంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రె గుట్టలపై మంగళవారం కొత్తగా సీఆర్‌పీఎఫ్ ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్‌వోబీ) బేస్‌క్యాంపును ఏర్పాటు చేశారు. గత మేలో ఆపరేషన్ ముగిశాక కర్రెగుట్ట లోని తడపల అడవుల్లో 229వ క్యాంపు ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా అడవుల్లో మావోయిస్టు పార్టీ డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి.

ఒక్క దరఖాస్తూ రాలేదు!

» మంగళవారం.. అష్టమి ఎఫెక్ట్!
» ముహూర్తం బాగోలేదంటూ దరఖాస్తుల దాఖలుకు మద్యం వ్యాపారులు దూరం
» గడువుకు మిగిలింది నాలుగు రోజులే
» ఇప్పటిదాకా వచ్చిన దరఖాస్తులు 7 వేలే
» లక్ష వస్తాయని అంచనా వేసిన ఎక్సైజ్
» ఇక రోజుకు 20 వేలకు పైగా రావాలి!

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తుల స్వీకరణలో ఎక్సైజ్ శాఖ అంచనాలు తలకిందులవుతున్నాయి. రికార్డు స్థాయిలో దరఖాస్తులు వస్తాయని ఆశించిన అధికారులకు మంగళవారం ప్లస్ అష్టమి కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్క దరఖాస్తూ రాలేదు. దరఖాస్తుల స్వీకరణ గడువు సమీపిస్తున్న కొద్దీ ఒక్క రోజూ కీలకమైనా.. మంగళవారం, అష్టమి ప్రభావం పడింది. దాదాపు రూ.3 లక్షల నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుము చెల్లించి, భవిష్యత్తులో కోట్లాది రూపాయల వ్యాపారానికి వేసే తొలి అడుగును అశుభ ఘడియల్లో వేయడానికి ఎవరూ సాహసించలేదు. తెలుగు రాష్ట్రాల్లో పనులు మొదలుపెట్టేవారు ముహూర్తాలను ఎంత బలంగా నమ్ముతారో దీన్ని బట్టి రుజువైంది. ఇక బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ ఐక్య కార్యచరణ కమిటీ బుధవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడంతో బ్యాంకులు మూతపడితే దరఖాస్తులపై మరింత ప్రభావం పడనుంది. దరఖాస్తుకు ఈ నెల 18వ తేదీ ఆఖరు.. అంటే మిగిలింది కేవలం 4 రోజులే. గత నెల 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైనా ఇప్పటి వరకు వచ్చినవి 7,238 మాత్రమే. ఆదివారం వరకు 5,663.. సోమవారం 1,575 వచ్చాయి. ఎక్సైజ్ శాఖ అధికారుల లక్ష దరఖాస్తుల లక్ష్యం సాధనకు ఇంకా 90 వేలకుపైనే రావాల్సి ఉంది. దరఖాస్తుల విక్రయంతో దాదాపు రూ.3,000 కోట్ల ఆదాయం వస్తుందన్న ఎక్సైజ్ శాఖ ప్రచారంతో వాటిని తమకు రావాల్సిన రూ.3,151 కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలని మద్యం సరఫరాదారులు డిమాండ్ చేశారు. 2,620 మద్యం దుకాణాల కేటాయింపునకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. గతంలో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా.. ఈసారి రూ.లక్ష పెంచింది.

చివరి మూడు రోజుల్లో భారీగా వస్తాయి!

గతంలో చివరి మూడు రోజుల్లోనే 75 శాతం దరఖాస్తులు వచ్చాయి. అలాగే రాబోయే మూడు రోజుల్లో భారీగా దరఖాస్తులు వస్తాయి. వాటికి అనుగుణంగా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం.

-హరికిరణ్, కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ

నర్సింగ్ విద్య.. అంతా మిథ్య

చిరునామా ఒకచోట.. కాలేజీ మరోచోట.. ఒకే భవనంలో ఎక్కువ కాలేజీలు.. అనుబంధ ఆస్పత్రులు నిల్

» 16 నర్సింగ్‌స్కూల్స్‌పై ఆకస్మిక తనిఖీలలో బయటపడ్డ లోపాలు
» ప్రజల ఫిర్యాదులతో.. రాష్ట్రవ్యాప్త తనిఖీలకు వైద్య మంత్రి ఆదేశం
» లోపాలున్న నర్సింగ్ విద్యాసంస్థలకు అండగా ఓ ఉన్నతాధికారి?

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నర్సింగ్ విద్య మిథ్యగా మారింది. పలు నర్సింగ్ కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో.. వైద్యమంత్రి దామోదర రాజనర్సింహ తనిఖీలకు ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో మంగళవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, నల్లగొండ జిల్లాల్లో పలు నర్సింగ్ స్కూల్స్, కాలేజీలపై నర్సింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలోని బృందాలు తనిఖీలు చేశాయి. మొత్తం 23 నర్సింగ్‌స్కూల్స్‌పై సర్కారుకు ఫిర్యాదులు రాగా.. ఒక్కో నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్‌కూ ఇద్దరేసి చొప్పున మొత్తం 46 మంది అధికారులు తనిఖీలకు వెళ్లారని.. తొలి రోజు 16 నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో తనిఖీలు చేశారని సమాచారం. బుధ, గురువారాల్లో మరికొన్ని ఇన్‌స్టిట్యూట్లపై తనిఖీలు కొనసాగుతాయని వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

ఇవీ ఫిర్యాదులు..

పలు నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్లలో కనీస మౌలిక వసతుల్లేవని.. బోధన సిబ్బంది లేరని.. కొన్ని స్కూల్స్ చిరునామా రికార్డుల్లో ఒకచోట ఉంటే.. వాస్తవంగా మరోచోట ఉన్నాయని.. ఒకే భవనంలో ఎక్కువ నర్సింగ్ స్కూల్స్ ఉన్నాయని.. సర్కారుకు అందిన ఫిర్యాదుల సారాంశం. ఏయే ఇన్‌స్టిట్యూట్లు ఏయే నిబంధనలనుల్లంఘిస్తున్నాయనే విషయమై సర్కారుకు పేర్లతో సహా ఫిర్యాదులందాయి. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు.. వైద్యవిద్య సంచాలకుడు (అకడమిక్) తనిఖీలు చేయాలని నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. తనిఖీల్లో తమకందిన ఫిర్యాదులు నిజమేనని.. పలు ఇన్‌స్టిట్యూట్లకు అనుబంధ ఆస్పత్రులు లేవని అధికారులు గుర్తించినట్లు సమాచారం. కనీస మౌలిక వసతులతోపాటు టీచింగ్ ఫ్యాకల్టీ కూడా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) నిబంధనల మేరకు లేదని తేలింది. తనిఖీలు పూర్తిచేసి 1-2 రోజుల్లో సర్కారుకు నివేదిక అందిస్తామని.. నిబంధనలు పాటించని నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్ల గుర్తింపును రద్దు చేయాలని ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఓ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మూడేళ్లకొకమారు రెన్యువల్స్...

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో జీఎన్‌ఎమ్, బీఎస్సీ నర్సింగ్ కాలేజీలు, ఇన్‌స్టిట్యూట్‌లు 424 ఉన్నాయి. వీటిలో ఎక్కువభాగం ప్రైవేటు సంస్థలే. నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ గుర్తింపు పొందిన నర్సింగ్ విద్యాసంస్థల్లో మూడేళ్లకోసారి తనిఖీలు నిర్వహించి.. అన్నీ సవ్యంగా ఉంటేనే గుర్తింపు రెన్యువల్ చేస్తారు. మౌలిక వసతులు, క్లినికల్ ట్రైనింగ్ ఎక్కడ పొందుతున్నారు? హాస్టల్, బస్సు సౌకర్యం, టీచింగ్ ఫ్యాకల్టీ తదితర వసతులున్నాయా ? లేదా? అకడమిక్ గ్రోత్ ఎలా ఉంది? ఈ అంశాలన్నీ పరిశీలించాకే రెన్యువల్ చేస్తారు. రెన్యువల్స్ కోసం చేసే తనిఖీల్లోనే గోల్‌మాల్ జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతుండటంతో అవన్నీ సక్రమంగా ఉన్నాయని నివేదికలతో, వాటికి రెన్యువల్స్ రావడం ఆనవాయితీగా మారింది. లోపాలున్న నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌కు ఓ ఉన్నతాధికారి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నందునే ఎన్ని లోపాలున్నా.. ఎన్నో ఏళ్లుగా ఆ నర్సింగ్ విద్యాసంస్థలు నడుస్తున్నాయనే విమర్శలున్నాయి.

మునుగోడులో ఇతరులు మద్యం టెండర్లు వేయొద్దు

» ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
» ఫోన్లో సంభాషణ.. ఎమ్మెల్యే ఎక్స్ ఖాతాలో పోస్టు
» టెండరుదారులు ఎవరికీ భయపడకుండా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్‌శాఖ సూచన

నల్లగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): 'మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాలకు ఇతర నియోజకవర్గాలు, ఇతర జిల్లాలకు చెందిన వారు టెండర్లు వేయవద్దు. ఈ నియోజకవర్గంలో పర్మిట్‌రూములు, బెల్టుషాపులను ఎట్టిపరిస్థితుల్లోనూ నడవనీయం. నాకు పదవి కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యం. రాష్ట్రంలో ఎక్సైజ్ పాలసీని సమీక్షించి, ప్రజల ఆరోగ్యం దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాను' అని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఇదే విషయం గురించి పలువురు పార్టీ నేతలతో ఆయన ఫోన్లో మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆ సంభాషణను ఆయన ఎక్స్ ఖాతాలో మంగళవారం ఉదయం పోస్ట్ చేశారు. మద్యం దుకాణాల టెండర్లలో పాల్గొనే వ్యాపారులనుద్దేశించి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. సోమవారం ఇదే అంశాన్ని పేర్కొంటూ మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు నల్లగొండ జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం కూడా అందజేశారు. కాగా, మద్యం దుకాణాల టెండర్లలో పాల్గొనేవారు వారు ఎవరి ఒత్తిడికి లోనుకాకుండా నిర్భయంగా దరఖాస్తులు సమర్పించాలని నల్లగొండ జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా సిండికేట్ అయినా, తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడానికి కారణమైనా, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే చర్యలు చేసినవారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

18న గ్రూప్-2 అభ్యర్థులకు నియామక పత్రాలు

సీఎం రేవంత్ స్వయంగా అందిస్తారు: సీఎస్

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 18న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం శిల్పకళా వేదికలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రూప్-2 కింద మొత్తం 783 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, వీరికి సీఎం నియామక పత్రాలను అందజేస్తారని సీఎస్ తెలిపారు. వీరిలో 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలోకి అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, డీజీపీ శివధర్‌రెడ్డి తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఎమ్‌టీవీ మ్యూజిక్ ఛానల్ మూసివేత

సంగీత ప్రియుల్ని, ముఖ్యంగా యువతను విశేషంగా ఆకట్టుకున్న ప్రముఖ టీవీ ఛానల్ ఎమ్‌టీవీ ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. తమ సంస్థ ఎమ్‌టీవీ పారామౌంట్ గ్లోబల్ ద్వారా నలభయేళ్లకు పైగా సంగీత ప్రసారాలను అందించిన అనుబంధ ఛానళ్లను మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. 'ఎమ్‌టీవీ మ్యూజిక్', 'ఎమ్‌టీవీ 80స్', 'క్లబ్ ఎమ్‌టీవీ', 'ఎమ్‌టీవీ 90స్'. 'ఎమ్‌టీవీ లైవ్' సంగీత ఛానళ్లను మూసివేస్తున్నట్లు వెల్లడించింది. డిసెంబరు 31 తర్వాత ఆ ఛానళ్లు అందుబాటులో ఉండవని పేర్కొంది. అయితే, రియాలిటీ షోలను అందించే ఎమ్‌టీవీ హెచ్‌డీ మాత్రం యథావిధిగా కొనసాగుతుందని తెలిపింది. స్మార్ట్ ఫోన్ వచ్చాక ఈ ఛానళ్లకు ఆదరణ తగ్గడం, యూట్యూబ్, టిక్‌టాక్, స్పాటిఫై వంటి సంగీతం అందించే యాప్స్‌తో పోటీపడలేకపోవడం ఈ నిర్ణయానికి కారణం అని తెలుస్తోంది. అయితే, ఇటీవలే ఎమ్‌టీవీ పారామౌంట్ గ్లోబల్ సంస్థ, స్కై. డాన్స్ మీడియాతో విలీనమైంది. 1981లో అమెరికాలో ఎమ్‌టీవీని స్థాపించారు.



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. నయనతార కథానాయికగా నటిస్తున్నారు. వీటీవీ గణేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైమెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుస్మితా కొణిదెల నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు, టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ 'మీసాల పిల్ల' ప్రోమో సూపర్ హిట్టైంది. మంగళవారం పూర్తి పాటను విడుదల చేశారు మేకర్స్. ఇందులో మెగాస్టార్ వేసిన స్టైలిష్ స్టెప్పులు వింటేజ్ చిరును గుర్తుకు తెస్తున్నాయంటూ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. విజువల్స్ ఆకట్టుకున్నాయి. లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలిచింది. విజయ్ పోలాకి కొరియోగ్రఫీ అందించగా, భాస్కరభట్ల ఈ మెలోడీని రాశారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ ఆలపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి.

విజయం ఖాయం

- రాజేశ్ దండా, శివ బొమ్మక్



'గతేడాది దీపావళికి కిరణ్ అబ్బవరం 'క' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ఈ దీపావళికి అంతకు మించిన విజయాన్ని మా 'కె-ర్యాంప్' చిత్రం అందిస్తుంది' అని నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మక్ అన్నారు. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకుడు. ఈనెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాజేశ్, శివ మీడియాతో ముచ్చటించారు.' నాని చెప్పిన కథ కిరణ్‌కూ, నాకూ బాగా నచ్చింది. ఇందులో హీరో పాత్ర పేరు కుమార్. తొలుత 'కుమార్ ర్యాంప్' అనే టైటిల్ పెడదాం అనుకున్నాం. తర్వాత దాన్ని కుదించి 'కె - ర్యాంప్' అని పెట్టాం. టైటిల్ బూతు అర్థం ధ్వనించేలా ఉందంటే అది చూసేవారి దృష్టికోణాన్ని బట్టే ఉంటుంది. మా హీరో, దర్శకుడు ఇద్దరూ ముందస్తుగా సన్నద్ధమై ఉండడంతో చాలా తక్కువ సమయంలో సినిమా చిత్రీకరణ పూర్తి చేసి, విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.



కబడ్డీ నేపథ్యంలో..

తమిళ హీరో విక్రమ్ తనయుడు విక్రమ్ ధృవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'బైసన్'. దర్శకుడు పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మించాయి. మారి సెల్వరాజ్ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఈనెల 24న జగదంబే ఫిల్మ్స్ పతాకంపై నిర్మాత బాలాజీ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. హీరో రానా 'బైసన్' చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. 1990 నాటి బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో కబడ్డీ క్రీడ కథాంశంతో తెరకెక్కిన చిత్రమిదని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.

సరికొత్త అనుభూతిని ఇస్తుంది


సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' చిత్రంలో నా పాత్ర తాలూకు వ్యక్తిత్వం ప్రేక్షకులను షాక్‌కు గురి చేస్తుంది. తన ఆలోచనలు విప్లవాత్మకంగా ఉంటాయి. కచ్చితంగా నా పాత్ర ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ఇదొక ప్రేమకథా చిత్రమే అయినా ఈ సినిమాలో 80 శాతం సన్నివేశాలు కొత్తగా ఉంటాయి. గతంలో మీరు ఏ సినిమాలోనూ చూసుండరు" అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. ఆయన కథానాయకుడిగా నీరజ కోన దర్శకత్వం వహించిన చిత్రమిది. పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సిద్ధు మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- టిల్లూకు పూర్తి భిన్నంగా సాగే పాత్రను ఈ చిత్రంతో చేశాను. ఈ కాలంలో కథ కన్నా పాత్ర చిత్రణ కొత్తగా ఉంటేనే ప్రేక్షకులకు వినోదం ఇస్తోంది. అందుకే ఆ దిశగా చాలా కసరత్తు చేశాం. ఈ సినిమా రిలీజయ్యాక ఈ తరహా చిత్రాలతో ఒక ప్రత్యేకమైన జానర్ ఏర్పడుతుందేమో అనిపిస్తోంది.
- దర్శకురాలు చెప్పిన పాయింట్ కొత్తగా ఉండడంతో నేను ఈ సినిమా అంగీకరించాను. జీవితం, ప్రేమలోని కోణాలను సరికొత్తగా పరిచయం చేస్తుంది. కామెడీ ఉంది. ప్రేమ, జీవితం గురించి వచ్చే లోతైన సంభాషణలు గుర్తుండిపోతాయి.
- ద్వితీయార్థంలో రాశీ ఖన్నా పాత్ర ఇచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. జ్ఞానశేఖర్ గారి విజువల్స్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. తమన్ అద్భుతమైన నేపథ్య సంగీతం ఇచ్చారు. ఈ సినిమా సక్సెస్ అయితే అందులో సింహభాగం ఎడిటర్ నవీన్ నూలీకే దక్కుతుంది. విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ గారితో నాకు మంచి అనుబంధం ఉంది. నాకు చాలా స్వేచ్ఛ ఇస్తారు. దేనికీ వెనుకడుగు వేయరు. మంచి కథ కుదిరితే రవితేజ గారితో ఓ చిత్రం చేయాలనుంది.

తొలి గంటలోనే..



రెండో టెస్టులో విండీస్‌పై భారత్ ఘన విజయం

రాహుల్ అజేయ అర్ధసెంచరీ ● 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

న్యూఢిల్లీ: వెస్టిండీస్‌పై తమ ఆధిపత్యాన్ని భారత జట్టు మరోసారి చాటుకుంది. నాలుగో రోజే ఫలితం తేలిపోయిన రెండో టెస్టులో మంగళవారం గిల్ సేన ఏడు వికెట్ల తేడాతో తమ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేసింది. దీంతోపాటు ఈ రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అలాగే వరల్డ్ టెస్టు చాంపియన్ షిప్‌లో భాగంగా 12 పాయింట్లను ఖాతాలో వేసుకుని, పట్టికలో ఆసీస్, శ్రీలంక తర్వాత భారత్ మూడో స్థానంలో నిలిచింది. మరోవైపు విండీస్‌పై భారత్‌కిది రికార్డు స్థాయిలో వరుసగా పదో టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 121 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 35.2 ఓవర్లలో 124/3 స్కోరుతో గెలిచింది. కేఎల్ రాహుల్ (58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించాడు. ఛేజ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అయితే ఫాలోఆన్ ఆడినప్పటికీ విండీస్ చూపిన తెగువ క్రీడాభిమానులను ఆకట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 518/5 స్కోరు వద్ద డిక్లేర్ చేయగా.. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248, ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 390 రన్స్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా జడేజా నిలిచారు.


గిల్, రాహుల్

17.2 ఓవర్లలోనే..: 63/1 స్కోరుతో నిలిచిన భారత్ ఆఖరి రోజు 17.2 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది. విజయానికి మరో 58 పరుగుల కోసం బరిలోకి దిగగా క్రీజులో ఉన్న రాహుల్, సుదర్శన్ ఆటను పూర్తి చేస్తారని అంతా భావించినా.. విండీస్ బౌలర్లు మరో రెండు వికెట్లను పడగొట్టగలిగారు. పియెర్ ఓవర్‌లో రాహుల్ 6,4తో వేగం చూపినా.. తర్వాతి ఓవర్‌లోనే సుదర్శన్‌ను ఛేజ్ అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక వేగంగా మ్యాచ్‌ను ముగించే క్రమంలో గిల్ 33వ ఓవర్‌లో 6,4 బాదినప్పటికీ అదే ఓవర్‌లో ఛేజ్‌కే దొరికిపోయాడు. కానీ ఆ తర్వాత మరో 14 బంతుల్లోనే రాహుల్, జురెల్ (6 నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్.
వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 248.
వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: 390.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఫిలిప్ (బి) వారికన్ 8, రాహుల్ (నాటౌట్) 58, సాయి సుదర్శన్ (సి) హోప్ (బి) ఛేజ్ 39, గిల్ (సి) గ్రీవ్స్ (బి) ఛేజ్ 13, జురెల్ (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 35.2 ఓవర్లలో 124/3; వికెట్ల పతనం:** 1-9, 2-88, 3-108. **బౌలింగ్:** సీల్స్ 3-0-14-0; వారికన్ 15.2-4-39-1, పియెర్ 8-0-35-0, ఛేజ్ 9-2-36-2.

1 ఒకే జట్టు (వెస్టిండీస్)పై వరుసగా ఎక్కువ టెస్టు సిరీస్ (10) విజయాలు సాధించిన జట్టుగా భారత్. దక్షిణాఫ్రికాతో (విండీస్‌పై 10) సంయుక్తంగా నిలిచింది. అలాగే విండీస్‌పై భారత్‌కిది రికార్డు స్థాయిలో వరుసగా 27వ టెస్టు విజయం.

3 స్వదేశంలో ఎక్కువ (122) టెస్టు మ్యాచ్‌లు గెలిచిన మూడో జట్టుగా భారత్. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) ముందున్నాయి.

పిచ్‌పై భారత్ అసంతృప్తి

భారత జట్టు రెండో టెస్టులో గెలిచినప్పటికీ అరుణ్ జైట్లీ స్టేడియం పిచ్‌పై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'స్పిన్నర్లు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తారని అందరూ చెబుతుంటారు. కానీ టీమ్‌లో ఇద్దరు అద్భుత పేసర్లు ఉన్నప్పుడు వారికి కూడా పిచ్‌పై సమాన అవకాశం లభించాలి కదా' అని కోచ్ గంభీర్ అన్నాడు.

దేశవాళీలు ఆడడం ఉత్తమం


కోచ్ గంభీర్

రాణాపై ట్రోలింగ్ సిగ్గుచేటు

న్యూఢిల్లీ: రంజీలు ఆడాలని టెస్ట్ స్పెషలిస్ట్‌లకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సలహా ఇచ్చాడు. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ నేపథ్యంలో బెంగళూరులోని సీవోఈలో స్కిల్ ట్రైనింగ్‌కు వెళ్లేకంటే.. ఆయా రాష్ట్రాల తరఫున రంజీలు ఆడితే మంచి మ్యాచ్ ప్రాక్టీస్ లభిస్తుందని అభిప్రాయపడ్డాడు. వచ్చే నెల 9న బ్రిస్బేన్‌లో భారత్ చివరి టీ20 ఆడనుండగా.. 14న కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేశారు. ఇంత తక్కువ సమయంలో ఒక ఫార్మాట్ నుంచి మరో ఫార్మాట్‌కు మారడం కొంత కష్టమైన విషయమేనని టెస్ట్ మ్యాచ్ ముగిసిన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో గౌతీ అన్నాడు. ఇక, యంగ్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు 2027 వరల్డ్ కప్ ఆడతారా? అని ఎదురైన ప్రశ్నకు ఇప్పుడే ఏమీ చెప్పలేమని గౌతీ సమాధానమిచ్చాడు. పేసర్ హర్షిత్ రాణా ఎంపికను ప్రశ్నించిన మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్‌కి కౌంటర్ ఇచ్చాడు. 'యూట్యూబ్ చానెల్ నడుపుతున్న ఓ వ్యక్తి 23 ఏళ్ల కుర్రాడిని టార్గెట్ చేయడం సిగ్గుచేటు. నన్ను టార్గెట్ చేయండి ఎదుర్కొంటా. తన ప్రతిభతోనే జట్టులో స్థానం సంపాదించిన రాణాను గేలి చేయడం అన్యాయమ'ని గౌతీ అన్నాడు.

భారత పారా త్రోబాల్ కెప్టెన్‌గా మహేష్



శామీర్‌పేట (ఆంధ్రజ్యోతి): భారత పారా త్రోబాల్ కెప్టెన్‌గా దీరవత్ మహేష్ నియమితుడయ్యాడు. మేడ్చల్ జిల్లాలోని లింగాపూర్ తండా.. మహేష్ స్వస్థలం. శ్రీలంకలోని రత్నపురాలో వచ్చే డిసెంబరు 6వ తేదీ నుంచి జరిగే దక్షిణాసియా పారా త్రోబాల్ పోటీల్లో భారత జట్టుకు మహేష్ సారథ్యం వహించనున్నాడు.

శ్రీలంక-కివీస్ మ్యాచ్ రద్దు

మహిళల వన్డే వరల్డ్‌కప్

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
ఇంగ్లండ్ X పాకిస్తాన్

కొలంబో: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో శ్రీలంక-న్యూజిలాండ్ జట్ల మధ్య మంగళవారం నాటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. శ్రీలంక ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండు వర్షంతోనే రద్దు కావడం గమనార్హం. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ఇన్నింగ్స్‌కు ఎలాంటి ఆటంకం ఎదురుకాలేదు. అలాగే టాపార్డర్ మెరుగ్గా రాణించడంతో 50 ఓవర్లలో 6 వికెట్లకు 258 పరుగులు సాధించింది. నీలాక్షి డిసిల్వా (55 నాటౌట్), ఓపెనర్ చమరి ఆటపట్టు (53) అర్ధసెంచరీలు సాధించగా.. హాసిని (44), విష్మి (42) సహకారం అందించారు. తొలి వికెట్‌కు చమరి, విష్మి 101 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడం విశేషం. అలాగే నీలాక్షి తమ జట్టు తరఫున ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (26 బంతుల్లో) పూర్తి చేసింది. సోఫీ డివైన్‌కు మూడు, బ్రీ లింగ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం కివీస్ ఇన్నింగ్స్ సమయానికి వర్షం ప్రారంభమైంది. మధ్యలో కాసేపు తెరిపినిచ్చినా ఫలితం లేకపోయింది. ఇక దాదాపు మూడు గంటల నిరీక్షణ తర్వాత రాత్రి 9.15 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు.

సంక్షిప్త స్కోర్లు: శ్రీలంక: 50 ఓవర్లలో 258/6 (నీలాక్షి 55, చమరి 53, హాసిని 44, విష్మి 42; డివైన్ 3/54, లింగ్ 2/39).

దీప్తి ఖాతాలో రెండో స్వర్ణం



పర్వతగిరి (వరంగల్-ఆంధ్రజ్యోతి): వరల్డ్ పారా వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి జీవాంజి దీప్తి రెండో స్వర్ణం సాధించింది. మంగళవారం జరిగిన 200 మీటర్ల పరుగులో దీప్తి 24.62 సెకన్లలో సరికొత్త ప్రపంచ రికార్డు టైమింగ్‌తో రేసును పూర్తి పసిడి పతకం కొల్లగొట్టింది. ఇదే పోటీల్లో దీప్తి 400 మీటర్ల పరుగులోను స్వర్ణం సాధించడం తెలిసిందే. వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, కల్లెడ గ్రామం దీప్తి స్వస్థలం.

ఆనంది, శేషుకు కాంస్యాలు


ఆనంది

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగు క్రీడాకారులు దుడ్డు శేషు, నల్లవెల్లి ఆనంది కాంస్య పతకాలు కొల్లగొట్టారు. భువనేశ్వర్‌లోని కళింగలో నాలుగు రోజులక్రితం మొదలైన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు అండర్-18 విభాగం 200 మీటర్ల పరుగులో విశాఖపట్నం అథ్లెట్ శేషు 22.09 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానం దక్కించుకున్నాడు. అండర్-16 బాలికల 600 మీటర్ల పరుగులో పెద్దపల్లి అమ్మాయి ఆనంది ఒక నిమిషం 34.48 సెకన్లలో రేసును పూర్తి చేసి, తృతీయ స్థానంలో నిలిచింది.

విరాట్ వచ్చేశాడు



న్యూఢిల్లీ: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ నాలుగు నెలల విరామానంతరం భారత్ తిరిగొచ్చాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టును విజేతగా నిలబెట్టిన విరాట్.. ఆ లీగ్ ముగిసిన వెంటనే భార్య అనుష్క, ఇద్దరు పిల్లలతో కలిసి లండన్ వెళ్లిపోయాడు. ఇన్నాళ్లూ కుటుంబంతో కలిసి అక్కడే ఉన్న కోహ్లీ, ఈనెల 19 నుంచి ఆస్ట్రేలియాలో జరిగే వన్డే సిరీస్‌కు జట్టుతో కలిసి వెళ్లేందుకు మంగళవారం ఉదయం ఢిల్లీ చేరుకున్నాడు. రోహిత్, మరికొందరు ఆటగాళ్లతో కలిసి విరాట్ బుధవారం ఢిల్లీ నుంచి పెర్త్ వెళ్లనున్నాడు. కాగా, రెండు బృందాలుగా టీమిండియా సభ్యులు ఆస్ట్రేలియా వెళ్లనున్నట్టు బీసీసీఐ అధికారులు వెల్లడించారు.

ఇండో-పాక్ పోరు డ్రా

● జోహర్ కప్ జూనియర్ హాకీ



జోహర్ బహ్రూ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జోహర్ జూనియర్ కప్‌లో పాకిస్థాన్‌పై గెలిచే అవకాశాన్ని భారత హాకీ జట్టు చేజార్చుకొంది. మంగళవారం ఇండో-పాక్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్ 3-3తో డ్రాగా ముగిసింది. అర్జీత్ సింగ్ (43వ నిమిషం), సౌరభ్ (48వ), మన్‌మీత్ (53వ)తలో గోల్ సాధించగా.. పాక్ తరఫున హన్నన్ (5వ), సుఫియాన్ (39వ, 55వ) గోల్స్ చేశారు. అయితే, **మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరుజట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోవడం విశేషం.**

టాప్‌సీడ్.. గుకేశ్

ఫిడే వరల్డ్ కప్ సీడింగ్స్

అర్జున్‌కు 2, ప్రజ్ఞానందకు 3

న్యూఢిల్లీ: గోవాలో ఈనెల 30 నుంచి జరిగే ఫిడే ప్రపంచ కప్‌లో పోటీపడే ఆటగాళ్ల సీడింగ్స్ ఖరారయ్యాయి. ప్రపంచ చాంపియన్ గుకేశ్‌కు టాప్ సీడింగ్ దక్కగా.. తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి రెండో సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇక, ప్రజ్ఞానంద మూడో సీడ్, అనీష్ గిరి (నెదర్లాండ్స్) నాలుగో సీడ్, వెస్లీ సో (అమెరికా) ఐదో సీడ్‌గా పోటీపడనున్నారు. ఈ మెగా ఈవెంట్‌లో టాప్-3లో నిలిచిన క్రీడాకారులు వచ్చే ఏడాది జరిగే ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తారు.

పారిశ్రామికంలోనూ యువ సత్తా

- అండర్ 35 జాబితాలో 155 మంది
- రూ.39 లక్షల కోట్ల సంపద సృష్టి
- 7.67 లక్షల ఉద్యోగాల కల్పన
- అవెండాస్ వెల్త్- హురున్ ఇండియా వెల్లడి



న్యూఢిల్లీ: దేశ పారిశ్రామిక రంగంలోనూ యువత సత్తా చాటుతోంది. వినూత్న వ్యాపారాలతో తనదైన ముద్ర వేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నాటికి 155 మంది యువత వినూత్న వ్యాపారాలతో 44,300 కోట్ల డాలర్ల (సుమారు రూ.39 లక్షల కోట్లు) సంపద సృష్టించింది. ప్రస్తుత మన జీడీపీలో ఇది దాదాపు 10 శాతానికి సమానం. నాలుగు పదుల వయసు కూడా నిండకుండానే వీరు ఈ సంపద సృష్టించినట్టు మంగళవారం వెలువడిన 'ది అవెండాస్ వెల్త్-హురున్ ఇండియా అండర్ 35 లిస్ట్ 2025' నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో రేజెన్ సోలార్‌కు చెందిన హర్దిక్ కోటియా అగ్రస్థానంలో ఉండగా వికాస్ గోయల్ (కుకు ఎఫ్ఎం), మిను మార్గరెట్ (బ్లిస్ క్లబ్), రితేష్ అగర్వాల్ (ఓయో, ప్రిజమ్) ఉన్నారు. అలాగే ఇషా అంబానీ (రిలయన్స్ రిటైల్), కావ్య కళానిధి మారన్ (సన్ టీవీ నెట్‌వర్క్), రితిక మోహన్ (గరుడ ఏరోస్పేస్) కూడా ఈ జాబితాలో ఉన్నారు. కాగా హైదరాబాద్‌కు చెందిన ఈక్వల్ వ్యవస్థాపకుడు కేశవ్ రెడ్డి, అవంతీ ఫీడ్స్‌కు చెందిన అల్లూరి వెంకట సంజీవ్, అశీష్ గోయెంకాలతో పాటు మరో ముగ్గురు యువ పారిశ్రామికవేత్తలూ ఉన్నారు. ఈ యువ పారిశ్రామిక దిగ్గజాలందరూ సంపదతో పాటు వ్యవస్థలనూ నిర్మిస్తున్నారని హురున్ ఇండియా నివేదిక కితాబిచ్చింది.,

ఎంపిక ఇలా: ఈ జాబితా ఎంపిక కోసం కొన్ని నిర్దిష్ట ప్రామాణికాలు పాటించారు. తొలి తరం పారిశ్రామికవేత్తలైతే వారు సృష్టించిన కనీస సంపద విలువ ఐదు కోట్ల డాలర్లకు మించి, అదే వారసత్వ కుటుంబ వ్యాపారమైతే 10 కోట్ల డాలర్లకు మించి ఉండాలని ప్రామాణికంగా నిర్ణయించారు. మరోవైపు సంపద సృష్టితో పాటు ఈ యువ పారిశ్రామికవేత్తలు ఉద్యోగాల కల్పనలోనూ ముందున్నారు. ప్రస్తుతం వీరి కంపెనీల్లో 7.67 లక్షల మంది పనిచేస్తున్నట్టు నివేదిక తెలిపింది. ఇందులో ఇషా అంబానీ (33) నేతృత్వంలోని రిలయన్స్ రిటైల్‌లో అత్యధికంగా 2,47,782 మంది పని చేస్తున్నారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియోలోనూ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నారు.

నివేదిక ఇతర ప్రధాన అంశాలు

- జాబితాలోని 155 మంది 76 శాతం మంది తొలి తరం పారిశ్రామికవేత్తలు
- మొత్తం జాబితాలో 15 మంది యువతులకు చోటు
- 54 యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో బెంగళూరు అగ్రస్థానం
- ఆరుగురు యువ పారిశ్రామికవేత్తలతో హైదరాబాద్‌కు ఐదో స్థానం
- ఇప్పటి వరకు 1,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.68 లక్షల కోట్లు) నిధులు సమీకరించిన యువ పారిశ్రామికవేత్తలు
- ఆర్థిక సేవల రంగం నుంచి ఎక్కువగా యువ (20) పారిశ్రామిక దిగ్గజాలు
- తరువాతి స్థానాల్లో సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్స్ అండ్ సర్వీసులు, ఎడ్యుకేషన్, ట్రైనింగ్ వ్యాపారాలు

హిందుస్థాన్ షిప్‌యార్డ్‌కు మినీ నవరత్న హోదా

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్ఎల్)కు మంగళవారం ప్రతిష్ఠాత్మకమైన మినీ నవరత్న హోదా లభించింది. 1941లో ఏర్పాటైన షిప్‌యార్డు భారత నౌకాదళానికి అవసరమైన నౌకలతో పాటు వాణిజ్య నౌకలను కూడా తయారుచేయడంలో అగ్రస్థానంలో నిలిచింది. అయితే ఒకానొక దశలో ప్రైవేట్ షిప్‌యార్డ్‌ల పోటీని తట్టుకొని ఆర్డర్లు సాధించలేక నష్టాల్లో కూరుకుపోయింది. ఆర్థికంగా నిలబెట్టడానికి, వర్క్ ఆర్డర్లు అందించడానికి వీలుగా 2010లో రక్షణ మంత్రిత్వ శాఖకు సంస్థను బదిలీ చేశారు. కేంద్రం మద్దతు లభించినా ఐదేళ్లు అవే సమస్యలు వెంటాడాయి. ఆ తర్వాత లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయడంతో 2015 నుంచి లాభాల బాట పట్టింది. .

మిధానికి రూ.306 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధానీ) తాజాగా రూ.306 కోట్ల ఆర్డర్ సంపాదించింది. దీంతో చేతిలో ఉన్న ఆర్డర్ల విలువ రూ.2,212 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. అయితే ఈ ఆర్డర్ ఏ కంపెనీ నుంచి లభించిందనే విషయాన్ని మిధానీ వెల్లడించలేదు. ఈ ఆర్థిక సంవత్సరం నౌకా, వైమానిక రంగాల నుంచి మరిన్ని ఆర్డర్లు లభించే అవకాశం ఉందని కంపెనీ భావిస్తోంది.

బిజినెస్


దిగొచ్చిన టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: ఆహార, తయారీ వస్తువుల ధరలు తగ్గడంతో సెప్టెంబరు నెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 0.13 శాతానికి దిగి వచ్చింది. ఆగస్టులో ఇది 0.52% ఉండగా గత ఏడాది సెప్టెంబరులో 1.91% ఉంది. కూరగాయల ధరలు భారీగా తగ్గడంతో ఆహార వస్తువుల విభాగంలో ప్రతి ద్రవ్యోల్బణం ఆగస్టుతో పోల్చితే 3.06% నుంచి 5.22 శాతానికి చేరిందని డబ్ల్యూపీఐ డేటా తెలియచేస్తోంది. కూరగాయల ధరలైతే 24.41% తగ్గాయి. తయారీ వస్తువుల ధరలు 2.33%, ఇంధనం-పవర్ విభాగంలో ధరలు 2.58% తగ్గాయి. అయితే కీలక ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మాత్రం 31 నెలల గరిష్ఠ స్థాయి 1.9 శాతానికి చేరింది.

ఈ ఏడాది వృద్ధి 6.6% : ఐఎంఎఫ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన వృద్ధి అంచనాను 6.4% నుంచి 6.6 శాతానికి పెంచింది. అమెరికా విభిన్న వస్తువులపై సుంకాలు గణనీయంగా పెంచినప్పటికీ తొలి త్రైమాసికంలో ప్రైవేట్ వినియోగం ప్రభావంతో సాధించిన బలమైన వృద్ధి ఏడాది మొత్తానికి ఆసరాగా నిలుస్తుందని తాజా నివేదికలో స్పష్టం చేసింది. 2025-26 సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8% బలమైన వృద్ధిని నమోదు చేసిన విషయం విదితమే. ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన జీఎస్‌టీ సంస్కరణలతో దేశీయ డిమాండ్ మరింతగా పెరుగుతుందని, అమెరికా టారిఫ్‌ల ప్రతికూల ప్రభావాన్ని ఇది భర్తీ చేస్తుందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	550
వరంగల్	517	గోదావరి	530
చిత్తూరు	563	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	119
వరంగల్	105	గుంటూరు	114
కరీంనగర్	105	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	99
కర్నూలు	105	నెల్లూరు	104
విశాఖపట్నం	127	అనంతపురం	104
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,28,350 ▲	1,17,650 ▲	1,98,000 ▲
విజయవాడ	1,28,000 ▲	1,22,000 ▲	1,79,000 ▼
విశాఖపట్నం	1,29,260 ▲	1,14,950 ▲	2,06,000 ▲
రాజమండ్రి	1,28,350 ▲	1,17,650 ▲	1,95,000 ▲
ప్రొద్దుటూరు	1,31,000 ▲	1,20,520 ▲	1,85,000 ▲
ముంబై	1,26,152 ▲	1,15,555 ▲	1,78,100 ▲

టెక్ మహీంద్రా లాభం రూ.1,195 కోట్లు

- క్యూ2లో 4.5 శాతం తగ్గుదల
- రూ.13,995 కోట్లకు పెరిగిన ఆదాయం
- ఒక్కో షేరుకు రూ.15 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) టెక్ మహీంద్రా నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4.5 శాతం తగ్గి రూ.1,194.5 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి కంపెనీ రూ.1,250 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా, ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో గడించిన రూ.1,141 కోట్ల లాభంతో పోలిస్తే 4.7 శాతం వృద్ధి నమోదైంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.1 శాతం పెరిగి రూ.13,995 కోట్లకు చేరింది. క్యూ1తో పోలిస్తే రెవెన్యూ 4.8 శాతం పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.15 (300 శాతం) మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు అర్హులైన షేర్‌హోల్డర్లను ఎంపిక చేసేందుకు ఈ నెల 21 రికార్డు తేదీగా నిర్ణయించింది. వచ్చే నెల 12 లేదా ఆ లోపు డివిడెండ్ చెల్లించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. మరిన్ని విషయాలు..

- ఆర్థిక అనిశ్చితుల కారణంగా ఈ క్యూ2లో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయం 2 శాతానికి పైగా తగ్గిందని, కంపెనీకి కీలకమైన టెలికాం రంగం నుంచి రాబడి 2.5 శాతం తగ్గిందని టెక్ మహీంద్రా ఎండీ, సీఈఓ మోహిత్ జోషి తెలిపారు. మాన్యుఫాక్చరింగ్, బీఎఫ్ఎస్ఐ రంగాల ఆదాయం మాత్రం వరుసగా 5.2 శాతం, 6.5 శాతం పెరిగిందన్నారు.
- గడిచిన త్రైమాసికంలో 81.6 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్ దక్కించుకున్నట్లు, వార్షిక ప్రాతిపదికన డీల్స్ విలువ 57 శాతం పెరిగిందని కంపెనీ తెలిపింది.
- గత త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,559 తగ్గి 1.52 లక్షలకు పరిమితమైంది.

హెచ్1బీ వీసా ఫీజు పెంపు ప్రభావం పరిమితమే..

అమెరికా ప్రభుత్వం హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం వల్ల కంపెనీపై ప్రభావం చాలా పరిమితంగా ఉండనుందని టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి అన్నారు. అమెరికాలో కంపెనీ కోసం పనిచేస్తున్న వారిలో కేవలం ఒక శాతమే హెచ్1బీ వీసాదారులని ఆయన తెలిపారు. కాగా కంపెనీకి అమెరికాయే అతిపెద్ద మార్కెట్. సంస్థ ఆదాయంలో 45 శాతం ఈ మార్కెట్ నుంచే సమకూరుతోంది.

రెండో రోజూ నష్టాలే..

సెన్సెక్స్ 297 పాయింట్లు పతనం

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల బలహీన ట్రేడింగ్ ట్రెండ్, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా దేశీయ స్టాక్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. మెటల్, ఆటో, ఫార్మా షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ మంగళవారం 297.07 పాయింట్లు కోల్పోయి 82,029.98 వద్దకు జారుకుంది. ఒక దశలో సూచీ 545 పాయింట్లు పతనమై 82,000 దిగువకు పడిపోయినప్పటికీ, ఆఖర్లో మళ్లీ కాస్త కోలుకుంది. నిఫ్టీ 81.85 పాయింట్ల నష్టంతో 25,145.50 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి.

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవిత కాల కనిష్ఠానికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి మళ్లీ రూ.88.81 వద్ద ముగిసింది. డాలర్ బలపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు కారణం.

ఎల్‌జీ బంపర్ లిస్టింగ్

- తొలిరోజే ఇన్వెస్టర్లకు 50% లాభం
- రూ.1.14 లక్షల కోట్లకు కంపెనీ మార్కెట్ విలువ

న్యూఢిల్లీ: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు భారీ స్పందన లభించింది. గత వారం ఐపీఓ ముగించుకున్న ఈ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం.. తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.1,140తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 50.43 శాతం లాభంతో రూ.1,715 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. ఒక దశలో 52.31 శాతం వృద్ధితో రూ.1,736.40 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి షేరు ధర 48.23 శాతం లాభంతో రూ.1,689.90 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,14,671.81 కోట్లకు చేరింది.

టాటా మోటార్స్ షేరు 40% పతనమైందా..?

వ్యాపార విభజనలో భాగంగా షేర్ల ధరను సర్దుబాటు చేసిన సంస్థ

టాటా మోటార్స్ షేరు ధర సోమవారం రూ.660.75 వద్ద ముగిసింది. మంగళవారం ఉదయం ఈ షేరు ట్రేడింగ్ రూ.399 వద్ద ఆరంభమైంది. అంటే, ధర అమాంతం 40 శాతం తగ్గింది. ఎందుకంటే, టాటా మోటార్స్ ప్యాసింజర్ (పీవీ), వాణిజ్య వాహన (సీవీ) వ్యాపారాలను రెండు ప్రత్యేక లిస్టెడ్ కంపెనీలుగా విభజించింది. ఈ నెల 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. తదనుగుణంగా కంపెనీ షేర్లలో సర్దుబాటు మంగళవారం చోటు చేసుకుంది. ఈ సర్దుబాటులో భాగంగా ప్యాసింజర్ వాహన వ్యాపారంతో కూడిన టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్ లిమిటెడ్ (టీఎంపీవీఎల్) షేరు ధరను రూ.400గా గంటపాటు నిర్వహించిన ప్రత్యేక ప్రీ-మార్కెట్ సెషన్ ద్వారా నిర్ణయించారు. దాంతో రూ.399 వద్ద ట్రేడింగ్ ఆరంభించిన ఈ షేరు ఒక దశలో రూ.421 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి రూ.395.50 వద్ద ముగిసింది. కాగా వ్యాపార విభజన ప్రణాళికలో భాగంగా, మంగళవారం నాటికి టాటా మోటార్స్ షేర్లు కలిగిన ఇన్వెస్టర్లకు. తాము కలిగి ఉన్న ఒక్కో షేరుకు గాను ఒక టీఎంఎల్‌సీవీ షేరును సంస్థ కేటాయించనుంది. తద్వారా రెండు లిస్టెడ్ కంపెనీల స్టాక్స్ లభించనున్నాయి. అయితే, టీఎంఎల్‌సీవీ షేర్లను లిస్ట్ చేసేందుకు మరో 4-6 వారాలు పట్టవచ్చు.


ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో మాగంటి సునీతకు బీ ఫాం అందజేస్తున్న కేసీఆర్

మాగంటి సునీతకు బీ ఫాం

» ఎన్నికల ఖర్చులకు రూ.40 లక్షల చెక్కు అందజేసిన కేసీఆర్

గజ్వేల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచేది బీఆర్ఎస్సేనని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ ఉందన్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీతకు మంగళవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. ఎన్నికల ఖర్చుల కోసం రూ.40 లక్షల చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పద్మారావుగౌడ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే బాస్కర్‌రావుతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రచారం నిర్వహిస్తున్న తీరుతెన్నులు, చేపట్టవలసిన కార్యక్రమాలపై సూచనలు చేయడంతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

అడ్డదారిలో గెలిచేందుకు దొంగ ఓట్ల నమోదు

» కిందిస్థాయి అధికారుల సహకారంతో అక్రమాలు: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అడ్డదారిలో గెలిచేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని.. అందుకోసం దొంగ ఓట్ల నమోదుకు తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపును ఆపలేదని, జూబ్లీహిల్స్‌లో మాగంటి సునీత గెలుపు తథ్యమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక్కొక్కరికి రెండు, మూడు ఓటరు కార్డులు ఉన్నాయని, ఇతర నియోజకవర్గాల్లోనూ ఓట్లున్నాయని ఆరోపించారు. ఈ వివరాలను ఇప్పటికే ఎన్నికల సంఘానికి అందించామన్నారు. ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో 2023 ఎన్నికలప్పుడు 3.75 లక్షల ఓట్లుండగా.. అందులోని 12వేల డూప్లికేట్ ఓట్లను తొలగించినా కూడా ఇప్పుడు 3.98 లక్షలకు పెరగడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి, దొంగ ఓట్లపై సంపూర్ణ దర్యాప్తు జరపాలన్నారు. కాగా, కాంగ్రెస్ స్థానిక నేత అలీ మస్కతి, టీడీపీ మహిళా నేత షకీలారెడ్డి మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు.

త్వరలో జూబ్లీహిల్స్‌లో పోటీపై నిర్ణయం: ఒవైసీ

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి పోటీ చేసే విషయమై ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌ను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం క్రియాశీలంగా పని చేస్తుందని, అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. మంగళవారం ఓ టీవీ చానెల్ కిచ్చిన ఇంటర్వ్యూలో బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో మండి పడ్డారు.

అలైన్‌మెంట్ మార్చకపోతే కాంగ్రెస్‌ను ఓడిస్తాం

» 200 నామినేషన్లు వేస్తాం: ట్రిపుల్ ఆర్ భూబాధితులు

వికారాబాద్, తలకొండపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా మీదుగా ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) కొత్త అలైన్‌మెంట్ వెంటనే మార్చకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని భూబాధిత రైతుల జేఏసీ హెచ్చరించింది. ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్నవికారాబాద్, నవాబ్‌పేట్, మోమిన్‌పేట్, పూడూరు మండలాల రైతులు మంగళవారం నవాబ్‌పేట మండలం చించల్‌పేట్ శివారులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జిల్లా భూ బాధితుల జేఏసీని ఎన్నుకుని తమ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించారు. జేఏసీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, నవాబ్‌పేట మండల జేఏసీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పేద రైతులకు నష్టం కలిగించే ట్రిపుల్ ఆర్ కొత్త అలైన్‌మెంట్‌ను మార్చి పాత అలైన్‌మెంట్‌నే ఖరారు చేయాలని, లేదంటే 200 మంది వరకు బాధిత రైతులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్లు వేసి పోటీలో ఉంటారని స్పష్టం చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న పాత అలైన్‌మెంట్‌ను మార్చడం వెనక ఎవరున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చకపోతే పోరాటం ఉధృతం చేస్తామని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ తడాఖా చూపిస్తామని, కాంగ్రెస్ అభ్యర్థిని ఓడిస్తామని వారు హెచ్చరించారు. కాగా ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు సీపీఎం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఆర్థిక నిర్వహణలో సర్కార్ విఫలం: హరీశ్

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరోగమనం వైపు పయనిస్తోందని, అనాలోచిత విధానాల కారణంగా.. రాష్ట్ర ఆర్థిక నిర్వహణలో రేవంత్ సర్కార్ విఫలం అయిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, మూడునెలలు నెగిటివ్ ద్రవ్యోల్బణం వారిపాలన వైఫల్యానికి నిదర్శనమని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం 1.54శాతం నమోదైతే, తెలంగాణలో నెగిటివ్ ద్రవ్యోల్బణం నమోదవుతుండటం మందగించిన ఆర్థిక పతనానికి సంకేతమన్నారు. బుల్డోజర్ విధానాలు, ప్రతీకార రాజకీయాలు చతికిలపడిపోతున్న రాష్ట్ర ఆర్థిక వృద్ధిపై రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా దృష్టిసారించాలని సూచించారు.

ప్యాచ్ వర్కుల బిల్లులైనా ఇవ్వండి: బిల్డర్ల సంఘం

రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో నిర్వహించిన ప్యాచ్ (చిన్న చిన్న పనులు) వర్కుల బిల్లులైనా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కోరింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి మంగళవారం నాడు ఓ లేఖ రాసింది. ఆర్ అండ్ బీ పరిధిలో చిన్న చిన్న కాంట్రాక్టర్లు కలిసి దాదాపు రూ. 140 కోట్ల విలువ చేసే పనులు చేశారని, కానీ రెండేళ్లుగా వారికి ఒక్క బిల్లు కూడా మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డీవీఎన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. రూ. 140 కోట్లకు సంబంధించి దాదాపు 3 వేల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు.

మేడారంలో సమీక్షపై నో కామెంట్: సురేఖ

వరంగల్‌సిటీ/హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మేడారంలో జరిగిన మంత్రుల సమీక్షపై మాట్లాడేదేమీ లేదని, మంత్రులకు ఇతర కార్యక్రమాలుంటాయని దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన డీసీసీల నియామకంపై సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ పరిశీలకులు నవజ్యోతి పట్నాయక్‌తో పాటు మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడారంలో జరిగిన మంత్రుల సమీక్షకు ఆమె హాజరుకాకపోవడంపై విలేకరులు ప్రశ్నించగా.. మంత్రి కొండా సురేఖ పైవిధంగా స్పందించారు. మంత్రులు అన్నాక అనేక కార్యక్రమాలుంటాయని, అందుకే వెళ్లలేకపోయానన్నారు. తమ మధ్య ఎలాంటి వైరం లేదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుల నియామకం ఏఐసీసీ ఆధ్వర్యంలో పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు.

మంత్రి సురేఖ ఓఎస్డీ తొలగింపు

మంత్రి సురేఖ దగ్గర ఓఎస్డీగా పనిచేస్తున్న సుమంత్‌ను తొలగిస్తూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డులో ఓఎస్డీగా కాంట్రాక్టు పద్ధతిలో నియామకమైన సుమంత్‌ను డిప్యూటేషన్‌పై మంత్రి దగ్గర నియమించారు. ఆయన్ను ఆ పోస్టు నుంచి తొలగిస్తున్నట్టు బోర్డు సభ్య కార్యదర్శి గుగులోత్ రవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మేడారం పనుల టెండర్ల వ్యవహారంలో మంత్రుల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా ఓఎస్డీపై వేటు పడినట్లు చర్చ జరుగుతోంది.

రెండు రోజుల్లోనే 20 నామినేషన్లు

» నేడు బీఆర్ఎస్ అభ్యర్థి సునీత దాఖలు

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో నామినేషన్ల జాతర కొనసాగుతోంది. రెండు రోజుల్లోనే ఏకంగా 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో మెజార్టీ స్వతంత్ర అభ్యర్థులు, ఎన్నికల సంఘం గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులు ఉన్నారు. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీసర్‌కు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఆమె 19న భారీ ర్యాలీతో రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారని అనుచరులు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 17న నామినేషన్ వేయాలని నిర్ణయించుకున్నారు. ఇక బీజేపీ తమ అభ్యర్థిని నేడో, రేపో ఖరారు చేసే అవకాశం ఉంది.

64 దాటితే... బ్యాలెట్!

ఉప ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే నిరుద్యోగులు, రైతులు, రీజనల్ రింగ్ రోడ్డు భూ బాధితులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేస్తామని ప్రకటించారు. అభ్యర్థుల సంఖ్య గరిష్ఠంగా 64 దాటితే బ్యాలెట్ పత్రాలతో పోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. నామినేషన్లు దాఖలు చేయడానికి ఈనెల 21 వరకు గడువు ఉండడంతో, ఇంకా ఎన్ని నామినేషన్లు వస్తాయో వేచి చూడాలి.

ఎన్ని ఓట్ల తేడాతో ఓడిపోతారు?

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై రాజాసింగ్ మాటల తూటాలు



అఫ్జల్‌గంజ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మాటల తూటాలు పేల్చారు. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిజీ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మీరు ఎన్ని ఓట్ల తేడాతో ఓడిపోతారు? జూబ్లీ హిల్స్ ప్రజలు మిమ్మల్ని అడుగుతున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తారా? కాంగ్రెస్‌ను గెలిపిస్తారా..? అని సోషల్ మీడియాలో మిమ్మల్ని జనాలు అడుగుతున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. మీ గౌరవం ప్రమాదంలో ఉందా ?' అని రాజాసింగ్ వ్యాఖ్యలు చేశారు. 'భారీ ఓట్లతోని ఓడిపోతే కేంద్ర పెద్దలకు మల్లా మీ ముఖం ఎట్లా చూపెడతారు? కొద్దిగా ఆలోచన చేసినారా మా సారు. మీకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ప్రతి ఒక్క డివిజన్‌లో మేలు చేసే అలవాటు ఉన్నది. ఇవాళ మీ జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లోనే చాలామంది మీ మేలు కోసం ఎదురుచూస్తున్నారు. నా జిల్లాను సర్వనాశనం చేసి నన్ను బయటికి పంపించారు. మీరు కూడా ఏదో ఒకరోజు వెళ్తారు పక్కా' అంటూ కిషన్ రెడ్డిపై రాజాసింగ్ మరోసారి ఆరోపణలు చేశారు.

కన్నీటి మంటలు!

(మొదటిపేజీ తరువాయి)


కార్యకర్తల సమావేశంలో భర్తను తలుచుకుని కన్నీళ్లు పెడుతున్న సునీత(ఫైల్)

వివరిస్తూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని ఎత్తి చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల తన నివాసంలో జరిగిన సమావేశంలో పార్టీ నేతలకు సూచించారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ సెంటిమెంట్‌నే నమ్ముకుని ఎన్నికలకు దిగుతోందని, ఈ నేపథ్యంలో మాగంటి గోపీనాథ్‌పై, ఆయన కుటుంబ సభ్యులపై విమర్శలకు పోవద్దని అన్నారు. అయితే సోమవారం రహమత్‌నగర్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత సమావేశంలో మాగంటి సునీత తన భర్తను గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకున్న తీరు.. కాంగ్రెస్ నేతలను ఒక్కసారిగా ఉలిక్కిపడేట్లు చేసింది. దీంతో సునీతతో బీఆర్ఎస్ నాయకత్వం కన్నీళ్లు పెట్టిస్తోందంటూ మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రచారంలో వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోపిడీ చేశారని, మళ్లీ దోపిడీ చేయడానికి కన్నీళ్లను కూడా వదిలిపెట్టడంలేదని ఆరోపించారు. కన్నీళ్ల ద్వారా అధికారాన్ని మళ్లీ పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

సునీత అంటే సానుభూతి ఉన్నా..

సునీత అంటే తమకు సానుభూతి ఉందని, కానీ.. అందరి ముందూ ఆమె మైక్ పట్టుకుని ఏడవడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పదేళ్లలో ప్రజల సమస్యలను పరిష్కరించని బీఆర్ఎస్ వాళ్లు.. ఇవాళ మహిళను ఏడిపిస్తూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎమ్మెల్యే చనిపోతే ఉప ఎన్నికలో ఇతర పార్టీలు అభ్యర్థిని పెట్టేవి కావని, కానీ.. ఆ సంప్రదాయాన్ని తుంగలో తొక్కిందే బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తీవ్రంగా తప్పుబట్టారు. మాగంటి సునీత భావోద్వేగంపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు నీతిమాలిన మనుషులంటూ కేటీఆర్ మండిపడ్డారు. ఆమె ఆవేదనపై కూడా విమర్శలు చేస్తున్నవారు ఎంత సిగ్గులేనివారో సమాజం చూస్తోందన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సునీత భావోద్వేగానికి గురైతే.. దానిపై కూడా కాంగ్రెస్ నేతలు అవాకులు, చవాకులు పేలడం దారుణమన్నారు. ఒక మహిళగా, కుటుంబ పెద్దను కోల్పోయిన బాధ, ఆవేదన ఆమెకు ఉండదా? అని ప్రశ్నించారు. మాగంటి గోపీనాథ్ కుమార్తెపై కూడా అక్రమ ఎన్నికల కేసు పెట్టడం కాంగ్రెస్ పార్టీ నీతిలేని రాజకీయాలకు నిదర్శనమన్నారు.

మహిళ దుఃఖంపై విమర్శలా?

ఒక మహిళ దుఃఖంపైనా విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ మంత్రులను యావత్ మహిళా లోకం క్షమించదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. భర్తను కోల్పోయి తప్పనిసరి పరిస్థితుల్లో.. నమ్ముకున్న ప్రజల కోసం ప్రజా జీవితంలోకి వచ్చిన తమలాంటి వారిని ఆ వ్యాఖ్యలు ఎంతగానో బాధించాయన్నారు. రాష్ట్రంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సమాజానికి మంత్రులు ఇచ్చే సందేశం ఇదేనా? అని ప్రశ్నించారు. సునీతపై చేసిన వ్యాఖ్యలకు యావత్ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని 'ఎక్స్'లో ఆమె డిమాండ్ చేశారు. కమ్మ సామాజిక వర్గం మద్దతుతో మంత్రి అయిన తుమ్మల.. అదే సామాజికవర్గానికి చెందిన మహిళ దుఃఖంలో ఉంటే అవమానిస్తారా? అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. సునీతను అవమానించిన మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్ వెంటనే ఆమెకు క్షమాపణలు చెప్పాలన్నారు.

ఇప్పుడు సెంటిమెంట్లు గుర్తొచ్చాయా?: మేడిపల్లి సత్యం

సిటింగ్ ఎమ్మెల్యే చనిపోతే పోటీ పెట్టకుండా ఏకగ్రీవం చేసే సంప్రదాయానికి తూట్లు పొడిచిందే కేసీఆర్ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు లేని సెంటిమెంట్లు.. కేటీఆర్‌కు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా? అని ప్రశ్నించారు. కేటీఆర్ డ్రామాలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో చెల్లవని, ఆ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికే పట్టం కడతారని పేర్కొన్నారు. పీజేఆర్ చనిపోయాక జరిగిన ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఆయన కుమారుడు విష్ణు పోటీ చేస్తే.. బీఆర్ఎస్ తరపున కేసీఆర్ అభ్యర్థిని పెట్టారని, ప్రస్తుతం కేటీఆర్ పక్కన తిరుగుతున్న విష్ణుకు ఆ సోయి కూడా లేదని విమర్శించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే కిష్టారెడ్డి, పాలేరు ఎమ్మెల్యే రాంరెడ్డి వెంకట్‌రెడ్డి చనిపోయినప్పుడు జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులను పోటీకి పెట్టిందని గుర్తు చేశారు. ఆ ఎమ్మెల్యేల కుటుంబాల కన్నీళ్లు కల్వకుంట్ల కుటుంబానికి అప్పుడు కనిపించలేదా? అని నిలదీశారు.



డీసీసీ అధ్యక్షులుగా కొత్త ముఖాలు

» ప్రస్తుత డీసీసీ అధ్యక్షులకు నో చాన్స్

» పార్టీలో ఐదేళ్లపాటు క్రమశిక్షణతో పని చేసినవారే అర్హులు

» మీనాక్షీ నటరాజన్, మహేశ్‌గౌడ్ స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా ఏఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లకు ప్రస్తుత అధ్యక్షుల్లో ఎవరినీ కొనసాగించకుండా.. కొత్తవారిని నియమించాలని నిర్ణయించింది. వారిలోనూ గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డ వారినే ఎంపిక చేయాలన్న నిబంధన పెట్టింది. అలాగే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల దగ్గరి బంధువులకు ఈసారి అవకాశం లేదని తేల్చేసింది. డీసీసీ అధ్యక్షులతో సోమవారం జూమ్ ద్వారా నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్ష నియామక ప్రక్రియలో పాటించాల్సిన నియమాలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ ఈ మేరకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. డీసీసీ అధ్యక్షులుగా దరఖాస్తు చేసుకునేవారు కనీసం ఐదేళ్లపాటు క్రమశిక్షణతో, నిరంతరం పార్టీ కోసం పనిచేస్తున్నవారై ఉండాలన్నారు. అలా లేనివారి దరఖాస్తులను ఏఐసీసీ పరిశీలకులు తొలగిస్తారని స్పష్టం చేశారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షులుగా పనిచేస్తున్నవారికి ఎట్టిపరిస్థితుల్లోనూ రెండోసారి అవకాశం ఉండబోదన్నారు. అలాగే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల దగ్గరి బంధువులకు కూడా డీసీసీ అధ్యక్షులుగా అవకాశం కల్పించడం లేదని స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్ష నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా నాయకులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కాగా, ప్రస్తుతం జిల్లాల పర్యటనల్లో ఉన్న ఏఐసీసీ పరిశీలకులతో నాయకులు వ్యక్తిగత సంభాషణలు, సమావేశాలు నిర్వహించవద్దని, అలాగే స్థానిక నేతల ఇళ్లు, కార్యాలయాల్లో జిల్లా సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. పార్టీ కార్యాలయంలోగానీ, అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతాల్లోగానీ ఈ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏఐసీసీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటు చోరీ కార్యక్రమంలో కనీసం గ్రామానికి వంద సంతకాలు సేకరించాలని సూచించారు.



దీపావళి ఎప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి రాష్ట్ర సర్కారు ఇప్పటికే ఇచ్చిన జీవోలో ఉన్న జాబితా ప్రకారం దీపావళి పండుగ ఈ ఏడాది అక్టోబరు 20వ తేదీనే. కానీ.. క్యాలెండర్లలో సూర్యోదయ సమయానికి 21వ తేదీన అమావాస్య కనిపిస్తుండడంతో చాలా మంది గందరగోళానికి గురవుతున్నారు. మరోవైపు.. 18వ తేదీ శనివారం, 19వ తేదీ ఆదివారం రావడంతో.. 20న దీపావళి సెలవు వస్తే మూడురోజులూ ఊళ్లకు వెళ్దామని కొందరు భావిస్తున్నారు. కాబట్టి సందేహాలకు తావు లేకుండా.. సెలవు ఎప్పుడో వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీపావళి అనగానే.. అందరికీ గుర్తొచ్చేది ధనలక్ష్మీ పూజ, కేదార వ్రతం. నరకచతుర్దశినాడు అభ్యంగన స్నానం సరేసరి. పండితులు చెబుతున్న దాని ప్రకారం సూర్యాస్తమయంలో అమావాస్య తిథి వ్యాప్తి ఉన్నప్పుడు ధనలక్ష్మీ పూజ చేసుకుని పండుగ జరుపుతుంటారు. కొన్ని చోట్ల సూర్యోదయ సమయంలో కేదార వ్రతం చేసుకున్న తరువాతి నుంచి పండుగగా పరిగణిస్తారు. ఇలా రకరకాల అభిప్రాయాలు, ఆనవాయితీలు ఉండడమే ఈ సందేహాలకు కారణం. అయితే.. దీపావళి పండుగకు అమావాస్య ప్రధానం. ఆ తిథి 20వ తేదీ రాత్రి అంతా ఉంది. 21వ తేదీ సాయంత్రానికి పాడ్యమి వచ్చేస్తుంది. 21న రాత్రి అమావాస్య ఉండదు కాబట్టి.. 20వ తేదీనే దీపావళి జరుపుకోవాలని పలువురు పండితులు సూచిస్తున్నారు.

తెలంగాణ విద్వత్‌సభ ప్రకారం..

విశ్వావసు నామ సంవత్సరంలో (30-03-2025 తరువాతి నుంచి వచ్చే పండుగలు) వచ్చే పండుగలను ఎప్పుడు జరపాలనే దానిపై తెలంగాణ విద్వత్ సభ విడుదల చేసిన వివరాల ప్రకారం దీపావళి అక్టోబరు 20 (సోమవారం), 21 (మంగళవారం)న కేదార వ్రతం జరుపుకోవాలి.

దీపావళి సోమవారమే

దీపావళి పండుగ విషయంలో ఎలాంటి గందరగోళం లేదు. 20న సోమవారం ఉదయం సూర్యోదయానికి ముందు నరకచతుర్దశి స్నానం చేయాలి. సోమవారం సాయంత్రం దీపావళి ప్రయుక్త ధనలక్ష్మీ పూజ, మంగళవారం 21వ తేదీన ఉదయం నుంచి కేదార వ్రతాలు ఆచరించాలి. వీటిలో ధనలక్ష్మీ పూజ, నరకచతుర్దశి స్నానాన్ని ప్రజలంతా ఆచరిస్తారు. కేదార వ్రతం మాత్రం అందరూ చేసుకోరు. వంశపారంపర్యంగా ఆ సంప్రదాయం ఉన్నవారు మాత్రమే దాన్ని ఆచరిస్తారు.

- తూండ్ల. కమలాకరశర్మ సిద్ధాంతి,
కూకట్‌పల్లి, హైదరాబాద్

కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది!

» అందుకే బీజేపీ కార్యకర్తలపై దాడులతో పాటు తప్పుడు కేసులు పెట్టిస్తోంది

» బీజేపీ నాయకుడు మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

» బాధ్యులైన పోలీసులనూ సస్పెండ్ చేయాలి

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

» మధుకర్ కుటుంబానికి పరామర్శ


విలేకరులతో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

గోదావరిఖని/మంచిర్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని కాంగ్రెస్ నాయకులకు భయం పట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. బీజేపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి, వారు ఆందోళన చెందుతున్నారని.. అందుకే బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తూ, తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు యేట మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను కలిసి రాంచందర్‌రావు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అధికార దుర్వినియోగం జరుగుతోందన్నారు. ఆ పార్టీ మాజీ ఎంపీటీసీ మొదలు ఎమ్మెల్యేల వరకు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసులను వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలువురు ఎమ్మెల్యేలు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. వేమనపల్లిలో మధుకర్ వల్ల తాము ఓడిపోతామన్న భయంతో మాజీ జడ్పీటీసీ సంతోష్, గాలి మధు మరికొందరు అతనిపై నానా రకాలుగా ఒత్తిళ్లు తెచ్చారని చెప్పారు. చివరికి అట్రాసిటీ కేసులు పెట్టి వేధించారని, బాధితులకు అండగా నిలవాల్సిన ఎస్సై కోటేశ్వర్ ఇందుకు భిన్నంగా వ్యవహరించారని తెలిపారు. సీఐ బన్సీలాల్ సైతం కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతూ మధుకర్‌ను అవమానించాడన్నారు. పార్టీ కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందని, బెదిరింపులకు భయపడేది లేదని చెప్పారు. బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే ప్రతీకారం తప్పదని రాంచందర్‌రావు హెచ్చరించారు. మధుకర్ కేసులో ఎఫ్ఐఆర్‌లో పేరున్న రుద్రభట్ల సంతోష్, గాలి మధుతో పాటు 13 మందిని వెంటనే అరెస్టు చేయాలని, బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగితే పార్టీ పక్షాన ఉద్యమిస్తామన్నారు.

బీజేపీ నేతల మధ్య వాగ్వాదం

నీల్వాయిలో మధుకర్ కుటుంబాన్ని రాంచందర్‌రావు పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న క్రమంలో అక్కడే ఉన్న వెంకటేశ్ నేత, గోమాసే శ్రీనివాస్ మధ్య వాగ్వాదం జరిగింది. రాంచందర్‌రావు పక్కనే వెంకటేశ్ నేత కూర్చోవడంతో అతడిని లేపి మృతుడి తండ్రిని కూర్చోబెట్టాలని శ్రీనివాస్ సూచించారు. ఈ క్రమంలో మాజీ ఎంపీని అరేయ్ వెంకటేశ్ అని పిలిచారు. స్పందించిన వెంకటేశ్.. 'అరేయ్ ఒరేయ్ అంటే చెంప పగులుద్ది. నోర్మూసుకో' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిగా శ్రీనివాస్.. 'బట్టలు ఊడదీసి కొడతా' అంటూ హెచ్చరించారు. ఒక దశలో కూర్చుని ఉన్న వెంకటేశ్.. శ్రీనివాస్ వైపు వెళ్లే ప్రయత్నం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ కల్పించుకుని ఇరువుర్ని శాంతింపజేశారు. రాంచందర్‌రావు సమక్షంలోనే ఇలా జరగడంతో పార్టీ నాయకులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.

ఎలాగూ జైలుకెళ్తున్నా కదా అని మళ్లీ కిరాతకం

» మెదక్ గిరిజన మహిళ హత్యాచారం కేసులో వీడిన మిస్టరీ

» మరో కేసులో జీవిత ఖైదు ఖాయమని తెలిసి దుశ్చర్యకు పాల్పడ్డ కిరాతకుడు

కొల్చారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తప్పు చేశాం శిక్ష పడడం రెండ్రోజుల్లో జైలుకెళ్లడం గ్యారంటీ.. ఆ వెళ్లేలోపు మళ్లీ అదే తప్పు చేస్తే ఏమవుతుందిలే అనుకున్నాడో పాత నేరస్థుడు.. ఓ హత్యాచారం కేసులో జీవిత ఖైదు పడి జైలుకి వెళ్లే ముందు తన కోరిక తీర్చుకునేందుకు మరో మహిళను అత్యాచారం చేసి చిత్రహింసలు పెట్టి చంపేశాడు. మెదక్‌లో శనివారం వెలుగు చూసిన గిరిజన మహిళ హత్యాచారం కేసును పోలీసులు ఛేదించారు. కూలి పని ఉందని మహిళను నమ్మించి తీసుకెళ్లి అత్యాచారం చేసి ఆమె ప్రాణాలు కోల్పోవడానికి కారణం ఫకీర్ నాయక్ అనే పాత నేరస్థుడేనని తెలిపారు. మెదక్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సేవాలాల్ తండాకు చెందిన ఫకీర్ నాయక్ ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా అంబోజిగూడలో నివాసం ఉంటున్నాడు. మెదక్ జిల్లాలోనే ఫకీర్ నాయక్‌పై గతంలో హత్యాచారం సహా ఏడు కేసులు ఉన్నాయి. ఇందులో మెదక్‌లో ఓ మహిళ హత్యాచారం కేసు విచారణ ముగిసి ఇటీవల తుది తీర్పునకు వచ్చింది. అక్టోబరు 13న కోర్టు తీర్పు వస్తుందనగా.. తనకు ఎలాగో జీవితు ఖైదు పడడం ఖాయమని గ్రహించిన నాయక్.. జైలుకి వెళ్లేలోపు ఎలాగైనా కోరిక తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా శుక్రవారం(అక్టోబరు10) మెదక్‌లోని కూలీల అడ్డా వద్ద పని కోసం ఎదురుచూస్తున్న మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని ఓ తండాకి చెందిన గిరిజన మహిళపై కన్నేశాడు. పని ఉందని మాయమాటలు చెప్పి ఆమెను బస్సులో ఏడుపాయల కామన్ వద్దకు తీసుకొచ్చి అక్కడి ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. తన కోరిక తీర్చాలని ఆమెను బలవంతం చేశాడు. అందుకు నిరాకరించిన ఆ మహిళను అక్కడి ఓ చెట్టుకు కట్టేసి వివస్త్రను చేసి అత్యాచారం చేశాడు. అనంతరం కర్ర, రాయితో ఆమెను తీవ్రంగా కొట్టి చనిపోయింది అనుకుని వదిలేసి వెళ్లిపోయాడు. మెదక్ చర్చి వెనక చెట్లపొదల్లో దుస్తులు దాచేసి అక్కడే స్నానం చేసి వేరే దుస్తులు మార్చుకుని రాత్రి అక్కడే నిద్రించాడు. మరోపక్క, రాత్రి అంతా అక్కడే అపస్మారక స్థితిలో పడి ఉన్న మహిళను శనివారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో విషయం వెలుగులోకి రాగా బాధిత మహిళ మాత్రం చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించింది. అయితే, కేసు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీలను జల్లెడ పట్టిన పోలీసులు.. మెదక్ పాత బస్టాండ్ సమీపంలోని ఓ వైన్‌షాప్ వద్ద ఉన్న పాత నేరస్థుడు ఫకీర్ నాయక్‌ను గుర్తించారు. మంగళవారం ఉదయం అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తాను చేసిన కిరాతకాన్ని బయటపెట్టాడు. పాత కేసులో ఎలాగూ శిక్ష పడుతుందనే ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపాడు. ఫకీర్ నాయక్ ఇచ్చిన సమాచారం మేరకు హతురాలి ముక్కుపుడక, హత్యకు ఉపయోగించిన రాయి, కర్ర, చర్చి వద్ద పార వేసిన దుస్తులను పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఫకీర్ నాయక్ మరో హత్య కేసులో జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది.


దేవాదుల ప్రాజెక్టులపై సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్; చిత్రంలో సీతక్క

దేవాదుల పూర్తికి సర్కార్ కట్టుబడి ఉంది

- ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తాం: ఉత్తమ్

హైదరాబాద్/వరంగల్/చేర్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తిచేసి, ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో దేవాదుల ప్రాజెక్టు పురోగతిపై మంత్రి సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. దేవాదులలోని అన్ని ప్యాకేజీలను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేస్తామని, పాలనపరమైన అడ్డంకులన్నీ తొలగించి, వేగవంతంగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా హనుమకొండ, వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాలకు 5.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటిదాకా 3.17 లక్షల ఎకరాలకు నీరందుతోందన్నారు. ప్రాజెక్టు సవరణ అంచనా వ్యయం రూ.18,500 కోట్లు కాగా.. ఇప్పటిదాకా రూ.14,269 కోట్లు వెచ్చించామని పేర్కొన్నారు. ప్రాజెక్టు మూడో దశలోని మిగిలిన భూసేకరణ, లైనింగ్, మెకానికల్ పనులన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కాగా, దేవాదుల-8 ప్యాకేజీలో భాగంగా జనగామ నియోజకవర్గంలోని తపాస్‌పల్లి, కన్నెబోయినగూడెం రిజర్వాయర్ల పరిధిలోని అసంపూర్తి కాలువ పనులను పూర్తి చేయాలని, భూసేకరణ నిధులను రైతులకు వెంటనే చెల్లించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌ను కోరారు. ఆయా అంశాలపై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. సమీక్షలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, యశస్వినిరెడ్డి, సత్యనారాయణ రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం వచ్చే పంటలు సాగు చేయాలి: తుమ్మల



హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు మూస పద్ధతిలో వ్యవసాయం చేయకుండా అధిక ఆదాయం ఇచ్చే నూనెగింజలు, ఆయిల్‌పామ్, ఇతర ఉద్యాన పంటలు సాగు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వేరుశనగ విత్తనాల్లోనూ కొత్త వంగడాలు అందుబాటులోకి వచ్చాయని, అధిక దిగుబడితోపాటు ఆదాయం కూడా వస్తుందని తెలిపారు. జాతీయ నూనెగింజల మిషన్ పథకంలో భాగంగా రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీచేసే కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల మంగళవారం సచివాలయం నుంచి ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. 'రైతునేస్తం' కార్యక్రమంలో రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది రూ.66.67 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నూనెగింజల మిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబగద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల రైతులకు 45,350 ఎకరాల్లో సాగు చేయటానికి 38,434 క్వింటాళ్ల విత్తనాలు వంద శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్' నిధులు చెల్లిస్తాం

- బకాయిల వివరాలను పంపండి: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏవైనా సమస్యలు తలెత్తితే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యాలు సంబంధిత జిల్లా అధికార యంత్రాంగాన్ని సంప్రదించాలే గానీ, విద్యార్థులను స్కూళ్ల నుంచి పంపి వేయడానికి వీల్లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆయన.. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' స్కీమ్‌పై మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. విద్యా రంగాన్ని ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తున్న తమ సర్కారు ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఈ స్కీమ్ కింద ఆయా పాఠశాలలకు చెల్లించాల్సిన బకాయిల వివరాలు పంపాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. సదరు బకాయిల్లో కొంత మొత్తం వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. నిధులు రాకపోవడంతో కొన్నిచోట్ల స్కూళ్లు మూసేశారన్న సమాచారం ఉందని, ఆ స్కూళ్లను సందర్శించి నివేదిక సమర్పించాలని సంబంధిత డీఈవోలను ఆయన ఆదేశించారు.

బొట్టుగూడ పాఠశాలకు కోమటిరెడ్డి ప్రతీక్ పేరు

- ప్రభుత్వ ఉత్తర్వులు.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం
- ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 కోట్ల వ్యయంతో నిర్మాణం


బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల (నమూనా)

నల్లగొండ రూరల్, హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలకు.. కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ పాఠశాలగా ప్రభుత్వం నామకరణం చేసింది. ఇందుకు సంబంధించిన జీవోను మంగళవారం జారీ చేసింది. బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ పాఠశాల నూతన భవనానికి శ్రీకారం చుట్టారు. తన కుమారుడు కోమటిరెడ్డి ప్రతీక్ పేరిట ఏర్పాటు చేసిన కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.8కోట్ల వ్యయంతో భవన నిర్మాణాన్ని చేపట్టారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండేలా ఈ నూతన భవనంలో వసతులు కల్పిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కోమటిరెడ్డి ప్రతీక్ పేరును ఆ పాఠశాలకు ఖరారు చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. జీవో ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి, అందుకు కృషి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఒకటి లేదా రెండు నెలల్లోపే పాఠశాలను సిద్ధం చేసి ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభిస్తామని మంత్రి కోమటిరెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు కావాల్సిన అన్ని వసతులను పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నామని, ఆంగ్ల, ఉర్దూ మీడియంలో బోధనకు ఉపాధ్యాయులను కూడా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారానే నియమిస్తామని తెలిపారు. ఇక, వచ్చే మూడేళ్లలో నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను దశలవారీగా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అధునాతన సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు.

పేగు సంబంధిత వ్యాధి బాధితుడికి.. 2.50 లక్షలు

పెద్దపేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి మంత్రి వెంకటరెడ్డి రూ.2.50 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. నల్లగొండ జిల్లా ఎల్లారెడ్డిగూడెంకు చెందిన పోకల శ్రావణ్‌కుమార్ కొంతకాలంగా పెద్దపేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి అందించే లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ)ద్వారా సాయం కోరారు. స్పందించిన మంత్రి చికిత్సకు అవసరమైన రూ.2.50 లక్షలను సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ ద్వారా అందించారు. ఈ సందర్భంగా త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.500 కోట్లు!

- తక్షణమే నిధులు విడుదల చేస్తాం
- ఇకనుంచి ప్రతి నెలా రూ.340 కోట్లు
- వైద్యశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- నేడు హనుమకొండకు ముఖ్యమంత్రి



హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల నిర్మాణం కోసం తక్షణమే రూ.500 కోట్లు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఒకట్రెండు రోజుల్లోనే నిధులు విడుదలవుతాయన్నారు. వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణం తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహలు మంగళవారం ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బిల్లుల పెండింగ్ కారణంగా వైద్య కళాశాలల నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొన్న సంగతి తెలిసిందే. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇకపై ప్రతినెలా వైద్య, నర్సింగ్ ఆస్పత్రుల నిర్మాణం కోసం రూ.340 కోట్లు క్రమం తప్పకుండా విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. కాగా, వైద్య ఆరోగ్యశాఖలో కేంద్రం నుంచి వచ్చే నిధులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా పీఎం అభిమ్, జాతీయ ఆరోగ్య మిషన్, 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి అందాల్సిన నిధులను వెంటనే రాబట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కేంద్రం ఇచ్చే 60% నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున 40% నిధులను జమ చేస్తే, వెంటనే వస్తాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలు, నర్సింగ్, టిమ్స్ ఆస్పత్రులు, నిమ్స్ ఆస్పత్రి విస్తరణ, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పురోగతిపై సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టులకు ఇప్పటివరకు ఎంత ఖర్చు పెట్టారు? ఇంకెంత వెచ్చించాలి? అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. వైద్య, నర్సింగ్ కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణం నిలిచిపోకూడదని సీఎం ఆదేశించినట్లు తెలిసింది.

సీఎంతో రేవంత్‌తో మీనాక్షి భేటీ

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)ల నియామక ప్రక్రియ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, ప్రచారం తదితర అంశాలపై ఇరువురూ చర్చించారు. కాగా, సీఎం రేవంత్ బుధవారం హనుమకొండ వెళ్లనున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి స్మారక కార్యక్రమంలో పాల్గొని, నివాళులు అర్పించనున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

18న బీసీల బంద్‌కు మద్దతు

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం.. రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి: బీసీ సంఘాల బైక్ ర్యాలీలో కృష్ణయ్య


కోదండరాంతో కరచాలనం చేస్తున్న ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్/రాంనగర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న జరగనున్న రాష్ట్ర బంద్‌కు టీజేఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ అధినేత కోదండరాం ప్రకటించారు. బంద్‌లో టీజేఎస్ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కోదండరాంను కలిసిన బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు బంద్‌కు మద్ద తు ఇవ్వాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ.. రిజర్వేషన్ విషయంలో బీసీ సంఘాలు చేసే పోరాటాలన్నింటికీ తమ పార్టీ మద్దతుగా ఉంటుంద చెప్పారు. అంతకుముందు బీసీ రిజర్వేషన్లపై జరిగిన టీజేఎస్ ముఖ్యనేతల సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9కి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును షెడ్యూల్ 9లో చేర్చాలని, ఇందుకోసం కేంద్రం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల బీజేపీ, బీఆర్ఎస్‌లవి ద్వంద్వ వైఖరి అని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష నేతలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కాగా, బీసీ రిజర్వేషన్ల కేసులో ఇంప్లీడ్ అయిన 30 బీసీ సంఘా ల వాదనలు వినకుండా హైకోర్టు స్టే ఇవ్వడం అన్యాయమని బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన బైక్ ర్యాలీని కృష్ణయ్య ప్రారంభించి, పాల్గొన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత హైకోర్టు స్టే ఇవ్వడం బీసీలను మోసం చేయడమేనని అన్నారు. రిజర్వేషన్లు 50% దాటకూడదన్న నిబంధనతో అగ్రవర్ణాలు, పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆరోపించారు.

అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి: కూనంనేని

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ కోసం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఇందుకోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 18న బీసీ జేఏసీ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. బంద్‌కు తాము కూడా మద్దతిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఈ నెల 17న చలో రాజభవన్ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పార్టీ శ్రేణులను కోరారు. బీసీ జేఏసీ బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు.

రేపు క్యాబినెట్ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 అమలుపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు ఆటంకం ఏర్పడింది. హైకోర్టు స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ గురువారమే విచారణకు వచ్చే అవకాశం ఉంది. అదే రోజు మంత్రివర్గ సమావేశం జరుగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక మెట్రో రైలు ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతల నుంచి ఎల్అండ్‌టీ సంస్థ వైదొలగడంతో ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. దీంతోపాటు మూసీ ప్రాజెక్టు, గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం, టీ-ఫైబర్ విస్తరణ, ఫ్యూచర్ సిటీ అంశాలు క్యాబినెట్ భేటీలో చర్చకు రానున్నాయి. వివిధ సాగునీటి పారుదల ప్రాజెక్టుల అంచనాలను పెంచే అంశంపైనా చర్చించవచ్చని సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం, సమ్మక్క-సారలమ్మ ఆనకట్ట, దేవాదుల ఆరో ప్యాకేజీ వంటి విషయాలు చర్చకు రానున్నట్లు తెలిసింది.

42% రిజర్వేషన్లు.. ధర్మబద్ధమైన కోరిక

- బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకెళ్తాం
- సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుంది
- మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

న్యూఢిల్లీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు అనేది ధర్మబద్ధమైన కోరిక అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టులో తప్పక న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీల రిజర్వేషన్లపై రాజీపడే ప్రసక్తే లేదన్నారు. 42% బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని తేల్చిచెప్పారు. మంగళవారం ఆయన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని సుప్రీంకోర్టుకు వెళ్లి కలిశారు. ఆయనతో సుమారు గంటకు పైగా భేటీ అయ్యారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే జీవో 9పై ప్రభుత్వం తరఫున బలంగా వాదనలు వినిపించాలని సింఘ్వీని కోరారు. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు రాజకీయాలతో సంబంధం లేదని, ఇది యావత్ తెలంగాణలోని బీసీల సమస్య అని తెలిపారు. బీసీల బతుకుల్లో వెలుగులు నింపాలనే చిత్తశుద్ధితో కాంగ్రెస్ పనిచేస్తోందని, అడ్డుకునే ప్రయత్నంలో బీజేపీ, బీఆర్ఎస్ ఉన్నాయని మండిపడ్డారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలు కేంద్రంలో, న్యాయస్థానాల్లో ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. బీసీలకు 42% రిజర్వేషన్లను అడ్డుకోవడమే బీజేపీ, బీఆర్ఎస్ ఉమ్మడి అజెండా అని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో బీసీ రిజర్వేషన్లు అమలు చేసి తీరతామని చెప్పారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని హైకోర్టు చెప్పడం ఎంతో బాధ కలిగించిందన్నారు. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు స్టే విధించిందని తెలిపారు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో గురువారం విచారణకు వచ్చే అవకాశం ఉందన్నారు.

వికసిత భారత్ దిశగా!

- గూగుల్ ఏఐ హబ్‌తో దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఊతం : మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత్ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుందని పేర్కొన్నారు. ఈ హబ్‌కు సంబంధించి ఏపీ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన ఒప్పందంపై ప్రధాని మోదీతో ఆ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. తమ కంపెనీ తొలి హబ్ ఏర్పాటు విశేషాలను ఆయన మోదీకి వివరించారు. ఈ సమాచారాన్ని పేర్కొంటూ సుందర్ పిచాయ్ చేసిన ట్వీట్‌కు మోదీ స్పందించారు. "ఏపీలోని డైనమిక్ సిటీ విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. మన డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఇది మరింత ఊతం ఇస్తుంది" అని మోదీ ట్వీట్ చేశారు. అంతకుముందు ఏఐ హబ్ ఏర్పాటుపై సుందర్ పిచాయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'విశాఖపట్నంలో గూగుల్ మొట్టమొదటి ఏఐ హబ్ ఏర్పాటుకు సంబంధించి మా ప్రణాళికలను ప్రధాని మోదీతో పంచుకోవడం ఆనందంగా ఉంది. ఇది ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. ఏఐ ఆవిష్కరణలను, దేశవ్యాప్తంగా వృద్ధిని ఈ హబ్ వేగవంతం చేస్తుందని పిచాయ్ పేర్కొన్నారు.

'ఎన్‌వోసీ' ఇంజనీర్లపై బదిలీ వేటు

(మొదటిపేజీ తరువాయి)

రావడంతో ఏకంగా 51 మంది ఇంజనీర్లపై బదిలీ వేటు వేసింది. నీటిపారుదల శాఖ చరిత్రలోనే తొలిసారిగా వర్కింగ్ అరేంజ్‌మెంట్ పేరుతో వారికి స్థానచలనం కల్పించింది. హైదరాబాద్ సీఈ పరిధి నుంచి ఇతర జిల్లాలకు ఆన్‌డ్యూటీపై పంపించింది. వారి స్థానంలో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న వారికి బాధ్యతలు అప్పగిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం మెమో నెం.8180 జారీ చేశారు. ఏఈ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ), సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ), డిప్యూటీ సీఈ హోదాలో హైదరాబాద్ సీఈ పరిధిలో పనిచేస్తున్న మొత్తం 51 మంది ఇంజనీర్లను హైదరాబాద్ నగరం బయటి ప్రాంతాలకు పంపించారు. వారి స్థానంలో జిల్లాల్లో పనిచేస్తున్న 55 మంది ఇంజనీర్లను ఆన్‌డ్యూటీపై హైదరాబాద్ సర్కిల్ సీఈ కార్యాలయం పరిధిలో నియమించారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఈ మేరకు ఉద్యోగుల సర్దుబాటు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నీటిపారుదల శాఖలో హైదరాబాద్, సంగారెడ్డి చీఫ్ ఇంజనీర్(సీఈ) ప్రాంతాలంటేనే ఎన్‌వోసీల జారీకి కేంద్రాలనే ఆరోపణలున్నాయి. పైసలిస్తే చాలు.. చెరువులు, కుంటలు, కాల్వల్లో నిర్మాణాలకు కూడా నిరభ్యంతరంగా ఎన్‌వోసీలు ఇస్తారనే పేరుంది. దీనిపై ఇప్పటికే సీఎం కార్యాలయంతోపాటు నీటిపారుదల శాఖ మంత్రికి కూడా ఫిర్యాదులు వచ్చాయి. దాంతో ఈ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని వారం క్రితం ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో దీనిపై కసరత్తు పూర్తి చేశారు. పైరవీలు, రాజకీయ పలుకుబడితో కార్యాలయం పరిధిలో దీర్ఘకాలంగా తిష్టవేసి అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలుండడంతో క్షేత్ర స్థాయి పోస్టుల్లో పనిచేసే ఇంజనీర్లందరినీ బదిలీ చేయాలని మంత్రి ఆదేశించినట్టు తెలిసింది. ఉద్యోగుల సాధారణ బదిలీలపై ప్రస్తుతం అమల్లో ఉన్న నిషేధాన్ని ఉల్లంఘిస్తే.. సంబంధిత ఉద్యోగుల జీతాలను ఆర్థిక శాఖ నిలుపుదల చేసే అవకాశం ఉండడంతో ప్రస్తుతానికి ఆన్‌డ్యూటీపై ఇతర ప్రాంతాలకు పంపించి.. నిషేధం ఎత్తివేసిన తర్వాత బదిలీ చేయాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది.

కొత్తకుంట ఎన్‌వోసీతో కదిలిన డొంక..

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్‌లోని కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు ఎన్‌వోసీ జారీ చేసినట్టు వచ్చిన ఆరోపణలపై ఇటీవల నీటిపారుదల శాఖ విచారణ జరిపించగా.. సంచలన అంశాలు వెలుగుచూశాయి. కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్ 8.284 ఎకరాల్లో విస్తరించి ఉండగా, 2.03ఎకరాలేనని పేర్కొంటూ ఎన్‌వోసీ జారీ చేశారని హైడ్రా, నీటిపారుదల శాఖ విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై ఆరోపణలు రావడంతో ఎన్‌వోసీ జారీ రికార్డులను మాయం చేసినట్టు వెల్లడైంది. నిబంధనల ప్రకారం.. ఎన్‌వోసీ జారీ చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి ఫైలు రావాలి. ఆ ఫైలులో నోట్స్ ఉంటాయి. కానీ, అసలు ఫైలే లేకుండా ఎన్‌వోసీ జారీ చేయడంపై ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ సీఈ కె.ధర్మను గతంలోనే పోస్టు నుంచి తొలగించి సరెండర్ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఏఈఈ వి.గంగరాజు ఏడాదిగా విధులకు గైర్హాజరవుతున్నారు.డీఈఈ కె.జగదీశ్వర్, ఈఈ కె.బన్సీలాల్, ఎస్ఈ హైదర్‌ఖాన్ సైతం పాత్రధారులుగా గుర్తించారు. వీరిలో గంగరాజు, కె.జగదీశ్వర్‌ను ప్రభుత్వం ఓడీపై ఇతర జిల్లాలకు పంపించింది. మరో ఎస్ఈ పుష్కర్‌ను ఇటీవలే బదిలీ చేసింది.

హలో ఏపీ... ఓకే గూగుల్

(మొదటిపేజీ తరువాయి)

అతిపెద్ద ఏఐ డేటా హబ్‌ను విశాఖలో ఏర్పాటు చేయనున్నట్టు అంతర్జాతీయ ఐటీ దిగ్గజం గూగుల్ ప్రకటించింది. మంగళవారం ఢిల్లీలోని తాజ్ మాన్‌సింగ్ హోటల్‌లో జరిగిన 'భారత్ ఏఐ శక్తి' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గూగుల్-ఏపీ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఏఐ డేటా సెంటర్ ఏర్పాటులో భాగంగా గూగుల్ 10 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతుందని రాష్ట్రప్రభుత్వం భావించగా... అది 15 బిలియన్ డాలర్లకు చేరింది. "ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం వచ్చే ఐదేళ్ల కాలంలో 15 బిలియన్ డాలర్ల(రూ.1,33,000 కోట్లు) పెట్టుబడులు పెడతాం" అని గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ ప్రకటించారు. అమెరికా వెలుపల పెట్టుబడుతున్న అతి భారీ పెట్టుబడి ఇదే అని గూగుల్ స్పష్టం చేసింది. అమెరికా వెలుపల ఏర్పాటవుతున్న అతిపెద్ద 'ఏఐ హబ్' కూడా ఇదే కానుంది. గూగుల్ గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ సామర్థ్యంతో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేస్తుంది. దీనిని దశలవారీగా పెంచుతూ పోతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గూగుల్ యూజర్లకు మరింత వేగంగా సేవలందించేలా విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటవుతుంది. గూగుల్ జెమినై, గూగుల్ సెర్చ్, గూగుల్ వర్క్ స్పేస్, యూట్యూబ్, గూగుల్ క్లౌడ్, జీ-మెయిల్ తదితర సేవలను విశాఖలో ఏర్పాటయ్యే ఏఐ హబ్ ద్వారానే గూగుల్ అందిస్తుంది. భారత్‌తో సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియాలాంటి దేశాలకూ విశాఖ ఏఐ డేటా హబ్ నుంచే గూగుల్ సేవలు అందుతాయి. మొత్తంగా విశాఖ నుంచి 12 దేశాలకు కనెక్టివిటీకి అవసరమైన మౌలిక సదుపాయాలను గూగుల్ ఏర్పాటు చేస్తుంది. ఇందులోభాగంగా సబ్‌సీ (సముద్ర గర్భం) కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మిస్తోంది.20 లక్షల మైళ్లకంటే పొడవైన సబ్ సీ కేబుల్ ద్వారా విశాఖప్రపంచానికి కనెక్టివిటీ కేంద్రంగా మారుతుంది.

మేలి మలుపు...

గూగుల్ ఏఐ హబ్... విశాఖ నగరానికి, ఏపీకి మాత్రమే కాదు, మొత్తం దేశ ఐటీ రంగ ప్రస్థానంలోనే మేలి మలుపులాంటిది. పెట్టుబడులపరంగానే కాదు... ఉద్యోగాల కల్పనలోనూ 'ఐటీ హబ్' కొత్త చరిత్ర సృష్టించనుంది. 2029 నాటికి రాంబిల్లి, అడవివరం, తర్లుపాడులో మూడు ఏఐ డేటా సెంటర్లను నిర్మించి కార్యకలాపాలను ప్రారంభిస్తామని గూగుల్ ప్రకటించింది. వీటిలో... లక్షన్నర నుంచి రెండు లక్షల మంది నిపుణులు పని చేసే అవకాశముంది. ప్రస్తుతం ఒక గిగావాట్ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఏఐ హబ్... దశలవారీగా నాలుగు గిగావాట్లకు చేరనుంది. అప్పటికి ఉద్యోగుల సంఖ్య కూడా రెట్టింపవుతుంది. కాగా.. హైదరాబాద్‌కు 'మైక్రోసాఫ్ట్' రాకతో ఇతర అనేక అనుబంధ, సంబంధిత కంపెనీలు తరలి వచ్చాయి. ఐటీ రంగ వికాసానికి అవసరమైన 'ఎకో సిస్టమ్' అభివృద్ధి చెందింది. విశాఖలోనూ ఇదే జరగనుందని... గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుతో అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకూ విశాఖ వేదికగా మారుతుందని చెబుతున్నారు.


సెల్ఫీ తీసుకుంటున్న కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, గూగుల్ క్లౌడ్ ప్రతినిధులు

అప్పుడు హైదరాబాద్.. ఇప్పుడు విశాఖ

- ఏపీకి గూగుల్ రాక చరిత్రాత్మక ఘట్టం..
- ఈ ప్రాజెక్టు కోసం లోకేశ్ ఎంతో కష్టపడ్డాడు: చంద్రబాబు

గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడం.. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చరిత్రాత్మక ఘట్టమని, ఆవిష్కరణలు, అవకాశాలకు కొత్త శకమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "1990ల చివర్లో మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్ తీసుకొచ్చాను. హైటెక్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ దశ మారింది. ఈ రోజు గూగుల్ విశాఖ వస్తుండడం నాకు గర్వకారణం. వైజాగ్‌లో ఏఐ డేటా హబ్ రాకతో ఏపీ దశ మారుతుంది" అని ఆయన పేర్కొన్నారు. విశాఖకు గూగుల్ రావడంలో లోకేశ్ కృషిని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. 'లోకేశ్ గూగుల్‌తో కలిసి చాలా సన్నిహితంగా పనిచేశాడు.. వారి కార్యాలయాన్ని సందర్శించాడు.. చాలా సమయం కేటాయించాడు.. క్రమం తప్పకుండా నాకు సమాచారం అందించాడు. ఈ ప్రాజెక్టును 12 నెలల్లో తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. 13 నెలలు పట్టినప్పటికీ.. మొత్తానికి సాధించగలిగాం. ఈ విజయం పట్ల గర్వపడుతున్నాను' అని తెలిపారు. ఇక.. విశాఖలో ఏఐ హబ్ ఏర్పాటు ఆంధ్రప్రదేశ్, గూగుల్‌కే కాదు.. యావద్దేశానికే చరిత్రాత్మకమైందని లోకేశ్ అన్నారు. డేటా ఇంధనం అయితే.. డేటాసెంటర్లు రిఫైనరీలాంటివాని ఆయన పేర్కొన్నారు. అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన యువత నైపుణ్యం పెంచి, కొత్త అవకాశాలకు సిద్ధం చేయాలని.. ఏఐని స్వీకరించాలని అభిప్రాయపడ్డారు. ఏఐ డేటా హబ్ ఏర్పాటుతో విశాఖపట్నం గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా మారుతుందని గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ అన్నారు.

ఇలాంటి వాడిని ఎందుకు కన్నావ్!?

- భర్త వేధింపులు తాళలేక పిల్లలను చంపి, భవనంపై నుంచి దూకిన తల్లి
- కవల పిల్లల్లో ఒకరికి రాని మాటలు
- లోపం నీవల్లే అంటూ భర్త వేధింపులు
- వేదనతో తీవ్ర నిర్ణయం తీసుకున్న భార్య
- హైదరాబాద్ బాలానగర్‌లో ఘటన

బాలానగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పెళ్లయిన ఏడాదికే కవలలు పుట్టారు. ఒకే సారి అమ్మాయి, అబ్బాయి పుట్టడంతో ఆ దంపతులు మురిసిపోయారు. కానీ, ఆ కవలల్లోని అబ్బాయికి రెండేళ్లయినా మాటలు సరిగా రాకపోవడం ఆ దంపతుల మధ్య చిచ్చు రేపింది. పిల్లాడిలోని లోపానికి.. నువ్వే కారణం, పిల్లల్ని కనేది ఇలాగేనా, ఇలాంటి వాడిని ఎందుకు కన్నావ్.. అంటూ భర్త నుంచి ఎదురైన వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురైన భార్య తీవ్ర నిర్ణయం తీసుకుంది. రెండేళ్ల వయసున్న తన కన్నబిడ్డలిద్దరి ప్రాణం తీసి.. ఆ తర్వాత భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్‌లో మంగళవారం వెలుగు చూసిన ఈ హృదయ విదారక ఘటనలో సాయిలక్ష్మి అనే వివాహిత, ఆమె పిల్లలు చేతన్ కార్తికేయ, లాస్యతవల్లి మరణించారు. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు, సాయిలక్ష్మి తల్లిదండ్రుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని నూజివీడుకు చెందిన అనిల్ కుమార్‌కు గుంటూరు జిల్లా చెరుపల్లికి చెందిన చల్లారి సాయిలక్ష్మికి 2022 ఆగస్టు 8న వివాహమైంది. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగి అయిన అనిల్ కుమార్.. వివాహ అనంతరం బాలానగర్ పరిధి పద్మానగర్ ఫేజ్-1లోని ఓ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో కాపురం పెట్టాడు. అనిల్, సాయిలక్ష్మి దంపతులకు 2023 అక్టోబరులో ఇద్దరు కవలలు జన్మించారు. వారిలో కుమార్తె లాస్యత వల్లి చక్కగా మాట్లాడుతుండగా, కుమారుడు చేతన్ కార్తికేయకు రెండేళ్లయిన మాటలు రావడం లేదు. దాంతో చేతన్‌కు స్పీచ్ థెరపీ ద్వారా శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు. అయితే, కుమారుడిలో ఉన్న లోపం విషయంలో అనిల్ తరచూ సాయిలక్ష్మిని సూటిపోటి మాటలతో వేధించేవాడు. ఇలాంటి అబ్బాయిని ఎందుకు కన్నావ్..? కుటుంబంలో పరువు పోతోంది అంటూ బాధపెట్టేవాడు. ఈ విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవలు కూడా జరుగుతుండేది. ఇదేక్రమంలో వైజాగ్‌లోని బంధువుల ఇంట్లో మంగళవారం జరిగే కార్యక్రమానికి హాజరయ్యే అంశంలో సోమవారం రాత్రి కూడా గొడవ జరిగింది. భార్య, పిల్లలన్ని తీసుకెళ్తే అక్కడ తన పరువు పోతుందని, అందుకే ఒక్కడినే వెళ్తానని అనిల్ తేల్చిచెప్పాడు. భార్యాబిడ్డలను ఇంట్లోనే వదిలేసి మియాపూర్‌లో ఉంటున్న సోదరుడితో కలిసి వైజాగ్ వెళ్లేందుకు రాత్రి 10 గంటల సమయంలో అనిల్ వెళ్లిపోయాడు. ఈ వివాదంతో తీవ్ర మనోవేదనకు గురైన సాయిలక్ష్మి.. గొంతునులిమి తన పిల్లల ప్రాణం తీసింది. అనంతరం మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో నివాసముంటున్న భవనం మూడో అంతస్తు నుంచి కిందికి దూకింది. రోడ్డు మీద కొన ఊపిరితో కొట్టుకుంటున్న సాయిలక్ష్మిని చూసి అటుగా వెళుతున్న ఓ ర్యాపిడో డ్రైవర్ స్థానికులను అప్రమత్తం చేశాడు. ఈ లోపే ఆమె ప్రాణం విడిచింది. స్థానికులు పోలీసులకు, సాయిలక్ష్మి భర్త అనిల్‌కు సమాచారం ఇచ్చారు. సాయిలక్ష్మి తండ్రి మారయ్యబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనిల్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

ఓ తండ్రి తీర్పు

సంరక్షణ మరిచిన కుమారుడికి గుణపాఠం

- రూ.3 కోట్ల విలువ చేసే 3 ఎకరాల భూమి ప్రభుత్వానికి అప్పగింత


గోలి శ్యాంసుందర్ రెడ్డి

ఎల్కతుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆస్తి చేజిక్కించుకుని తన సంరక్షణ మరిచిన కుమారుడి ప్రవర్తనపై విసుగు చెందిన తండ్రి.. తన పేరిట ఉన్న వ్యవసాయ భూమిని ప్రభుత్వానికి అప్పగించాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరిగిందీ ఘటన. ఎల్కతుర్తికి చెందిన మాజీ ఎంపీపీ గోలి శ్యాంసుందర్ రెడ్డి, వసంత దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శ్యాంసుందర్‌రెడ్డి 2006 నుంచి 2011 వరకు ఎల్కతుర్తి ఎంపీపీగా సేవలందించారు. కుమార్తెకు వివాహం చేయగా ఆమె అమెరికాలో స్థిరపడ్డారు. కుమారుడు రంజిత్‌రెడ్డి సైతం అమెరికాలో ఉద్యోగం చేసి 2016లో తిరిగి ఇండియాకు వచ్చాడు. అప్పటి నుంచి హనుమకొండలో ఉన్న సొంత ఇంట్లో భార్య పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. శ్యాంసుందర్‌రెడ్డి భార్య వసంత 2021లో మృతి చెందారు. అప్పటి నుంచీ ఆయన ఎల్కతుర్తిలో ఉన్న తన పాత ఇంట్లోనే ఒంటరి జీవితం గడుపుతున్నాడు. కన్న తండ్రి బాగోగులు చూడాల్సిన కుమారుడు రంజిత్‌రెడ్డి పట్టించుకోవడం మానేశాడు. హనుమకొండలో తన పేర ఉన్న ఇంటిని కుమారుడు రంజిత్‌రెడ్డి తన పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని.. అదేమని అడిగితే తనపై దాడి చేసి ఇంటి నుంచి గెంటివేశాడని శ్యాంసుందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తన భార్య వసంత పేర ఉన్న మూడెకరాల భూమిని సైతం కొడుకు విరాసత్ పట్టా చేయించుకున్నట్లు ఆయన తెలిపారు. దాంతో పాటు తన కుమార్తెకు పసుపు కుంకుమల కింద ఇచ్చిన వ్యవసాయ భూమిని సైతం రంజిత్‌రెడ్డి ఆక్రమించుకుని సాగు చేసుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. తనను ఆదరించని.. బుక్కెడు బువ్వ పెట్టని కుమారుడికి తన ఆస్తి దక్కనివ్వనన్నారు. ఈ మేరకు తన పేర ఉన్న 6 ఎకరాల వ్యవసాయ భూమిలో 3ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, ఆర్డీవో రమేశ్ రాథోడ్‌ను సోమవారం కలిసి.. రూ.3కోట్ల విలువ గల 3ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు వీలునామా రాసి అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి అప్పగించిన భూమిలో.. తన భార్య వసంత జ్ఞాపకార్థం పక్కా భవనాలను నిర్మించి ప్రజలకు అంకితం చేయాలని కోరారు. తల్లిదండ్రులను ఆదరించని ప్రతి వ్యక్తికీ ఇది ఒక గుణపాఠం కావాలన్నారు.

సర్వే చేసి స్వాధీనం చేసుకుంటాం

మాజీ ఎంపీపీ గోలి శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వానికి అప్పగించిన భూమికి సంబంధించి.. సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తాం. భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

- ఐతరాజు ప్రసాద్‌రావు, తహసీల్దార్


రైతు వదిలేసిన పొలంలోనే ఉల్లిగడ్డలు సేకరిస్తున్న ప్రజలు

పెట్టుబడి 2 లక్షలు.. ఆదాయం 21 వేలు

- గిట్టుబాటు కాని ఉల్లి సాగు.. ప్రజలకొదిలేసిన రైతు

రాజోలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లి వంటి ఉల్లి పంటను ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే.. గిట్టుబాటు ధర లేక పంట పొలంలోనే ప్రజలకొదిలేసిన దీన రైతు గాథ జోగుళాంబ-గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. రాజోలి గ్రామ రైతు శేఖర్.. రెండెకరాల భూమి కౌలుకు తీసుకుని.. రూ2 లక్షల పెట్టుబడితో ఉల్లి పంట సాగు చేశాడు 70 క్వింటాళ్ల దిగుబడితో లాభం వస్తుందనుకున్న శేఖర్ ఆశ అడియాసగా మిగిలింది. మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి ధర రూ.300 పలుకుతోంది. దీని ప్రకారం మొత్తం అమ్మినా రూ.21 వేల రాబడి రాదు. దీనికి తోడు ఉల్లిగడ్డలను తవ్వి, కోయడానికి కూలీల ఖర్చు, మార్కెట్‌కు రవాణా ఖర్చు అదనం. దీంతో కూలీలను ఏర్పాటు చేయలేక.. పంట అమ్ముకుని నష్టాల పాలు కాలేక పొలంలోనే వదిలేసుకున్నాడు. అంతటితో ఆగక.. తన పొలంలో ఉల్లిగడ్డలున్నాయని, కావాల్సిన వారు ఉచితంగా తీసుకెళ్లొచ్చని రాజోలి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు చెప్పాడు. దీంతో ప్రజలు, స్థానిక వ్యాపారులు సంచులతో పొలంలోకి ఎగబడ్డారు. కొందరు 2,3 సంచుల్లో ఉల్లిగడ్డలు నింపుకుని సంతోషంగా వెళ్లారు. మరి కొందరు మోటారు సైకిళ్ల, ఆటోల్లో తరలించుకుని వెళితే.. ఒక కూరగాయల వ్యాపారి ఏకంగా ట్రాక్టర్ లోడ్ తీసుకెళ్లడం గ్రామంలో చర్చనీయాంశమైంది. తన పంట వృథా కాకూడదని, ఉచితంగా ప్రజలను తీసుకెళ్లాలని చెప్పిన రైతు శేఖర్ మనస్సు ఎంతో గొప్పదని గ్రామస్తులు అభిప్రాయ పడ్డారు. గిట్టుబాటు ధర లేక నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

టికెట్ తనిఖీలతో ఒకే రోజు 1.08కోట్ల ఆదాయం

- జోన్ చరిత్రలో రికార్డు.. 16,105 మందికి జరిమానాలు

హైదరాబాద్, అక్టోబర్ 14(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో సోమవారం విస్తృత స్థాయిలో టికెట్ తనిఖీలు నిర్వహించగా 16,105మంది పట్టుబడ్డారు. వీరిపై మొత్తంగా రూ.1.08కోట్ల జరిమానా విధించి వసూలు చేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ చరిత్రలోనే ఒక్కరోజులో ఇంత జరిమానా విధించి వసూలు చేయడం ఇదే మొదటిసారి. ఇందులో విజయవాడ డివిజన్‌లో అత్యధికంగా రూ.36.91 లక్షలు, గుంతకల్లు డివిజన్‌లో రూ.28 లక్షలు, సికింద్రాబాద్ డివిజన్‌లో రూ.27.9 లక్షలు, గుంటూరు డివిజన్‌లో రూ.6.46 లక్షలు, హైదరాబాద్ డివిజన్‌లో రూ.4.6 లక్షలు, నాందేడ్ డివిజన్‌లో రూ.4.08 లక్షల ఫైన్ వసూలు చేశారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సాధారణ రోజుల్లో నిర్వహించే తనిఖీల్లో ఫైన్‌ల ద్వారా దక్షిణ మధ్య రైల్వేకు రూ.47 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని తెలిపింది.

ఏసీబీ వలలో ఇద్దరు ప్రభుత్వోద్యోగులు

సిరిసిల్ల క్రైం/ వంగూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు పనుల కోసం ఇద్దరు రైతులను లంచం అడిగి.. ఏసీబీకి ఇద్దరు ప్రభుత్వోద్యోగులు, ఒక సహాయకుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సిరిసిల్లకు చెందిన ఇరుకుల్ల ప్రవీణ్.. రెండేళ్ల క్రితం 3 ఎకరాల భూమి సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే.. అందుకు రూ.30వేలు లంచం ఇవ్వాలని సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయ సర్వేయర్ వేణు డిమాండ్ చేశాడు. ఈ మేరకు వేణుకు సోమవారం ప్రవీణ్ రూ.10వేలు ఇచ్చాడు. సర్వే పూర్తయ్యాక మంగళవారం ప్రవీణ్ నుంచి సర్వేయర్ వేణుతోపాటు అసిస్టెంట్ సూర వంశీ.. మిగతా రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇక, నాగర్ కర్నూలు జిల్లా వంగూరు మండలం మాచినోనిపల్లి గ్రామ రైతు.. తమ ఊరికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి వంగూరు సబ్‌స్టేషన్ లైన్‌మన్ నాగేందర్ రూ.20వేలు లంచం డిమాండ్ చేశాడు. మంగళవారం వంగూరులో రైతు నుంచి రూ.15వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని నాగేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ మహబూబ్ నగర్ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

హైదరాబాద్ సహా 13 చోట్ల ఈడీ తనిఖీలు

- ఓ జ్యూవెలరీ సంస్థ ఖాతాల్లోని రూ.30 కోట్లు ఫ్రీజ్

హైదరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కోల్‌కతాకు చెందిన శ్రీ గణేష్ జ్యూవెలరీ హౌస్.. బ్యాంకులను మోసం చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఆ సంస్థ బ్యాంకు ఖాతాల్లోని రూ.30 కోట్లను స్తంభింపజేశారు. 25 బ్యాంకుల కన్సార్టియంకు శ్రీ గణేష్ జ్యూవెలరీ హౌస్ రూ.2,672 కోట్లు బకాయి పడింది. ఇందులో చాలా మొత్తం విద్యుత్ ప్రాజెక్టులకు మళ్లించారు. అందులో నష్టం వచ్చి విక్రయించినట్లు లెక్కల్లో చూపారు. కానీ, ఆ ప్రాజెక్టులను సంస్థ మాజీ డైరెక్టర్లతో కొనుగోలు చేయించి మోసానికి పాల్పడ్డారని ఈడీ అధికారులు పేర్కొన్నారు. పంజాబ్ సింధ్ బ్యాంకుకు రూ.70 కోట్ల రుణాన్ని ఎగవేసిన మరో సంస్థలోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. మనీ లాండరింగ్‌కు సంబంధించి కీలక ఆధారాలు సేకరించామని ఒక ప్రకటనలో తెలిపారు.

దళితులకు రక్షణ కల్పించండి: మల్లు రవి

న్యూఢిల్లీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దళితులకు రక్షణ కల్పించాలని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కాంగ్రెస్ ఎంపీల ఫోరం తెలంగాణ కన్వీనర్ మల్లు రవి లేఖలు రాశారు. ఇటీవల కలతపెట్టే సంఘటనల నేపథ్యంలో దళితుల్లో విశ్వాసం కల్పించాలని మంగళవారం లేఖల్లో కోరారు. సుప్రీం కోర్టులోనే సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి, సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనలు దళితుల భద్రతను ప్రశ్నార్థకంగా మార్చాయని పేర్కొన్నారు. ఈ ఘటనలు ఎంతోకాలంగా దళితుల్లో నెలకొన్న ఆందోళన, బాధను ప్రతిబింబింపజేస్తున్నాయన్నారు.

ఐక్లౌడ్ పాస్‌వర్డ్ రీసెట్ చేయండి

దర్యాప్తునకు అవసరమైన యాక్సెస్ అధికారులకు ఇవ్వండి

- మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీం ఆదేశం
- డేటా డిలీట్ చేసినట్టు తేలితే పిటిషన్ డిస్మిస్ చేస్తామని హెచ్చరిక
- తదుపరి విచారణను నవంబరు 18కి వాయిదావేసిన ధర్మాసనం



న్యూఢిల్లీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో తన ఐక్లౌడ్ పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసి, దర్యాప్తు అధికారులకు అందించాలని.. ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. డేటా డిలీట్ చేసినట్లు తేలితే ఆయన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు 2023 మార్చి 10న పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ప్రభాకర్ రావును ఈ కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ క్రమంలోనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ముందస్తు బెయిల్ ఇస్తేనే భారతదేశానికి తిరిగి వస్తానని ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం అందుకు తిరస్కరించింది. దీంతో ఆయన ఈ ఏడాది మే 9న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం మధ్యంతర రక్షణ కల్పించడంతో భారతదేశానికి వచ్చి సిట్ విచారణకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పిటిషన్.. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట మంగళవారం విచారణకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించగా, ప్రభాకర్ రావు తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు ప్రతివాదనలు చేశారు.

కస్టడీలోకి తీసుకుంటేనే..

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్ రావు కీలక నిందితుడని, ఆయన విచారణకు ఏ మాత్రం సహకరించట్లేదని తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ఫలితాలకు మూడు రోజుల ముందు, అంటే 2023 నవంబరు 29న.. 50 కొత్త హార్డ్‌డిస్కులను కొనుగోలు చేశారని, ఆ తర్వాత రికార్డ్ రూములోని సీసీ టీవీ కెమెరాలు స్విచ్ ఆఫ్ చేసి 36 పాత హార్డ్ డిస్కుల్లోని కీలక సమాచారాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత 2024 మార్చి 10న.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినప్పుడు 2025 ఏప్రిల్ 5న.. రెండుసార్లు ఫోన్‌ను ఫార్మాట్ చేశారని, ఇది ముమ్మాటికీ ఆధారాలు లేకుండా చేసే ప్రయత్నమేనని పేర్కొన్నారు. కీలకమైన ఐదో ఫోన్ గురించి ప్రశ్నిస్తే.. ఏడాదిలోపు వయసున్న తన మనవడు ఆడుకుంటూ కింద పడేయడంతో అది పూర్తిగా పగిలిపోయిందని చెబుతున్నారని, పాస్‌వర్డ్ అడిగితే మరిచిపోయానని అంటున్నారని.. ఇదంతా నమ్మశక్యంగా లేదని తెలిపారు. ఎస్ఐబీ చీఫ్ పదవి నుంచి వైదొలిగిన వెంటనే తమ వద్ద ఉన్న పూర్తి సమాచారాన్ని, ఇతర వివరాలన్నింటినీ కొత్తగా బాధ్యతలు అప్పగించిన అధికారికి అప్పగించాలని.. కానీ ప్రభాకర్ రావు అలా చేయకుండా అన్నీ ధ్వంసం చేశారని తెలిపారు. ఇది రాజకీయ కక్ష సాధింపునకు సంబంధించిన కేసు కాదన్నారు. మావోయిస్టుల పేరుతో రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, బిల్డర్లు, వ్యాపారులు, చివరికి.. న్యాయమూర్తుల ఫోన్లు సైతం ట్యాప్ చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ నేపథ్యంలో ఆయన విచారణకు సహకరించడం లేదని, కస్టడీలో విచారిస్తేనే నిజాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

డేటా ధ్వంసం కిందకు రాదు..

హార్డ్‌డిస్కులను మార్చడం అనేది నిఘా విభాగంలో సాధారణ ప్రక్రియ అని, అది డేటా ధ్వంసం కిందకు రాదని ప్రభాకర్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు తెలిపారు. ఒకవేళ ప్రభాకర్ రావు ఆ డేటాను ధ్వంసం చేసినా ఇతర నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న రెండు టెరాబైట్ల డేటాలో ఆ సమాచారం ఉంటుందని ధర్మాసనానికి చెప్పారు. ప్రభాకర్‌రావు విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారని, ఐక్లౌడ్ పాస్‌వర్డ్‌ను ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రీసెట్ చేసి ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతరం లేదని ఆయన పేర్కొన్నారు. అయితే, దర్యాప్తు పారదర్శకంగా జరగడంలేదని, ఎమ్మెల్యేలు, ఎంపీలు జోక్యం చేసుకుంటున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందుకే, ప్రక్రియ మొత్తాన్నీ వీడియో రికార్డింగ్ చేయాలని, ప్రభాకర్ రావు తరఫున కూడా ఒక ఫోరెన్సిక్ నిపుణుడికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభాకర్ రావు కోరిన అదనపు రక్షణలను తిరస్కరించిన ఆమె.. 'పరిధిని విస్తరించవద్దు' అంటూ హెచ్చరించారు. నోటీసు అందిన వెంటనే దర్యాప్తు అధికారుల ముందు హాజరు కావాలని.. విచారణకు పూర్తిగా సహకరించాలని ఆదేశించారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో ఐక్లౌడ్ ఖాతా పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసి, దర్యాప్తునకు అవసరమైన యాక్సెస్ ఇవ్వాలని తేల్చిచెప్పారు. తదుపరి విచారణ వరకూ మధ్యంతర రక్షణ కొనసాగుతుందన్న ధర్మాసనం.. నవంబరు 18వ తేదీకి కేసును వాయిదా వేసింది.

పోలవరం, దేవాదులపై 29న ప్రధాని మోదీ సమీక్ష

- ఇందిరమ్మ వరద కాలువపై కూడా..

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలవరం, దేవాదుల ప్రాజెక్టులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమీక్షించనున్నారు. 'ప్రగతి' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29న ఆయన సమీక్ష నిర్వహించనున్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపుపై ప్రభావిత రాష్ట్రాలు లేవనెత్తిన అభ్యంతరాలతో పాటు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ, పునరావాసంతో పాటు పలు అంశాలపై ఆరా తీయనున్నారు. గోదావరి నదిపై ఏపీలోని ధవళేశ్వరం వద్ద సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 42 కి.మీ. ఎగువన పోలవరం మండలం రామయ్యపేటలో పోలవరం ప్రాజెక్టును రూ.10,151.04 కోట్ల వ్యయంతో చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణ అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లకు చేరింది. ఇప్పటిదాకా 55.9 శాతం నిధులు వెచ్చించగా.. పనుల్లో 60.78 శాతం పురోగతి ఉంది. వాస్తవానికి 2017 డిసెంబరు 31 నాటికే ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని భావించగా, మధ్యలో పనులు జరగలేదు. దీంతో గడువును 2027 డిసెంబరు 31 దాకా పొడిగించారు. తెలంగాణలో నిర్మిస్తున్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంపై కూడా ప్రధానమంత్రి సమీక్ష చేయనున్నారు. 38.16 టీఎంసీల జలాలను తరలించి.. 2.49 లక్షల హెక్టార్లకు సాగునీటిని అందించడానికి వీలుగా దీన్ని చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద చేపట్టగా భూసేకరణ సమస్యలతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాలేదు. ఆ తర్వాత రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ అర్బన్, జనగామ, జగిత్యాల జిల్లాల్లో గ్రావిటీతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటిని అందించడానికి వీలుగా చేపట్టిన ఇందిరమ్మ వరద కాలువపై కూడా ప్రధానమంత్రి సమీక్ష చేయనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు 92శాతం మేర పూర్తికాగా.. ఆర్థిక పురోగతి కూడా 99శాతం మేర ఉంది. ఇది కూడా ఏఐబీపీలో ఉంది. ప్రాజెక్టు కోసం 99.82 హెక్టార్ల భూమిని సేకరించడంతో పాటు ప్రాజెక్టు నిర్వాసితులైన 291కుటుంబాలకు పునరావాసం ప్యాకేజీ అమలు చేయాల్సి ఉంది. వీటిపై ప్రధాని సమీక్షించి, తగిన ఆదేశాలు జారీ చేయనున్నారు.


వైద్య విద్య పీజీ పరీక్షల్లో గందరగోళం

- ఫొరెన్సిక్ పేపరులో 10 ప్రశ్నలకు బదులు 11
- అన్ని ప్రశ్నలకూ జవాబు రాయడం తప్పనిసరి
- ఏ ప్రశ్న తొలగించాలో తెలియక తంటాలు
- గైనకాలజీలో ఒక పేపరుకు బదులు మరొకటి
- ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వాకం

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య విద్య పరీక్షల్లో గందరగోళం నెలకొంది. వార్షిక పరీక్షల నిర్వహణలో కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ అధికారుల నిర్లక్ష్యం మరోమారు బయటపడింది. ఒక పేపరుకు బదులు మరొకటి ఇవ్వడం, పరీక్షా పత్రంలో పది ప్రశ్నలకు బదులు పదకొండు ఇవ్వడం లాంటి తప్పిదాలు ఈ పరీక్షల్లో చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది జనవరిలో జరిగిన పరీక్షల్లో రెండేళ్లనాటి రేడియాలజీ పాత పేపరును ఇచ్చిన వైనం తెలిసిందే. ప్రస్తుత పరీక్షల విషయానికి వస్తే.. 13న జరిగిన ఫోరెన్సిక్ పరీక్షలో పది ప్రశ్నలకు బదులు పదకొండు క్వశ్చన్స్ ఇచ్చారు. జాతీయ వైద్య కమిషన్ నిబంధనల మేరకు కేవలం పది ప్రశ్నలే ఇవ్వాలి. ఇతర కోర్సుల్లో మాదిరిగా వైద్యవిద్య పరీక్ష పత్రాల్లో ఆప్షన్స్ ఇవ్వరు. ఇచ్చిన ప్రతి ప్రశ్నకూ కచ్చితంగా జవాబు రాయాల్సి ఉంటుంది. అలా రాసిన జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. వాటిని సంబంధిత ప్రొఫెసర్స్ ఆన్‌లైన్‌లో దిద్దుతారు. అయితే ప్రశ్నాపత్రాన్ని దిద్దే క్రమంలో మెడికోలు రాసిన జవాబుకు ఒక్క మార్కు ఇవ్వకున్నా.. కొట్టేసినా.. నిర్ణీత సమయం పాటు జవాబు పత్రాన్ని చూడకపోయినా.. సదరు ప్రొఫెసర్ అందుకు గల కారణాన్ని పేర్కొనాల్సి ఉంటుంది. ఇంత పకడ్బందీగా సాఫ్ట్‌వేర్ ఉంటుంది. కానీ ఈ పరీక్షలో 11 ప్రశ్నలు ఇవ్వడంతో విద్యార్థులు తికమకపడ్డారు. చేసేది లేక అన్నింటికీ జవాబు రాశారు. ఇప్పుడు ఆ 11 ప్రశ్నల్లో దేన్ని తొలగించాలి? అనే నిర్ణయం తీసుకోలేక వర్సిటీ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. అదనంగా ఇచ్చిన 11వ ప్రశ్నే తొలగిస్తారా లేదా మరేదైనా ప్రశ్నను తొలగిస్తారా? ఒక వేళ అలా చేస్తే సాంకేతిక ఎదురయ్యే సమస్యను ఎలా అధిగమిస్తారన్నది ప్రశ్నగా మిగిలింది. ఈనెల 7న జరిగిన గైనకాలజీ పేపర్‌లోనూ గందరగోళం నెలకొంది. ఆ రోజు.. విద్యార్థులకు గైనకాలజీ మొదటి పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం ఇవ్వాల్సి ఉండగా, మూడో పేపరు ఇచ్చారు. విద్యార్థులు ఈ విషయాన్ని ఇన్విజిలేటర్స్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో.. అరగంట తర్వాత.. ఆ రోజు ఇవ్వాల్సిన పేపర్‌ను అందజేశారు. ఈ నేపథ్యంలో.. హెల్త్ వర్సిటీ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పంటల కొనుగోళ్లకు వేళాయె!

- నేటి నుంచి మక్కల సేకరణ
- 21 నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు
- 6 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు షురూ



హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వానాకాలంలో రైతులు పండించిన పంటల సేకరణ మొదలైంది. మూడు ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్నల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి మక్కల కొనుగోళ్లకు శ్రీకారం చుడుతోంది. ధాన్యం సేకరణ 6 జిల్లాల్లో ప్రారంభం కాగా.. నవంబరు నాటికి వేగం పుంజుకోనుంది. ఇక భారత పత్తి సంస్థ(సీసీఐ) దీపావళి పండగ మరుసటి రోజు నుంచి రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించనుంది. వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో 68 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా.. కోటిన్నర లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. రూ.21,112 కోట్లు సమీకరించి.. 80 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ నెల 1 నుంచి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టింది. నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సిరిసిల్ల, భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ప్రస్తుతం ధాన్యం సేకరణ చేపట్టారు. మరో పక్షం రోజుల్లో ధాన్యం సేరకణ జోరందుకోనుంది.

21 నుంచి పత్తి కొనుగోళ్లు

ఈ నెల 21 నుంచి రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. జాబ్ వర్క్ టెండర్లలో జిన్నింగ్ మిల్లర్లు తొలుత పాల్గొనకపోవడం, ఆ తర్వాత మంత్రి తుమ్మల చర్చలు జరపడంతో సమస్య తొలగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 328 జిన్నింగ్ మిల్లుల్లో దీపావళి తర్వాత నుంచి పత్తి కొనుగోళ్ల ప్రారంభించనున్నారు. 43.29లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేయగా.. 24.70లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా నమోదు చేసుకొన్న రైతులే పత్తి విక్రయించేలా సీసీఐ ఏర్పాట్లు చేసింది.

నేటి నుంచి మక్కల కొనుగోళ్లు

రాష్ట్రంలో బుధవారం నుంచి మక్కల కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. వానాకాలంలో 6,24,544 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేశారు. ఈ మేరకు 8.66 లక్షల టన్నుల మక్కలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెప్టెంబరు మూడో వారం నుంచే మక్కలు మార్కెట్లోకి రావడం ప్రారంభమైంది. కనీస మద్దతు ధర రూ.2,400 కాగా.. మార్కెట్ ధర రూ.1,800-2000 ఉంది. ఈ పరిస్థితుల్లో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

'పోలవరం-బనకచర్ల'ను పరిశీలించొద్దు

- సీడబ్ల్యూసీ, కృష్ణా, గోదావరి బోర్డులు ప్రాజెక్టు ప్రతిపాదనను తిరస్కరించాయి
- కేంద్ర జలశక్తి శాఖకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి లేఖ
- అత్యవసర భేటీ నిర్వహించాలని తెలంగాణ ఈఎన్‌సీ విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను పరిశీలించవద్దని కేంద్రాన్ని తెలంగాణ కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావుకు రాష్ట్ర నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి, గోదావరి ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు చేపడుతున్నారని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టును పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ), గోదావరి, కృష్ణా బోర్డులతో పాటు ప్రభావిత రాష్ట్రాలు తిరస్కరించాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్-90 (2) ప్రకారం పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున.. దీని నిర్మాణం, నిర్వహణ, నీటి వినియోగం అన్నీ కేంద్ర పరిధిలోకి వస్తాయని, ఏపీ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని గుర్తు చేశారు. అయినా ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టిందని, డీపీఆర్ కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు దిశగా ఏపీ ముందుకెళ్లకుండా కట్టడి చేయాల్సింది కేంద్రమేనని స్పష్టం చేశారు. కాగా, గోదావరి ట్రైబ్యునల్ తీర్పు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తూ ఏపీ ప్రభుత్వం పోలవరం-బనకచర్ల అనుసంధానం చేపడుతోందని.. అందువల్ల గోదావరి నదిని పంచుకునే రాష్ట్రాలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)ని తెలంగాణ కోరింది. ఈ మేరకు తెలంగాణ ఈఎన్‌సీ మహ్మద్ అంజద్ హుస్సేన్ లేఖ రాశారు. పోలవరం డీపీఆర్‌లో బనకచర్ల అనుసంధానం లేదని, దీనివల్ల పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ ప్రోటోకాల్‌లో మార్పులు జరుగుతాయని ఇదివరకే పీపీఏ లేఖ రాసిందని గుర్తు చేశారు. రాష్ట్రాలు, అన్ని కేంద్ర సంస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పోలవరం-బనకచర్ల అనుసంధానం డీపీఆర్ తయారీ కోసం ఏపీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఆ దిశగా ముందుకెళ్లకుండా అడ్డుకోవాలని కోరారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని ఇప్పటికే సీడబ్ల్యూసీ చైర్మన్‌కు కూడా ఈఎన్‌సీ లేఖ రాసినట్టు వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.